సమావేశము - VI
వాల్యూము - V
నెం. 1

వెల : రూ. 13-00
23 డిసెంబరు, 2016
శుక్రవారము,
(శక సం. 1938,
పుష్యం - 2)

# తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు - వాగ్రూప సమాధానములు | ... | 1 |
| 2. | సభా కార్యక్రమము: | ... | 15 |
| | వాయిదా తీర్మానాల అనుమతి గురించి | | |
| 3. | లఘుచర్చ: | | |
| | "రాష్ట్రంలో జాతీయ రహదారులు, ఆర్ & బి రోడ్లు మరియు వంతెనల" గురించి | ... | 15 |

# తెలంగాణ శాసన సభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ  ఎస్. మధుసూదనాచారి |
| ఉప సభాపతి | : | శ్రీమతి ఎం. పద్మా దేవేందర్ రెడ్డి |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శి | : | డా.వి. నరసింహాచార్యులు |
| సహాయ  కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్<br>శ్రీ  ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ సిహెచ్.  ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి వి. ఎస్. ప్రసన్న కుమారి |
| చీఫ్  రిపోర్టర్ | : | శ్రీ పి. శ్రీనివాస్ |

*****

# తెలంగాణ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

## ( ఆరవ సమావేశము – ఏడవ రోజు)

## శుక్రవారం, డిసెంబరు 23, 2016

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

MR. SPEAKER: Please resume your seats. Now, Question Hour.

### నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు

### ఆబ్కారీ స్టేషన్ల కోసం ప్రభుత్వ భవనాలు

* ప్రశ్న నెం.62 (1986)

శ్రీ వి. శ్రీనివాస గౌడ్ (మహబూబ్‌నగర్):- అబ్కారీ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింద సమాచారం తెలియజేస్తారా:

అ) అబ్కారీ పోలీసు స్టేషన్లను ప్రయివేటు అద్దె భవనాలలో నిర్వహిస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, అద్దె భవనాలలో వున్న సదరు స్టేషన్ల సంఖ్య ఎంత; ప్రతి సంవత్సరం వాటి కోసం చేస్తున్న వ్యయ పరిమాణం ఎంత;

ఇ) సదరు స్టేషన్లను ప్రభుత్వ భవనాలలోనికి మార్చాలనే ప్రతిపాదన ఏదైనా వుందా ;

ఈ) అయితే, ఎప్పటిలోగా వీటిని మార్చడమవుతుంది?

**మద్యనిషేధం మరియు అబ్కారీ శాఖ మంత్రి (శ్రీ టి. పద్మా రావు):**

అ) అవునండీ. 138 స్టేషన్లకు గాను 127 స్టేషన్లను ప్రయివేటు అద్దె భవనాలలో నిర్వహించడమవుతున్నది.

ఆ) 127 అబ్కారీ స్టేషన్ల నిమిత్తం రూ.1, 31, 46, 216– ల మొత్తాన్ని చెల్లించడమవుతున్నది.

ఇ) పరిశీలనలో ఉంది.

ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ వి. శ్రీనివాస్ గౌడ్:- ఈరోజు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ వారు అద్దె భవనాల నుంచి ప్రభుత్వ భవనాలు కట్టుకోవడానికి ఏవిధంగా ప్రయత్నం చేస్తున్నారో వీలైనంత త్వరలో ఎక్సైజ్ సబ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మంత్రి గారు ప్రభుత్వ భూములను చూసి వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు చాలా సంతోషం. పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు, ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు ఎలాగైతే సొంత వాహనాలు ఇచ్చారో అలాగే ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు కూడా సొంత వాహనాలు ఇస్తే వారు ఇంకా సమర్ధవంతంగా విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుంది. ప్రయివేట్ వాహనాల వల్ల పాడైపోయిన వాహనాల వల్ల వాళ్లు రాత్రి పూట వారు విధులు నిర్వహించలేక పోతున్నందున దాని మీద కూడా దృష్టి పెట్టాలి. దాని గురించి ఏదన్నా ప్రతిపాదన ఉంటే ఎప్పటి లోగా వాహనాలు సమకూరుస్తారో చెప్పాలి.

గీత కార్మికులు 500 సంవత్సరాల క్రితం చెట్లు ఏవిధంగా ఎక్కారో, యాంత్రికంగా అభివృద్ధి చెందిన ఈరోజుల్లో కూడా ఆ విధంగానే చెట్లు ఎక్కడం జరుగుతోంది. చెట్లు ఎక్కుతూ పడిపోయి ఈ సంవత్సరం 102 మంది చనిపోగా, 799 మంది శాశ్వతంగా అంగ వైకల్యం, 443 మంది పాక్షికంగా వైకల్యం పొందారు. చెట్లు ఎక్కడానికి ఏదో యంత్రం తయారు చేయబడిందని ఆ మధ్యన టి.వి.లలో చూడడం జరిగింది. అలాంటి యంత్రాలను కో–ఆపరేటివ్ సొసైటీల ద్వారా గీత కార్మికులకు కొనిచ్చే ప్రయత్నం ఏదన్నా జరుగుతోందా గౌరవ మంత్రి గారు చెప్పాలి.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ వారు గీత కార్మికుల నుంచి డబ్బులు ఎలా గుంజాలా అని ఆలోచించారు తప్ప చెట్లు పెంచాలని ఎప్పుడు కూడా ఆలోచించలేదు.

మొట్టమొదటిసారిగా మన ప్రభుత్వం కొన్ని కోట్ల చెట్లను నర్సరీల నుంచి కొనుక్కొచ్చి ప్రతి నియోజక వర్గంలో గ్రామంలో నాటడం జరిగింది. ఆ నాటిన చెట్లను పెంచడానికి డ్రిప్‌ల ఏర్పాటు గాని బోర్‌లు గాని వేశారా, ఏదన్నా శాశ్వత పద్ధతిని అవలంభిస్తున్నారా చెప్పాలి. ఈత చెట్లను, తాటి చెట్లను చాలా నాటారు. ఒకప్పుడు అసలు ఈ వృత్తినే పట్టించుకోలేదు, ఈ వృత్తిని ఎలా బంద్ చేయాలి, ఎలా నాశనం చేయాలి, అనే ఆలోచించారు. హైదరాబాద్ లాంటి పట్టణంలో మొత్తం వృత్తిని బంద్ చేయడం మేము చూశాము. కల్తీ కల్లు లేకుండా చూడాలంటే ఒకే ఒక మార్గం అదే చెట్లు పెంచడం. ప్రభుత్వం ముందుకు వచ్చి ఒక మంచి నిర్ణయం తీసుకొని చెట్లను పెంచడం జరుగుతోంది. చాలా నియోజక వర్గాల్లో బోర్‌లు వేసి డ్రిప్‌లు పెట్టించడానికి ఎమ్.ఎల్.ఎ.లు ముందుకు వచ్చారు. బోర్‌లు వేసి డ్రిప్‌లు పెట్టించడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని మీ ద్వారా అడుగుతున్నాను.

ప్రతి సొసైటీకి 5 ఎకరాల ల్యాండ్ ఇవ్వాలని జి.ఓ. ఉంది. ఎప్పటిలోగా సొసైటీలకు 5 ఎకరాల ల్యాండ్ ఇస్తారు అలాంటి ప్రతిపాదన ఏమన్నా ఉందా అని అడుగుతున్నాను. చాలా మంది ఈ వృత్తికి సంబంధం లేని వారు దళారులు ఈ వ్యవస్థలో చేరి సొసైటీలను భయపెట్టించి జులుం చూపిస్తూ కల్లు దుకాణాలను నడుపుతున్నారు. ఉదాహరణకు సంగారెడ్డి, జహీరాబాద్, నిజామాబాద్, గద్వాల్లో ఇలా దుకాణాలు నడిపిస్తున్న వారి పేర్లతో సహా ఆధారాలున్నాయి. వృత్తికి సంబంధం లేని వారు దుకాణాలు నడపకుండా, కేవలం వృత్తి మీద ఆధారపడ్డవారు వృత్తిదారులే ఈ దుకాణాలను నడిపే విధంగా చర్యలు చేపట్టాలని మీ ద్వారా కోరుతున్నాను.

హోలోగ్రామ్స్ అంటే లేబుల్స్‌కు సంబంధించి దాదాపు రూ.600 నుంచి రూ.700 కోట్ల కుంభకోణం ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది. సంఘాల నుంచి వెళ్లి మేము కూడా ప్రత్యక్షంగా చూశాము. ఆ హోలోగ్రామ్ చేసే వ్యక్తికి ఎలాంటి సాఫ్ట్‌వేర్ లేకుండానే గుట్కా తయారు చేసే అవకాశం ఇచ్చారు. కల్తీ మద్యం సేవించి ఎవరన్నా చనిపోయినా, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకు వచ్చి అమ్మినా తెలుసుకునే విధంగా ఒక సిస్టమ్‌ను ఎప్పటిలోగా అమలు చేస్తారు. ట్రాక్ సిస్టమ్ అంటే డిస్టిలరీ నుంచి డిపో, డిపో నుంచి వైన్ షాప్‌కు షాప్ నుంచి ఎవరన్నా కొనుక్కుంటే అక్కడ వరకు ఎక్కడన్నా మద్యాన్ని పట్టుకుంటే ఈ ట్రాక్ సిస్టం ద్వారా గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ ట్రాక్ సిస్టమ్‌ను ఇప్పటి వరకైతే అమలు చేయలేదు, ఎప్పటి లోగా అమలు చేస్తారు. తయారీదారు రెండు పైసలకు తయారయ్యేదాన్ని రెండు రూపాయలకు ఇస్తున్నాడు. ప్రభుత్వం అలాంటి వారికి నోటీస్‌లు కూడా ఇచ్చింది.

మిస్టర్ స్పీకర్:– ప్రశ్న మీరే వేశారు. దానికి సమాధానం ఎలా ఉంటుందో మీకు తెలుసు. అసలైన విషయాన్ని వదిలి, మీరు మాట్లాడుతున్నారు. ఇది షార్ట్ డిస్కషన్ కాదు కదా. వారు మాట్లాడినట్లే మీరు మాట్లాడ్డమే మీ ఉద్దేశమా?

శ్రీ టి.పద్మా రావు:– చెట్లు ఎక్కే యంత్రం ఏర్పాటు చేసే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటాము. ఇప్పటికే కేరళ రాష్ట్రంలో యంత్రాల ద్వారా చెట్లు ఎక్కడం జరుగుతోంది. ఆ మధ్య కాలంలో ప్రభుత్వం తరపున యంత్రాలను అందించడానికి రెండు, మూడు మిషన్లను తయారు చేసి నేను కూడా స్వయంగా పరిశీలించడం జరిగింది. విధానపర నిర్ణయానికి ఇంకా కొంత సమయం పడుతుంది. గీత కార్మికులకు యంత్రాల పంపిణీ విషయమై ప్రభుత్వ పరిశీలనలో ఉన్నప్పటికీ కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్న వాహనాల కొనుగోలుకు సంబంధించి బడ్జెట్‌లో పెట్టడం జరిగింది. త్వరలో బడ్జెట్ తీసుకొని వాహనాలను కొనుగోలు చేయడం జరుగుతుంది.

**10.10 ఉ.** అతి తొందరలోనే బడ్జెట్‌లో పెట్టి వాహనాలు ఏర్పాటు చేసే ప్రయత్నంచేస్తాము.

శ్రీ వి. శ్రీనివాస్ గౌడ్ :- అధ్యక్షా, గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన గీత కార్మికులకు పాత బకాయిలను ఈ ప్రభుత్వ హయాంలో చెల్లించడం జరిగింది. ఇప్పుడు కొత్తగా మళ్లీ వంద దరఖాస్తులు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. చనిపోయిన గీత కార్మికుని కుటుంబంలోని వ్యక్తికులకు నెలరోజుల్లో ఎక్స్‌గ్రేషియాకి సంబంధించిన చెక్ అందేటట్లుగా ఏర్పాటు చెయ్యాలి. అంతేకాకుండా ఎక్స్‌గ్రేషియాను అయిదు లక్షలకు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి. ఎప్పటి నుండో వృత్తిని నమ్ముకొని ఉన్న ఆ వర్గాల వారు చనిపోయిన తరువాత, వారి కుటుంబ సభ్యులు రోడ్లు పాలు కాకుండా ఉండేందుకు ఆ అయిదు లక్షల రూపాయలతో జీవనం కొనసాగించడానికి అవకాశం ఉంది. అలాంటి ప్రతిపాదన ఏమైనా ప్రభుత్వం వద్ద ఉందా అని అడుగుతున్నాను.

శ్రీ జలగం వెంకట్రావు (కొత్తగూడెం) :- అధ్యక్షా, మంత్రి గారి జవాబులో ఆబ్కారీ పోలీసు స్టేషన్లను ప్రైవేట్ అద్దె భవనాలలో నిర్వహిస్తున్న విషయం వాస్తవమేనా అంటే అవునని అంటున్నారు, సదరు స్టేషన్లను ప్రభుత్వ భవనాలలోకి మార్చాలనే ప్రతిపాదన ఏదైనా

ఉందా అంటే ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు అని అంటున్నారు. స్థలాలు ఎక్కడైతే ఇచ్చారో అక్కడ భవనాలను ఎప్పుడు నిర్మిస్తారు? స్థలాలు ఇవ్వలేని చోట ఎప్పుడు స్థలాలు ఇస్తారు? మా దగ్గర .....

(ఈ దశలో మైక్ కట్ చేయబడింది)

శ్రీ టి. పద్మారావు : అధ్యక్షా, పాల్వంచలో 12 ఆబ్కారీ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాము. బడ్జెట్‌కి ఇబ్బంది లేదు. అతి త్వరలో స్టేషన్స్ నిర్మిస్తాము. బడ్జెట్ ఎస్టిమేట్స్ వచ్చిన వెంటనే, బడ్జెట్‌లో నిధులు కేటాయించి వెంటనే భవన నిర్మాణాలు చేస్తాము. గీత కార్మికులకు సంబంధించిన సొసైటీలకు అయిదెకరాలు భూమిని కేటాయిస్తాము. ఈ విషయమై సంబంధిత కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. భూమిని గుర్తించి, ప్రభుత్వానికి వివరాలు పంపిస్తే, అయిదెకరాల ల్యాండ్‌ను ఖచ్చితంగా ఇస్తాము. ఖచ్చితంగా సొసైటీలకు అయిదెకరాల భూమిని ఇస్తాము. మహబూబ్‌నగర్‌లో చాలా మంది గౌడ సోదరులకు సంబంధించి సొసైటీలున్నాయి. ఇతరుల సొసైటీల సభ్యులు వచ్చి మా మీద జబర్‌దస్తీ చేస్తున్నారని సదరు సొసైటీల సభ్యులు చెబుతున్నారు. సదరు సొసైటీల మీద 24 గంటల్లో చర్య తీసుకోవడం జరుగుతుంది.

శ్రీ ఎస్.ఏ. సంపత్ కుమార్ (అలంపూర్): అధ్యక్షా, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంటే కొత్త భవనాలు, వెహికిల్స్‌కి సంబంధించిన ప్రశ్న ఇది. ఈ శాఖకు సంబంధించి వెహికిల్స్ తక్కువగా ఉన్న మాట వాస్తవమే. వాటిని పెంచాలి. వీలైనంత తొందరగా ఆబ్కారి శాఖకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇవ్వవలసిందిగా మంత్రి గారిని కోరుతున్నాను. గౌడ కులస్తులకు సంబంధించిన వ్యవహారం ఇది. ప్రతి కులానికి ఒక వృత్తి ఉంటుంది. గౌడ కులస్తులు చాలా మంది ఉన్నారు. వారు వృత్తిని ఆధారం చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. నలుగురు గౌడ కులస్తులు కలిసి తాటి చెట్లు, ఈత చెట్లు పెంచుకొని కల్లు వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ సొసైటీలన్నీ అధికార పార్టీ కనుసన్నల్లో నడుస్తున్నాయి. వారికి ఆ సొసైటీలు నెలకి ఇంత మామూలు ఇస్తే గాని నడపడానికి వీలు లేదు .......

(ఈ దశలో మైక్ కట్ చేయబడింది)

శ్రీ వి. శ్రీనివాస్ గౌడ్ :- అధ్యక్షా, ఈ రాష్ట్రంలో నిషేధించిన దుకాణాలను ఓపెన్ చేయిస్తామని ఎలక్షన్ మేనిఫెస్టోలో పొందుపరచడం జరిగింది. గతంలో గీత కార్మికులకు నాలుగైదు సంవత్సరాల నుండి ఎక్స్‌గ్రేషియా చెల్లించకపోయినా, వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి వారిని ముందుకు తీసుకెళ్లాలని మా ప్రభుత్వ ఉద్దేశ్యం. జహీరాబాద్‌లో మోహన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి అనే వ్యక్తులు ఒక దందా నడుపుతున్నారు.

(ఈ దశలో మైక్ కట్ చేయబడింది)

శ్రీ టి. పద్మారావు : అధ్యక్షా, ఈ ప్రభుత్వం చాలా నిబద్ధతతో పనిచేస్తోంది. గతంలో నాలుగైదు సంవత్సరాల నుండీ చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదు. టీఏ, డీఏలు ఇవ్వలేదు. మా ప్రభుత్వం వచ్చిన తరువాత, ఎక్స్‌గ్రేషియా అందని కుటుంబాలకు, రవీంద్రభారతిలో ఆ కుటుంబాలకు మొత్తం రూ. 30 కోట్లు ఎక్స్‌గ్రేషియా, టీఏ, డీఏలు చెల్లించాము. ఎక్స్‌గ్రేషియా పెంపుకు సంబంధించిన జీఓ ఇంకా రాలేదు. ముఖ్యమంత్రి గారు ఈ విషయమై ప్రకటన చేశారు నిజమే. ఇప్పుడున్న జీఓ ప్రకారం రెండు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం జరుగుతోంది. కొత్త జీఓ వచ్చిన తరువాత చనిపోయిన గౌడ కుటుంబాలకు అయిదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇస్తాము. మహబూబ్‌నగర్‌కి సంబంధించి కొన్ని గౌడ సొసైటీల విషయం మా దృష్టికి ఈ మధ్యనే వచ్చింది. అసెంబ్లీ సమావేశాలు అయిన తరువాత మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాలకు నేను పర్సనల్‌గా విజిట్ చేస్తాను. గౌడ సోదరులందరితో మీటింగ్ పెట్టుకొని, కులసోదరులకే సొసైటీలను అప్పగించే విధంగా ప్రయత్నం చేస్తాము.

## హోమ్ గార్డులకు పారితోషికం

* ప్రశ్న సెం. 64(1976)

సర్వశ్రీ వి. శ్రీనివాస్ గౌడ్, జి. కిషన్ రెడ్డి (అంబర్‌పేట):– డా.కె.లక్ష్మణ్ (ముషీరాబాద్) సర్వశ్రీ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ (ఉప్పల్), చింతల రామచంద్రారెడ్డి (ఖైరతాబాద్) :– హోం శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) హోంగార్డులకు చెల్లిస్తున్న పారితోషికం వివరాలు ఏమిటి;

ఆ) క్రమబద్ధ నిర్ణీత కాలపరిమితితో పారితోషకాన్ని పెంచడానికి ఏదేని యంత్రాంగం ఉన్నదా;

ఇ) హోంగార్డులకు టిఏ, డిఏ, ఈపీఎఫ్, ఈఎస్ఐ, బస్సుపాసులు మున్నగువంటి సదుపాయాలను విస్తరించాలనే విషయాన్ని ప్రభుత్వం పరిగణిస్తుందా;

ఈ) హోం గార్డులకు అవసరం సెలవు, ఆర్జిత సెలవు, వైద్య సెలవు, ప్రసూతి సెలవుల సదుపాయాలను విస్తరించాలనే ప్రతిపాదన ఏదైనా ఉందా;

ఉ) అయితే, ఆ వివరాలేమిటి?

**హోం శాఖ మంత్రి (శ్రీ నాయిని నర్సింహా రెడ్డి ):**

అ) అవునండీ. వార్షికంగా రెండు జతల యూనిఫామ్ భత్యం, రూ. 100 /- ల పరేడ్ భత్యంతోపాటు హోంగార్డులకు రోజువారీ విధి నిర్వహణ భత్యంగా రూ. 400/- ల పారితోషికాన్ని చెల్లించడమవుతున్నది.

ఆ) అవునండీ. 23-03-2011 తేదీగల హోం (పోలీస్ బడ్జెట్) శాఖ, జీఓఎంఎస్‌నెం. 69, 18-01-2014 తేదీగల హోం (పోలీస్ బడ్జెట్) శాఖ, జీఓఎంఎస్ నెం. 6, 30-04-2015 తేదీగల హోం (సర్వీసులు -III) శాఖ జీఓఎంఎస్‌నెం. 29, ద్వారా సూచించినట్లుగా నియతకాలికంగా పారితోషికాన్ని పెంచడమవుతుంది. పారితోషికాన్ని మరింత పెంచే అంశం కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

ఇ) హోం గార్డులు ఒక స్వచ్ఛంద సంస్థ, సీసీఏ నియమావళి క్రింద వారిని వర్తింపచేయరు. అందువల్ల వారు టీఏ, డిఏ, ఈపిఎఫ్, ఈఎస్ఐ, బస్సు పాసులు మున్నగు వాటికి అర్హులు కారు.

ఈ) స్వచ్ఛంద సర్వీసుగా ఉన్నటువంటి హోంగార్డులకు రోజువారీ విధి నిర్వహణ భత్యాన్ని చెల్లిస్తున్నందున వారు వివిధ రకాల సెలవులకు అర్హులు కారు.

ఉ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**10.20 ఉ.** శ్రీ వి.శ్రీనివాస్ గౌడ్: అధ్యక్షా, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొట్టమొదటగా వెట్టిచాకిరీ వ్యవస్థను గుర్తించి గౌరవ ముఖ్యమంత్రిగారు రెండున్నర నెలలలోపే హోంగార్డుల జీతాలు పెంచి వారి ఆత్మగౌరవం దెబ్బతినకుండా భవిష్యత్తులో వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని అనేక సందర్భాలలో చెప్పారు. వారి జీతాలను పెంచడంతోబాటు డ్రెస్ అలవెన్స్ వంటివి పెంచారు. ప్రభుత్వం నిర్మిస్తున్న డబల్ బెడ్‌రూం ఇండ్లలో కూడా హోంగార్డులకు వాటా ఇస్తామని చెప్పారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ ప్రభుత్వం చేస్తున్నప్పటికీ ఇంకా కొన్ని సమస్యలను గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకొస్తున్నాను.

హోంగార్డులు కూడా పోలీసులతో సమానంగా పనిచేస్తున్నారు. ఈ మధ్యకాలంలో తీవ్రవాదులు చంపినదాంట్లో కూడా ఒక హోంగార్డు ఉన్నాడు. హోంగార్డులు రోజుకొకరు యాక్సిడెంట్‌లో చనిపోతున్నారు. 35,40 సంవత్సరాలు హోంగార్డుగా పనిచేసి చనిపోతే వారి కుటుంబాలకు ఒక్క పైసా కూడా ప్రభుత్వం చెల్లించడం లేదు. హోంగార్డులు తీవ్రవాదులను చంపితే రూ.5లక్షలో, రూ.10 లక్షలో ప్రభుత్వం ఇస్తున్నది తప్ప వారికి ఎలాంటి బెనిఫిట్స్ రావడం లేదు. వీరు రిటైర్ అయినప్పుడు కూడా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి బెనిఫిట్ రావడం లేదు. 365 రోజులు వారు ఎండావానలలో అన్ని రకాలుగా పనిచేస్తున్నారు. కాబట్టి పోలీసులకు రిస్క్ అలవెన్స్ కింద పోలీసులకు 30 శాతం చెల్లిస్తున్నట్లుగా హోం గార్డులకు కూడా రిస్క్ అలవెన్స్ చెల్లిస్తామని గత సమావేశాలలో గౌరవ మంత్రిగారు చెప్పినందున ఆ అలవెన్స్‌ను ఎప్పటిలోగా చెల్లిస్తారని మీద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

అంతేకాకుండా గణేష్ పండగ సందర్భంగా బందోబస్తు కోసం గానీ ఎన్నికల సమయాలలో బందోబస్తు గురించి గానీ శాసనసభ సమావేశాల బందోబస్తు సందర్భంగా కూడా హోంగార్డుల సర్వీసులను ప్రభుత్వం వాడుకుంటున్నది. పోలీసులతో సమానంగా అన్ని రకాల డ్యూటీలు చేస్తున్నప్పటికీ హోంగార్డులకు తినడానికి కూడా డబ్బులు ఇవ్వరు. కేవలం గణేష్ పండగ సందర్భంగా బందోబస్తు కోసం వచ్చినప్పుడు మాత్రమే ఫీడింగ్ అలవెన్స్ కింద ఒక ప్రభుత్వం 10 రోజులకు రూ.1800 చెల్లిస్తే ఇంకొక ప్రభుత్వం దయాదాక్షిణ్యంతో రూ.4,500 చెల్లించింది. ఇంత మొత్తం ఇవ్వాలనే ప్రాతిపదిక లేదు. కాబట్టి హోంగార్డులు బందోబస్తు డ్యూటీలలో ఉన్నప్పుడు వారు తినడానికి కొంత ఫిక్సడ్ అలవెన్స్ ఇవ్వాలి.

అంతేకాకుండా ESI, EPF, బస్‌పాస్, అడీషనల్ యూనిఫాం అలవెన్సెస్‌కు సంబంధించి తేది. 31-01-2015న డి.జి.పి గారు రెకమండ్ చేస్తూ ప్రభుత్వానికి పంపించారు. దయచేసి డి.జి.పి గారు రెకమండ్ చేసిన ప్రకారంగా ప్రభుత్వం వాటిని మంజూరు చేయాలని కోరుతున్నాను. మిజోరాం వంటి కొన్ని రాష్ట్రాలలో హోంగార్డులను పర్మినెంట్ చేయడం జరిగింది. తమిళనాడు రాష్ట్రంలో కూడా కొంతమందిని పర్మినెంట్ చేయడం జరిగింది. చాలా సంవత్సరాలు హోంగార్డుగా పనిచేసి అనుభవం కలిగిన వీరికి కూడా ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేయాల్సిన అవసరమున్నది. పర్మినెంట్‌కంటే ముందు ఇప్పుడు చెల్లిస్తున్న రూ. 12 వేలు నెలకి హైదరాబాదులో బ్రతకడానికి సరిపోవు కాబట్టి కనీసం రూ. 20 వేలకు పెంచినట్లైతే వారు కూడా చిన్న చిన్న అవినీతి కార్యకలాపాలకు పాల్పడకుండా ఉంటారు. వీరిని పర్మినెంట్ చేసే అంశానికి సంబంధించి గతంలో మంత్రిగారు ఒక కమిటీ వేస్తామని చెప్పారు. ఒకవేళ కమిటీ వేస్తే ఏ రకమైన చర్యలు చేపడుతుందో మీద్వారా అడుగుతున్నాను. ఎమ్మెల్యే అంటే చీఫ్ సెక్రటరీ స్థాయికంటే పెద్దదని గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పారు. కొంత మంది అధికారులు డెప్యుటేషన్‌పైన ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన వారు మేం ఫోన్ చేస్తే కనీసం సమాధానం కూడా

చెప్పడం లేదు. ఎమ్మెల్యేలుగా మాకే ఇలాంటి పరిస్థితి ఉంటే మీరు అసోసియేషన్ పెట్టుకోవద్దని వారిని భయపెట్టిస్తే డిసిప్లీన్ పేరుమీద అధికారులను ఇన్‌డిసిప్లీన్‌గా వ్యవహరిస్తున్నారు. ఐఏఎస్ అధికారులు అసోసియేషన్‌లు పెట్టుకుంటారు, ఐపిఎస్ అధికారులు అసోసియేషన్‌లు పెట్టుకుంటారు, పోలీసు అధికారులు అసోసియేషన్‌లు పెట్టుకుంటారు, ఎవరికైనా వెల్ఫేర్ గురించి అసోసియేషన్‌లు పెట్టుకునే అవకాశముంటుంది. కాబట్టి సదరు విషయంలో ఒకసారి పునరాలోచించాల్సిన అవసరమున్నది. ఇతర రాష్ట్రాలనుంచి డెప్యూటేషన్‌పై వచ్చిన కొంత మంది అధికారులు డిపార్ట్‌మెంటు వారు వెళితే వారిని పులిలాగా గర్జించి పీక్కుతినేటట్లు గట్టిగా మాట్లాడి భయపెట్టిస్తే వారు ఆఫీసులకు కూడా వెళ్లలేని పరిస్థితి ఉన్నది. అలాంటి అధికారులు మన రాష్ట్రంలో మంచిగా పనిచేస్తే చెయ్యాలి లేదంటే వెంటనే రిలీవ్‌చేసి వారిని వెనక్కి పంపాలి.

(ఈ దశలో మైక్ కట్‌చేయబడింది)

మిస్టర్ స్పీకర్: శ్రీనివాస్ గౌడ్ గారూ ఇంకా పది క్వశ్చన్స్ కూడా ఉన్నాయి. కాబట్టి మీరు కూర్చోండి. కిషన్ రెడ్డి గారూ మీరు మాట్లాడండి.

శ్రీ జి. కిషన్ రెడ్డి: అధ్యక్షా, హోంగార్డుల సమస్యల మీద గత 13 సంవత్సరాలుగా పోరాటాలు జరుగుతున్నాయి. ఇదే శాసనసభలో నేను 13 సంవత్సరాలుగా అడుగుతున్నాను. మొదట రూ.3వేల జీతం చెల్లించేవారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక ఉద్యమాలు చేశాం. టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా హోంగార్డులు ఉద్యమాలు చేసి రూ. 12 వేల జీతం సాధించుకున్నారు. 2014 సంవత్సరంలో జరిగిన హోంగార్డుల సదస్సుకు హోంశాఖా మాత్యులు హాజరై వారికి ఆరోగ్య భద్రత కల్పిస్తామని, వారాంతపు సెలవులిస్తామని, సర్వీసులు క్రమబద్ధీకరిస్తామని, కానిస్టేబుళ్లతో సమాన హోదా కల్పిస్తామని, అలవెన్స్‌లు ఇస్తామని, మహిళా హోంగార్డులకు ప్రసూతి సెలవులిస్తామని చెప్పారు. వారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా నేను హోంగార్డుల గురించి ధర్నా చేసినప్పుడు ఇప్పుడున్న ఆర్థిక శాఖా మంత్రి, హోంమంత్రి గార్లు కూడా ప్రసంగించారు. వీరి గురించి గతంలో హరీష్ రావు గారు కూడా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ ముందు హోంగార్డులను క్లాస్ - 4 ఉద్యోగులతో సమానంగా చూస్తామని ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు.

హోంగార్డులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. ఆదివారం సెలవు లేకుండా, బస్‌పాస్ సౌకర్యం లేకుండా, ESI, EPF సౌకర్యం లేకుండా ఎవరైనా పనిచేస్తున్నారా అంటే ఒక్క హోంగార్డులు మాత్రమే పనిచేస్తున్నారు. లేబర్ యాక్టు ప్రకారం కిరాణా షాపులలో పనిచేసే మహిళలకు కూడా ప్రసూతి సెలవులు వస్తాయి. కాబట్టి గతంలోనే వీటి గురించి ఒక హైలెవల్ కమిటీవేసి రెకమండ్ చేయడం జరిగింది. నేను ఈమధ్య కాలంలోనే డి.జి.పి గారిని, ముఖ్యమంత్రి గారిని కలిశాను. రిపోర్టు హోంశాఖా మంత్రిగారి దగ్గర ఉన్నది. కాబట్టి వారికి జీతం పెంచడంతోబాటు ఇతర అలవెన్స్‌లకు సంబంధించి వెంటనే క్లియర్‌చేసి హోంగార్డులకు మేలు చేయండి.

కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో హోంగార్డులకు ప్రిఫరెన్స్‌నివ్వాలి. తమిళనాడు రాష్ట్రంలో 9వేల మంది హోంగార్డులకు పోటీ పరీక్షలు నిర్వహించి అర్హత ఉన్నవారందరినీ కానిస్టేబుల్‌గా ప్రమోట్ చేశారు. మన రాష్ట్రంలో కూడా ఒక స్పెషల్ డ్రైవ్ కింద హోంగార్డులను తీసుకొని వారికి కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించాలని కోరుతున్నాను. ట్రాఫిక్‌లో పనిచేస్తున్న పోలీసుల జీతాలకు సంబంధించి 30 శాతం పెంచారు. ఒక్క పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లోనే 156 మంది హోంగార్డులు పనిచేస్తున్నారు. కాబట్టి హోంగార్డులకు కూడా 30 శాతం జీతాలు పెంచాలని కోరుతున్నాను.

శ్రీ చింతల రాంచంద్రారెడ్డి:- అధ్యక్షా, హోంశాఖామాత్యులు ఇంతకుముందు చెప్పినట్లుగా హోంగార్డులకు నెలకు రూ. 12 వేలు చెల్లిస్తే వారు ఏ రకంగా హైదరాబాదులో జీవనం కొనసాగిస్తారో ఆలోచించాలి. ఈదేశంలోని ప్రజలకు కావలసిన సౌకర్యాలను కల్పించడానికి, వారి భద్రతను కాపాడటానికి పోలీసులతో సమానంగా హోంగార్డులు పనిచేస్తున్నారు. మా కిషన్ రెడ్డి గారు చెప్పినట్లుగా 13 సంవత్సరాలుగా ఇదే శాసనసభలో వారి జీతభత్యాల గురించి నిరంతరంగా మాట్లాడి రూ. 3 వేల నుంచి రూ. 12 వేలకు తెచ్చారు. బంగారు తెలంగాణలో పనిచేస్తున్న మన హోంగార్డులకు ESI, EPF, గ్రాట్యుయిటీ ఇంకా ఇతర రకాలైన అలవెన్సులు, సెలవులు వంటివేమీ లేవు. ఏ వ్యక్తి అయినా ఆరు రోజులు పనిచేస్తే లేబర్ యాక్టు ప్రకారం ఏడవ రోజు సెలవు ఉంటుంది. మన హోంశాఖా మాత్యులు కార్మిక శాఖామాత్యులు కాబట్టి వారికి ఈ విషయం తెలియాలి. హోంగార్డులను ఆదుకుంటామని ఎన్నో సమావేశాలలో హోం మంత్రిగారు చెప్పారు. కేవలం రూ. 12 వేలతో హోంగార్డులు ఏ రకంగా హైదరాబాదులో జీవనం కొనసాగించగల్గుతారనేది ఒకసారి ఆలోచించాలని కోరుతున్నాను. డి.జి.పి గారు ప్రభుత్వానికి రెకమండ్ చేసిన విధంగా హోంగార్డులకు అన్ని రకాల అలవెన్స్‌లు ఇప్పించే విధంగా ముఖ్యమంత్రిగారిని ఒప్పించి వారిని ఆదుకోవాలని మీద్వారా కోరుతున్నాను.

శ్రీ నాయిని నరసింహారెడ్డి:– అధ్యక్షా, హోంగార్డు వ్యవస్థ గురించి సభ్యులు శ్రీనివాస్‌గౌడ్ గారు, కిషన్‌రెడ్డి గారు, చింతల రాంచంద్రారెడ్డి గారు చెప్పారు. హోంగార్డులు పౌర జీవనానికి భంగం కలుగకుండా, కులమత కలహాలను నియంత్రించడంలో పోలీసులకు సహాయపడేందుకు 1946లో మొట్టమొదటిసారిగా బొంబాయిలో ఈ హోంగార్డు వ్యవస్థను ప్రారంభించబడింది. తదుపరి కాలంలో ఈ వ్యవస్థను వరదలు, అగ్ని ప్రమాదాలు కరవు మొదలైన అత్యవసర సమయాలలో పోలీసులకు సహాయకారిగా ఉండేందుకు ఇతర రాష్ట్రాలు ప్రారంభించాయి.

**10.30 ఉ.** అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు చైనీయుల దురాక్రమణ సందర్భంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని స్వచ్ఛంద సంస్థలను, హోమ్‌గార్డ్ సంస్థగా అఖిల భారతదేశం కింద విలీనం చేయడం జరిగింది.1962–63లో నిష్కారక సేవ సంస్థగా హోమ్‌గార్డ్ సంస్థ ఏర్పాటైంది. ప్రస్తుతం శాంతి భద్రతల, ట్రాఫిక్ నిర్వహణలో, గార్డ్స్ డ్యూటీలో ప్రెటోలింగ్ మరియు అత్యవసర సమయాల్లో పోలీసులకు సహాయంగా హోమ్‌గార్డులు ఉన్నారు.

రాష్ట్రంలో మారిన పరిస్థితుల్లో హోమ్ గార్డులు, పోలీసులకు వారి అనేక విధుల్లో సహాయంగా పనిచేస్తున్నారు. 2009వ సంవత్సరంలో జనవరి వరకు హోమ్‌గార్డులకు డ్యూటి భత్యం రోజుకు 100 రూపాయలుగా ఉండేది. ఫిబ్రవరి 2009 నుంచి దీనిని రోజుకు 150కు పెంచారు. ఎప్రిల్ 2011 నుంచి రోజుకు రోజుకు రూ. 200లకు పెంచారు.తరువాత జనవరి 2014 నుంచి రోజుకు 300లకు పెంచడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం కేవలం ఒక సంవత్సరం రెండు నెలలకే డ్యూటీ భత్యాన్ని రోజుకు 400 రూపాయలుగా పెంచడం జరిగింది. ఎప్రిల్ 2015లో ఉత్తరులు ఇచ్చింది. దీనితో బాటు యూనిఫామ్స్‌ను రెండు జతలుగా పెంచింది. పరేడ్ భత్యాన్ని 48 రూపాయల నుంచి 100 రూపాయలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. సోషల్ సెక్యూరిటీ కింద హోమ్‌గార్డ్ కొరకు ప్రభుత్వం జీవిత బీమ ప్రీమియాన్ని చెల్లిస్తుంది. ఈ స్కీములో హోమ్‌గార్డ్‌లు ప్రమాదంలో మరణిస్తే అతని కుటుంబానికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడం జరుగుతుంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రం ఉగ్రవాదుల హింసలో చనిపోయిన హోమ్‌గార్డులకు 30 లక్షల రూపాయలు పరిహారాన్ని చెల్లిస్తుంది. ఉగ్రవాదుల దాడిలో మరణించిన సూర్యపేటకు సంబంధించిన హోమ్‌గార్డ్ పరిహారాన్ని ఆయన భార్యకు చెల్లించడం జరిగింది. శాశ్వత వైకల్యం పొందితే 20 లక్షలు రూపాయలు, తీవ్రగాయాలైతే 3 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నాము.

మార్కుల శాతాన్ని బట్టి 10 వతరగతికి 1000–2000 రూపాయలు, ఇంటర్మీడియట్‌కు రూ. 1500 నుంచి రూ. 2000, ప్రొఫెషనల్ కోర్సులకు రూ. 2000 నుంచి రూ. 4000 వరకు హోమ్‌గార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్స్ ఇస్తున్నాము. వెల్ఫేర్ ఫండ్ నుండి కూతురు పెళ్లి కొరకు మ్యారేజీ గ్రాంటుగా రూ. 5000 లను ఇస్తున్నాము. సహజ మరణం అయినప్పుడు రూ. 15,000 ఇస్తున్నాము. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 20,000, మరణించినప్పుడు క్లాజ్ ఫండ్ నుండి ఆకస్మిక చార్జీల కోసం రూ. 5000 చెల్లిస్తున్నాము. హోమ్‌గార్డుల వైద్య సదుపాయం క్లైమ్ పాలసి కొరకు ప్రతిపాదన పరిశీలనలో ఉంది. హోమ్‌గార్డు మరణిస్తే కారుణ్య నియామకం కింద అతని కుటుంబంలో ఒకరికి హోమ్‌గార్డుగా ఉద్యోగం ఇస్తున్నాము. ట్రాఫిక్ వింగ్‌లో పనిచేస్తున్న హోమ్‌గార్డులకు ముప్పై శాతం కాలుష్య హానికర భృతి అనగా రోజుకు రూ. 150 చెల్లించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. పోలీసు కానిస్టేబుల్స్ నియామకంలో సివిల్‌కు 8 శాతం, ఆర్మ్‌ రిజర్వ్‌డ్‌లో 5 శాతం, స్పెషల్ ఆర్మ్‌ రిజర్వ్‌లో 5 శాతం, పోలీసు బెటాలియన్‌లో 10 శాతం, పోలీస్ కమ్యూనికేషన్‌లో 2 శాతం, పోలీసు మెకానిక్‌లో 2 శాతం, పోలీసు ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో డ్రైవర్ పోస్టులకు 2 శాతం రిజర్వేషన్ కలిపిస్తున్నాము.

హోమ్ గార్డుల నియామకంలో హోమ్‌గార్డ్‌ల పిల్లలకు 10 శాతం కోటా ఉంది. హోమ్‌గార్డులు సిటిలో ప్రయాణించుటకు రాయితీపై బస్సు పాసు సౌకర్యం పరిశీలనలో ఉంది. దీనికోసం సుమారు 4.5 కోట్ల రూపాయలు భారం పడుతుంది. ఈపిఎఫ్, ప్రావిడెంట్ ఫండ్ స్కీముల సౌకర్యం కల్పించే విషయం పరిశీలనలో ఉంది. ఈ సౌకర్యం కోసం జమ చేయాల్సిన మొత్తం రూ. 8.25 కోట్లు ప్రభుత్వం భరించే ప్రతిపాదనలో ఉన్నది.

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇతర సదుపాయాలు, భత్యాలందించే విషయంలో మన రాష్ట్రం చాలా మెరుగ్గా ఉంది. వీరి భత్యాల చెల్లింపునకు ఆటంకం కలిగించకుండా అవసరమైన నిధులు కేటాయిస్తుంది. వివిధ రాష్ట్రాలు మనరాష్ట్రం కంటే తక్కువ భత్యం చెల్లిస్తున్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో రోజుకు రూ. 330, తమిళనాడు రాష్ట్రంలో రోజుకు రూ. 200, తమిళనాడు రూరల్‌లో రూ. 150, మహారాష్ట్రలో రోజుకు 300 రూపాయలు, ఒరిస్సాలో రోజుకు రూ. 240, కర్ణాటక సిటి ప్రాంతంలో రోజుకు రూ. 400, రూరల్ ప్రాంతంలో రూ. 300, త్రిపురలో రోజుకు రూ. 210, అండమాన్‌లో రోజుకు రూ. 310, ఆంధ్రప్రదేశ్‌లో ఈమధ్య కాలంలో రూ. 400 లకు పెంచారు. మన ప్రభుత్వం సంవత్సరం కిందనే పెంచగా ఆంధ్ర

ప్రభుత్వం రెండు నెలలో క్రితమే పెంచడం జరిగింది. మాకున్న సమాచారం మేరకు ఇతర రాష్ట్రాల్లో సరైన నిధులు కేటాయించకపోవడం వల్ల హోమ్‌గార్డులకు భత్యాలు ఆలస్యంగా ఇవ్వడమే కాకుండా, అవసరమైన సమయంలో నెలకు కొద్ది రోజులు మాత్రమే వీరి విధులను ఉపయోగించుకొని పని చేసే కొద్ది రోజులకు మాత్రమే భత్యం ఇస్తున్నారు. మన రాష్ట్రంలో ఈ పరిస్థితి వేరుగా ఉంది. మన రాష్ట్రంలో హోమ్‌గార్డు పోస్టుల సెలక్షన్ కోసం డిగ్రీ చదివిన యువత కూడా పోటీపడటం మన ప్రభుత్వం హోమ్‌గార్డులకు చెల్లిస్తున్న వివిధ భత్యాలు, కల్పిస్తున్న వివిధ సౌకర్యాలకు నిదర్శనం.

ఈ మధ్య కొందరు హోమ్‌గార్డులు వారి డిమాండ్‌ల కొరకు ఇందిరాపార్కు , సచివాలయం దగ్గర ధర్నాలు చేయడం జరిగింది. క్రమశిక్షణ కలిగిన శాఖ పరిధిలో పనిచేస్తు తమ డిమాండ్‌ల కొరకు ధర్నాలు చేయడం గర్హనీయం, ప్రశ్నించదగిన విషయమే అయినప్పటికి మన ప్రభుత్వం వీరిపై ఎటువంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడే ఉద్దేశం లేదు. నేను చాలా సంవత్సరాలుగా కార్మిక నాయకుడిగా ఉన్నాను. ఇప్పుడు హోం శాఖకు, కార్మిక శాఖ మంత్రిగా ఉన్నాను. నేను ఉద్యోగుల పక్షపాతిని. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కేసిఆర్ గారి సమర్థ నాయకత్వంలో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా, అతి తక్కువ కాలంలోనే దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగాపేరు తెచ్చుకొన్నాము. ముఖ్యమంత్రి వర్యులు మంచి దార్శనికుడు, గొప్పమానవతా వాది కాబట్టి వీరి సమస్యల పట్ల సానుకూలంగా ఉంటాడు. సాధ్యమైనంత వరకు వీరి సమస్యల పరిష్కారానికి, భత్యాలు పెంపుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. హోమ్‌గార్డులకు జీతభత్యాలు, వైద్యసదుపాయాలు కల్పించాలని గౌరవసభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినందుకు వారికి ధన్యవాదములు. ఈ మధ్య కాలంలో కొంత మంది ఎమ్మెల్యేలు హోమ్‌గార్డులను రెచ్చగొట్టి సమ్మెలు చేయిస్తున్నారు. ఇది చాలా దారుణం.

**10.40 ఉ.** ఒక డిసిప్లీన్ కలిగిన డిపార్ట్‌మెంట్‌లో ఈ విధంగా మీరు సమ్మెలు చేయించే సమయంలో పోలీసులకు ఏమైనా ఐతే ప్రభుత్వాన్ని ఎవరు నడిపిస్తారు. ఎంకరేజ్ చేస్తున్న ఎం.ఎల్.ఏల పేర్లు కూడా వచ్చాయి. అక్కడ ఆంధ్ర ప్రదేశ్‌లో జీతాలు పెంచడంలేదని అక్కడ మాట్లాడకుండా ఇక్కడ మాట్లాడుతున్నారు తెలుగు దేశం ఎం ఎల్ ఏలు. హోంగార్డుల విషయంలో ఇంటర్‌ఫేయిర్ కావద్దని శాసన సభ్యులను నేను అప్పీల్ చేస్తున్నాను. ముఖ్యమంత్రి గారితో మాట్లాడి వారికి వంద శాతం న్యాయం జరిగేవిధంగా మంచి జీత భత్యాలు ఇప్పించడానికి కృషి చేస్తాను. మీ సహకారం అవసరమైతే తప్పకుండా తీసుకుంటాను. కానీ, వారిని ఉద్యోగాలకు పోకుండా రెచ్చగొట్టి ధర్నాలకు ప్రోత్సహించే పద్ధతి మంచిది కాదు. ప్రభుత్వం వారి విషయంలో సానుభూతిగా ఉంటుంది, వారి యోగ క్షేమాలు చూస్తుంది. మొదటి సారి చనిపోయిన టెర్రరిస్టులకు రూ. 30 లక్షలు ఇప్పించాము. కాబట్టి వీటన్నింటినీ సపోర్ట్ చేయాలని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్:– శ్రీనివాస్ గౌడ్ గారూ, మంత్రి గారు సమాధానమిస్తూ, మిగతా విషయాల్లో కూడా సానుకూలంగా స్పందిస్తుందని, ముఖ్య మంత్రి గారితో మాట్లాడి చేయగలిగినంత మేరకు సంపూర్ణంగా చేస్తామనే హామీ ఇచిన తరువాత no clarifications.

## "హెర్సే" అంబులెన్స్ సేవలు

*ప్రశ్న నెం. 65(2175)

సర్వశ్రీ రసమయి బాలకిషన్ (మానుకొండూర్), చల్లా ధర్మా రెడ్డి ( పర్కాల్), దుర్గం చిన్నయ్య ( బెల్లంపల్లి): – వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

అ ) ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందుతూ చనిపోయిన రోగుల మృత దేహాలను తమ స్వస్థలాలకు ఉచితంగా తరలించడానికి ప్రభుత్వం మృత దేహాలను తరలించే అంబులెన్స్ సేవలను ప్రవేశ పెట్టిన విషయం వాస్తవమేనా;

ఆ ) అయితే, ప్రస్తుతానికి సదరు సేవల కోసం ఏర్పాటు చేసిన వాహనాల సంఖ్య ఎంత;

ఇ) సదరు వాహనాల సంఖ్యను పెంచే ప్రతిపాదన ఏదైనా ఉందా?

**వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (డా. సి. లక్ష్మారెడ్డి):**

అ) అవునండీ.

ఆ) 50 వాహనాలు (అనుబంధాన్ని సభా సమక్షంలో ఉంచడమయింది.)

ఇ ) అవునండీ.

అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ, వాటితోబాటు ముఖ్యమంత్రి గారు మానవీయ కోణంలో ఎన్నో అంశాలను చెప్పడం జరుగుతోంది. దానిలో భాగంగానే రోగులు సుదూర ప్రాంతాల నుండి హైదరాబాదులో ఉన్నటువంటి ఉస్మానియా, గాంధీ, జిల్లా ఆసుపత్రులకు వైద్యం కోసం వచ్చి ఇన్‌పేషెంట్లుగా ఉండి దురదృష్ట

వశాత్తు చనిపోతే, చనిపోయిన తరువాత డెడ్‌బాడీని వారి గ్రామాలకు తీసుకుపోవడం చాలా ఇబ్బందికరంగా ఉంది. ముఖ్యంగా బీద ప్రజల వద్ద రూపాయి కూడా లేని పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాల వారు 5 నుండి 20వేల రూపాయలను వసూలు చేయడం చూస్తున్నాము. వారి వద్ద డబ్బులు లేక, డెడ్‌బాడీని బస్సుల్లోనో, ట్రెయిన్లలోనే తీసుకుపోయే పరిస్థితి లేక ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారు. డెడ్‌బాడీని తోపుడు బండిలో తీసుకుపోయిన పరిస్థితి ఈ మధ్య మనం పేపర్లో కూడా చూశాము. ఈ పథకాన్ని 6నెలల క్రితమే ప్రవేశ పెట్టడం జరిగింది. కానీ, వెహికల్స్ రెడీ చేయడానికి సమయం పట్టింది. క్రిందిటి నెల 19వ తేదీ నాడు ఈ వెహికల్స్‌ను మొదలు పెట్టడం జరిగింది. ఈ వెహికల్స్ ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రంలో 1056 డెడ్‌బాడీలను వారి వారి స్వస్థలాలకు చేర్చడం జరిగింది. ప్రస్తుతం డబ్బులకు కొరత ఉన్న పరిస్థితుల్లో ఈ పథకం ప్రజలకు చాలా అనుకూలంగా మారింది. ప్రస్తుతం 50 వాహనాలను ప్రవేశ పెట్టడం జరిగింది. 145 కొత్త 108 వెహికల్స్ కొనుగోలు చేసిన సందర్భంలో, వాటి స్థానంలో తీసేసిన పాత వెహికల్స్‌ను ప్రస్తుతం వాడుతున్నాము. ఇంకా వాహనాలు కావాలనే డిమాండ్‌తో రానున్న కాలంలో మరొక 30 కొత్త వాహనాలను కొనుగోలు చేసి ఈ పథకానికి పెంచడం జరుగుతుంది. ఈ వాహనాల్లో అన్ని రకాల వసతులను పెంచి నడపడం జరుగుతుంది. ఈ వాహనాలు ఏదైనా దుర్ఘటన జరిగినప్పుడు ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి బాగా ఉపయోగ పడుతున్నాయి. మన హైదరాబాదులో బిల్డింగ్ కూలిపోయిన సందర్భంలో ఆ బాడీలను ఈ వాహనాల ద్వారా సుదూర ప్రాంతాలకు వేరే రాష్ట్రాలకు తీసుకువెళ్లడం జరిగింది. ఈ వాహనాల్లో మార్చ్యుర్ ఫ్రీజర్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఒక 25 వాహనాల్లో 2 ఫ్రీజర్స్, మిగతా 25 వాహనాల్లో సింగల్ ఫ్రీజర్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం బీద ప్రజలకు పూర్తిగా అందుబాటులోకి వచ్చింది. అమ్మ వడి అనే కార్యక్రమం ద్వారా ట్రైబల్ ఏజెన్సీ ప్రాంతాల్లో బీద ఆడపడుచులు ప్రెగ్నెన్సీ సమయంలో ఆసుపత్రికి పోవడానికి, ప్రసవం అయిన తరువాత తల్లీ బిడ్డలను వారి ఇంటికి క్షేమంగా చేర్చడానికి 28వ తారీకు నాడు కార్యక్రమాన్ని మొదలు పెడుతున్నాము. చిన్న చిన్న గల్లీల్లో ఫోర్ వీలర్స్ పోలేవు కాబట్టి, తొందరలోనే బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నాము. ముఖ్య మంత్రి గారి ఆలోచనతో మా డిపార్ట్‌మెంట్ ఎన్నో కొత్త కొత్త కార్యక్రమాలను చేపట్టబోతోంది. డయాలసిస్ రోగులకు డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయడంతోబాటు వారంలో రెండు మూడు సార్లు డయాలసిస్ సెంటర్లకు వెళ్లవలసిన అవసరం ఉంటుంది కాబట్టి, వారికి బస్ పాసులను కూడా తొందరలోనే ఏర్పాటు చేయబోతున్నాము.

శ్రీ రసమయి బాలకిషన్ : అధ్యక్షా, తెలంగాణలో బతుకును మోయడం కంటే చావును మోయడమే మరొక చావుగా పరిగణించబడ్డ సమాజాన్ని చాలా సంవత్సరాలుగా చూశాము. ముఖ్యంగా సామాన్యుడు ఏదైనా ఆసుపత్రికి వచ్చి చనిపోయిన తరువాత ఇంటికి తీసుకుపోయే స్థోమత లేనప్పుడు శవాలను వదిలేసి పారిపోయిన రోజులను కూడా చూసాము. చాలా మంది పేద వారు అప్పు చేసి పెద్ద పెద్ద ఆసుపత్రులకు వచ్చిన సందర్భంలో చనిపోయినప్పుడు శవాన్ని బస్సుల్లో తీసుకుపోయే పరిస్థితి ఉండేది కాదు. శవాన్ని తీసుకుపోవడానికి ఏదైనా ప్రైవేటు వాహనాన్ని సంప్రదించినప్పుడు అదనంగా రేట్లు బిగించిన సందర్భంలో తెలంగాణ ప్రజలు పడిన కష్టాలు వర్ణనాతీతం. ఒకప్పుడు బ్రతకడానికి గల్ఫ్ వంటి ప్రాంతాలకు వెళ్లిన బిడ్డలు అక్కడ చనిపోతే అక్కడ నుండి శవాలను తీసుకురావడం ఎంతో భారంగా ఉండేదనే విషయాన్ని కళ్లారా చూశాము. మానవీయ కోణంలో ఆలోచించి ఒకమంచి కార్యక్రమాన్ని చేయడంలోను, మనుషులను మహనీయులుగా కొలిచే ఉద్యమ నేత ముఖ్యమంత్రి కేసిఆర్ గారు కాబట్టి, ముఖ్యంగా శవాలను తీసుకుపోయేటప్పుడు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అంబులెన్స్‌లను ప్రవేశ పెట్టినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ, కొన్ని కొన్ని ప్రాంతాలకు కొన్ని వాహనాలను మాత్రమే విడుదల చేయడం జరిగింది. కాబట్టి, అన్ని జిల్లా స్థాయి ఆసుపత్రులతో బాటు ఏరియా ఆసుపత్రులకు కూడా అందుబాటులో పెట్టినట్లైతే మరింత సౌకర్యంగా ఉంటుంది కాబట్టి, రాబోయే కాలంలో ఇంకా ఇటువంటి వాహనాలను పెంచే ప్రతిపాదన ఏమైనా ఉందా అని మంత్రి గారిని అడుగుతున్నాను.

**10.50 ఉ.** శ్రీ చల్లా ధర్మారెడ్డి: – అధ్యక్షా, గతంలో గర్భిణీలు ప్రసూతి ఆసుపత్రిలో ప్రసవం అవగానే తల్లిని, పుట్టిన బిడ్డని క్షేమంగా ఇంటి వద్దకు చేర్చేందుకు మరియు ఆ కుటుంబ ఖర్చు కోసం కొంత డబ్బును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదే విధంగా గౌరవ ముఖ్యమంత్రి గారు ఒక అడుగు ముందుకు వేసి పుట్టిన వాడు కన్నా, చనిపోయిన వాడు గొప్పవారు దైవ సమానులనే ఉద్దేశంతో, నిరుపేదలు డబ్బులు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేక చనిపోయిన వారి కోసం, మరియు కుటుంబంలోని వారు చనిపోయిన వారికి ఇంటికి తీసుకువెళ్లేందుకు ప్రయాణ ఇబ్బందుల దృష్ట్యా మృతదేహాలను తరలించే అంబులెన్స్‌లను ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు

తెలియజేస్తున్నాను. వీటిలో మృతదేహాలను తరలించడం కోసం సింగిల్ ఫ్రీజరు, డబుల్ ఫ్రీజర్ వాహనాలను ఏర్పాటు చేశారని మంత్రి గారు తెలిపారు. వీటి ద్వారా మృతదేహాలను సురక్షితంగా ఇంటికి చేర్చే కార్యక్రమం చేపట్టినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి, మంత్రివర్యులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నాను. గత మాసంలో 50 వాహనాలను ఏర్పాటు చేశారని తెలిపారు. వీటిని ఏ ఏ జిల్లాలకు ఏర్పాటు చేశారు? ఏ ఆసుపత్రుల నిమిత్తం వీటిని ఏర్పాటు చేశారో తెలపాలని కోరుతున్నాను. మిగిలిన జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారు? ప్రతి ఆసుపత్రికి ఒక వాహనం ఉంటే బాగుంటుందని మీ ద్వారా మంత్రి గారికి సూచన చేస్తున్నాను. చనిపోయిన వారి కుటుంబాలకు ఖర్చు నిమిత్తం కొంత డబ్బును ప్రభుత్వ పరంగా ఇస్తే బాగుంటుందని మీ ద్వారా గౌరవ ముఖ్య మంత్రిని కోరుతున్నాను. డయాలిసిస్ రోగులకు ఇటువంటి వాహనాలను ఏర్పాటు చేస్తామన్నారు, వాటిని ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారు? ఏఏ ఆసుపత్రులకు వీటిని ఏర్పాటు చేస్తారనే వివరాలను తెలియజేయాలని కోరుతున్నాను. నా పరకాల నియోజక వర్గంలో గల ఆసుపత్రికి సత్వరమే ఈ వాహనాన్ని ఏర్పాటు చేయాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ దుర్గం చిన్నయ్య:– అధ్యక్షా, ప్రభుత్వం పేద ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనతో మృతదేహాలను తరలించే వాహనాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెట్టినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. సుదూర ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు వైద్యం చేయించుకునేందుకు వచ్చిన వారు చనిపోతే, వారికి మాత్రమే ఈ అంబులెన్స్‌లను పంపుతారా? లేక ప్రైవేటు ఆసుపత్రిలో చనిపోతే కూడా ఫోన్ చేస్తే ఈ వాహనాలను పంపుతారా? అదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ ప్రాంతాల నుంచి హైదరాబాద్ 300 కి.మీ.లు ఉంటుంది. కనుక మా ప్రాంతం నుంచి ప్రజలు మెరుగైన వైద్యం కోసం ఈ ప్రాంతానికి వస్తున్నారు. మంచిర్యాల, గజ్వేల్, భద్రాచలం ప్రాంతాలకు ఒక్కొక్క వాహనాన్ని ఇచ్చారని తెలిపారు. దయచేసి ప్రతి నియోజకవర్గంలో 30 పడకల ఆసుపత్రులు ఉన్నాయో, వాటిని 100 పడకల ఆసుపత్రులుగా చేసి అక్కడ కూడా ఈ అంబులెన్స్‌లను పెట్టినట్లైతే ప్రజలకు చేరువలో ఉంటాయని ఈ సందర్భంగా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పువ్వాడ అజయ్ కుమార్ (ఖమ్మం):– అధ్యక్షా, మృత దేహాలను తరలించే వాహనాలను మొదటి విడతలో విడుదల చేసిన అంబులెన్స్‌లు రీఫర్బిష్డ్ వెహికల్స్ అని తెలియజేస్తున్నాను. గతంలో 108 అంబులెన్స్‌లుగా వాడిన కొన్ని వాహనాలను, ప్రస్తుతం మృతదేహాలను తరలించే వాహనాలుగా చేశారు. రాష్ట్రంలో 108 అంబులెన్స్‌ల అవసరం అనేకచోట్ల తక్కువగా ఉంది. ఈ 108 అంబులెన్స్‌లను వీటికి వాడుకుంటే, ఆ స్థానంలో కొత్త వాటిని రీఇంబర్స్ చేయవలసిన అవసరం ఉంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత 180 కొత్త 108 అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. వాటిని కొత్త వాహనాలతో రీఇంబర్స్ చేస్తున్నారా? లేదా, అనే విషయాలను తెలియజేయాలని మంత్రి గారిని కోరుతున్నాను.

డా. సి. లక్ష్మారెడ్డి:– అధ్యక్షా, ఈ కార్యక్రమాన్ని భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం జరిగింది.

(కొంతమంది బిజేపి సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:– మంత్రి గారు సమాధానం ఇచ్చినప్పుడు వింటే అర్థమవుతుంది.

డా. సి. లక్ష్మారెడ్డి:– అధ్యక్షా, గతంలో 108 వాహనాలను 145ను కొత్తగా కొనడం జరిగింది. 108 వెహికల్స్ ఎక్కువ కి.మీ.లు ప్రయాణించవలసి ఉంటాయి. కనుక కొన్ని వాహనాలను 108 వాహనాల్లో తీసివేసిన వాటిని ఈ కార్యక్రమానికి వాడడం జరుగుతోంది. తొందరలోనే 145, 108 వెహికల్స్‌ను కొనబోతున్నాము. వీటిలో 30 వాహనాలను ఈ కార్యక్రమానికి కేటాయించడం జరుగుతోంది. కార్పొరేట్ ఆసుపత్రిలో కాని, ప్రైవేట్ ఆసుపత్రిలో కాని, చనిపోయిన వారి గురించి ఇంకా స్టడీ చేస్తున్నాము. డెత్ స్టాటిస్టిక్స్‌ను తీసుకుని ప్రస్తుతం వాహనాలను అరేంజ్ చేశాము. ఎక్కడైనా అవసరమైన వద్ద కూడా వీటిని అరేంజ్ చేయడం జరుగుతుంది. ఎమ్.జి.ఎమ్ ఆసుపత్రికి మూడు వాహనాలను ఇచ్చాము. కాని ఇంకా అవసరమైతే రెండు వాహనాలను అదనంగా కేటాయించే ఆలోచన చేస్తు న్నాము. కార్పొరేట్ ఆసుపత్రిలో ఆరోగ్య శ్రీ పథకంపై చికిత్స చేయించుకుంటూ చనిపోయిన వారికి ఈ సౌకర్యాన్ని కల్పించేందుకు ఆలోచిస్తున్నాము. సుదూర ప్రాంతాల నుంచి మరియు వివిధ జిల్లాల నుంచి గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు ప్రజలు ఎక్కువగా వస్తారు. నిన్నటి వరకు 1056 ట్రాన్స్‌పోర్ట్ చేసిన మృతదేహాలలో 415 గాంధీ ఆసుపత్రి నుంచి, 323 ఉస్మానియా ఆసుపత్రి నుంచి, తరలించడం జరిగింది. ఈ ఆసుపత్రుల్లో ఎక్కువ అవసరం ఉంది కనుక వీటిని ఆ ఆసుపత్రులకు ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి అన్ని విషయాలను పరిశీలించి జిల్లా ఆసుపత్రులకు ఈ వాహనాలను పంపేందుకు ఆలోచిస్తున్నామని తెలియజేస్తున్నాను.

## చేపల పెంపకానికి ప్రోత్సాహం

*ప్రశ్న నెం 26 (2071)

సర్వశ్రీ చింతా ప్రభాకర్ (సంగారెడ్డి), పుట్టా మధుకర్ (మంథని), వేముల వీరేశం (నక్రేకల్), ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ (ఉప్పల్): – పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, రాష్ట్రంలో చేపల పెంపకాన్ని చేపట్టబోయే చెరువుల సంఖ్య ఎంత;

ఇ) చేప పిల్లల పంపిణీ నిమిత్తం ఈ సంవత్సరంలో ఖర్చు చేయదలచిన నిధుల పరిమాణం ఎంత?

**పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి (తలసాని శ్రీనివాస్ యాదవ్):–** అ) అవునండీ.

ఆ) సరిపోయేంత నీటి నిల్వలున్న శాఖకు చెందిన 4,096 రిజర్వాయర్లు, చెరువులలో చేప పిల్లల సరఫరాను చేపట్టడమువుతుంది.

ఇ) దీని నిమిత్తం అంచనా వేసిన వ్యయం రూ.2400కోట్లుగా ఉంది.

**11.00 ఉ.** శ్రీ చింతా ప్రభాకర్:– గత ప్రభుత్వ హయాంలో చేపపిల్లల పెంపకానికి ఎంత ఖర్చు పెట్టి ఉన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంత ఖర్చుపెడుతున్నారో చెప్పవలసినదిగా కోరుతున్నాను. గతంలో ఎన్ని చెరువులకు చేప పిల్లలను పెంచుకునే అవకాశం కల్పించారు. ఇప్పుడు ఎన్ని చేప పిల్లలను ఇచ్చారు. అంతేకాకుండా విత్తన కేంద్రాలకు సంబంధించి ఈ ప్రభుత్వం ఏదైనా చర్యలు చేపట్టిందా? చేపపిల్లలు కొనడానికి సంబంధించి టెండర్ ప్రాసెస్ చేసి ఉంటే ఏ రేటుకు కొన్నారు, గతంలో చేప పిల్లలకు సంబంధించి ఏ రేటుకు కొన్నారనే విషయాన్ని తెలియజేయమని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను. చేపపిల్లల ద్వారా మత్స్యకారులకు నుంచి ఉత్పత్తి ఎంత పెరిగే అవకాశం ఉంది. తద్వారా ఎంత లాభం వస్తుందనే అంచనా వేసి ఉన్నారనే విషయాన్ని తెలియజేయండి. చేప పిల్లలు పెరిగిన తర్వాత పెరిగిన శాతానికి సంబంధించి మార్కెట్లు లేని కారణంగా కొత్తగా మార్కెట్లు కట్టించే ఆలోచన ఏమైనా ఉందా అని మీ ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను. చేప పిల్లలను ఎక్కువ శాతం పెంచుతున్నారనే ఉద్దేశంతో గ్రామాలకు సంబంధించినటువంటి గ్రామపంచాయితీల్లో ఇంకా ఎక్కువగా ట్యాంకులల్లో, చెరువులల్లో పెంచడానికి చేపపిల్లలను ఇవ్వాలని సర్పంచ్‌లు అడిగారు. దానికి సంబంధించి ప్రభుత్వం ఏమైన పునరాలోచన చేస్తుందా అని మీ ద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ ఎస్.భాస్కర్ రావు (మిర్యాలగూడ):– అధ్యక్షా, చెరువుల్లో చేప పిల్లలను పెంచే కార్యక్రమం చాలా మహత్తరమైనది. చాలా మంచి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు సొసైటీలో ఉన్న చెరువుల వరకే చేపపిల్లలను వేస్తున్నారు. సొసైటీ లేని చోట చాలా చెరువులు ఉన్నాయి. వాటిలో చేప పిల్లలను వేయడానికి ఏమైన అవకాశం ఉందా అని మంత్రిగారిని అడుగుతున్నాను. ఇప్పటివరకు దళారులే చేపలు చెరువుల్లో వేస్తున్నారు. మంత్రిగారు తప్పకుండా ఒక జి.వోను ఇష్యూ చేయకపోతే ఉద్యోగస్తులు కూడా వాళ్లకే మద్దతు ఇచ్చి దళారులతోనే చేపపిల్లలను చెరువుల్లో వేస్తారు. మనం కష్టపడి చేసిన పని మళ్లీ నిరుపయోగం కాకుండా సొసైటీలు తప్ప ఏ దళారులు ఇందులోకి రాకుండా ఉండాలని ఒక జివోను ఇష్యూ చేయండి.

డా.జి.చిన్నారెడ్డి (వనపర్తి):– అధ్యక్షా, ఇప్పుడు మనం వదిలేటువంటి చేపపిల్లలను ఎక్కువగా కైకలూరు ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుంటున్నాము. నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో చాలా వరకు చెరువులను నింపే కార్యక్రమం జరుగుతుంది. మహబూబ్ నగర్ జిల్లాలో ఒకనాడు సరళసాగర్ అనే మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు దగ్గర చేప పిల్లలను పెంచే కార్యక్రమం జరుగు తుండేది. తరువాత ఆ కార్యక్రమాన్ని మూసివేసి ఇతర ప్రాంతాలకు తరలించడం జరిగింది. సరళసాగర్ ప్రాజెక్టుకు ఐ.డి.సి. తరపున లిఫ్ట్ ఇరిగేషన్ వచ్చింది. భీమా ప్రాజెక్టు క్రింద దానిని నింపే అవకాశం వచ్చింది కాబట్టి ఈ చేప పిల్లలను పెంచే కార్యక్రమాన్ని సరళసాగర్‌లో చేపట్టాలని కోరుతున్నాను. అదే విధంగా శ్రీరంగాపూర్ దగ్గర రంగసముద్రం అనేటువంటి ఒక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భీమా ప్రాజెక్టు రెండవ భాగంలో వచ్చింది. అక్కడ రెండు టి.ఎం.సి. నీటిని నిల్వ చేస్తున్నాము. ఎక్కడైతే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు ఉన్నాయో దాని క్రింద ఈ చేపపిల్లల పెంపకాల కార్యక్రమాన్ని చేపడితే బాగుంటుంది. ఆంధ్రనుంచి మనం చేపపిల్లలను తెప్పించు కుంటున్నామో అవి అక్కడ నుంచి రవాణా అయి ఇక్కడకు వచ్చే లోపు కొన్ని చేపపిల్లలు చనిపోతున్నాయి. అందుకని దగ్గరలో తక్కువ ఖర్చుతో చేపపిల్లలను పెంచే అవకాశం ఉంటుందని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీమతి గొంగిడి సునీత (ఆలేరు): అధ్యక్షా, గతంలో మత్స్య కార్మికులకు పెద్దగా సబ్సిడీ విత్తనాలు వచ్చేవి కాదు. రాష్ట్రమొత్తం కలుపుకుంటే కోటి విత్తనాలు మాత్రమే ఇచ్చేవారు. మన ముఖ్య మంత్రిగారు మత్స్యకారుల బ్రతుకుల్లో వెలుగులు తీసుకు రావాలని 40 కోట్లు విత్తనాలు అందించారు. గతంలో తక్కువ విత్తనాలు ఇచ్చే వారు కాబట్టి సొసైటీలు కూడా చాలా తక్కువగా ఉండేవి. ఒక్కొక్క మండలంలో 1, 2 సొసైటీలు,ఉండేవి. 5, 6 గ్రామాలకు సంబంధించిన చెరువులన్నీ కలుపుకొని ఒక్క సొసైటీగా చేసేవారు. ఏ గ్రామానికి ఆ గ్రామం సొసైటీలను ఏర్పాటు చేసుకుంటామని మత్స్యకారులు అడుగుతున్నారు. సంబంధిత అధికారుల దగ్గర సమగ్రమైన గైడ్‌లైన్స్ లేవు కాబట్టి కొత్త సొసైటీలు ఏర్పాటు చేసుకోవడానికి గైడ్‌లైన్స్ ఏమైనా జారీ చేశారా అని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. గతంలో చేపపిల్లలు చేతికి వచ్చిన తర్వాత జాలర్లకు పట్టుకోవడానికి వలలు, ఫ్రీజర్స్ వంటివి సబ్సిడీ ద్వారా ఇచ్చే వారు. అలాంటి ఆలోచన ఈ ప్రభుత్వానికి ఏమైనా ఉందా అని అడుగుతున్నాను.

శ్రీమతి ఎన్.పద్మావతి (కోదాడ):– అధ్యక్షా, చేప పిల్లల పెంపకం గురించి వివిధ నియోజక వర్గాల్లో ఏఏ ట్యాంకులను ఎంపిక చేసుకున్నారు. మీరు పట్టికలో ఏ మొత్తాన్ని అయితే చూపించారో ఆ మొత్తాన్ని బట్టి ట్యాంకులకు ఎంత ఇస్తున్నారు. అది కూడా ఫేజ్ ప్రకారం ఇస్తున్నారా అనేటువంటి విషయాన్ని మాకు కూడ తెలియజేస్తే మా నియోజకవర్గంలో సమాధానం చెప్పడానికి ఈ సమాచారం మాకు ఉపయోగకరంగా ఉంటుంది. కోదాడలో చాలామంది జాలరులు ఉన్నారు. అక్కడ చెరువులు ఉన్నా కూడా ఫీడెడ్ ఛానల్స్ లేక కొన్ని చెరువుల్లో చేపల పెంపకం చేయలేకపోతున్నారు. సంబంధిత మంత్రిగారు ఇరిగేషన్ మంత్రిగారితో మాట్లాడి అలాంటి చెరువులను కూడా వారు మరమత్తు చేసి చేపపిల్లలను అక్కడ కూడా పెంచితే బాగుంటుందని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ సి. రామ్మోహన్ రెడ్డి (మక్తల్):– మక్తల్ నియోజక వర్గంలో మత్స్యకారులు ఎక్కువగా ఉన్నారు. నా నియోజక వర్గంలో దాదాపు నాలుగు ప్రాజెక్టులున్నాయి. అందులో రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు. ఒకటి జూరాల రిజర్వాయర్. జూరాల రిజర్వాయర్ క్రింద ఇటీవల దాదాపు 18లక్షల చేపపిల్లలను వదిలిపెట్టుకున్నాము. ఆ చేపలను అమ్మడానికి ఒకటి హోల్‌సేల్ మార్కెట్ యార్డ్ కోసం గత సంవత్సరం ప్రతిపాదనను పెట్టడం జరిగింది. రిజర్వాయర్ నుంచి నేరుగా ఎవరెవరో చేపలు పట్టుకొని నేరుగా అమ్ముకొంటున్నారు. మనకు మార్కెట్ ప్రొవైడ్ చేయవలసినదిగా మంత్రిగారిని కోరుతున్నాను. జూరాల దగ్గర చేపపిల్లలను పెంచడానికి స్థలం చాలా ఎక్కువగా ఉన్నది. మహబూబ్‌నగర్‌లో కోయిల్‌సాగర్ , సరళసాగర్ లో చిన్నచిన్న చేపపిల్లలను పెంచుకునే అవకాశం ఉంది కాబట్టి మార్కెట్ ఏర్పాటు చేయవలసినదిగా మంత్రిగారిని కోరుతున్నాను.

**11.10 ఉ.** శ్రీ సున్నం రాజయ్య (భద్రాచలం):– అధ్యక్షా, చెరువుల్లో చేపల పెంపకం చాలా మంచి కార్యక్రమం. హైదరాబాద్‌కు వచ్చే ముందు 14వ తేదీన నా నియోజక వర్గంలోని తాలిపేరు అలాగే ఘట్టాపూర్‌లో పాలెం వాగు ప్రాజెక్టు రెండిట్లో కూడా 9 లక్షల చేప పిల్లలను వదిలి వచ్చాము. ఇది పెద్ద ప్రాజెక్టు. అక్కడుండే గిరిజనులు ఎక్కువగా ఈ చేపల పెంపకం మీద ఆధారపడుతున్నందున వారి కోసం వలలు ఇతర సౌకర్యాలను అందించాలి. నా నియోజక వర్గంలో ఈ వృత్తి మీద ఆధారపడ్డ మత్స్యకారులు గోదావరి నది మీద ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్నారు. పెద్ద జిల్లా అయిన గోదావరి జిల్లాలోని చర్ల, వెంకటాపురం, వాజేడు మొదలైన ప్రాంతాల్లో ఈ వృత్తి మీద ఆధారపడ్డ వారి గురించి ఆలోచించి, మత్స్యకారుల సమస్యలకు పరిష్కారం చూపాలి.

శ్రీమతి డి.కె.అరుణ (గద్వాల్):– నా నియోజక వర్గంలో నెట్టెంపాడు ప్రాజెక్టు క్రింద పెద్ద ఎత్తున రిజర్వాయర్‌లున్నాయి. నెట్టెంపాడు ప్రాజెక్టు క్రింద రేలంపాడు రిజర్వాయర్ 4 టి.ఎమ్.సి.లు ఉంది. అదేవిధంగా గుడ్డెందొడ్డి, సంఘాల, తాటికుంట, నాగర్‌దొడ్డి, ముచ్చోని పల్లి, చిన్నోని పల్లిలో అత్యధికంగా 9 టి.ఎమ్.సి.ల పైన స్టోర్ చేసుకునే బ్యాలెన్స్‌డ్ రిజర్వాయర్‌లున్నాయి. అక్కడ పెద్ద ఎత్తున చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలి. నెట్టెంపాడు క్రింద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను కొత్తగా కట్టిన దగ్గర నూతన సొసైటీలను ఏర్పాటు చేయాలి. ప్రక్క ఊర్లలో ఉండే సొసైటీలకు పాత సొసైటీలను కూడా అప్పచెప్పడం వల్ల అక్కడ ఎవరైతే రైతులు ఈ ప్రాజెక్టు క్రింద భూములు కోల్పోయారో వారికి ఉపాధి లేకుండా పోతోంది. భవిష్యత్తులో ఈ రిజర్వాయర్లలో చేపల పెంపకం చేపట్టి తద్వారా వారికి ఉపాధి కల్పిస్తామని చెప్పిన సందర్భాలున్నాయి. రిజర్వాయర్ల క్రింద భూములు కోల్పోయిన వారితో సొసైటీలు ఏర్పాటు చేయించి వారికి చేపల వేటను నేర్పించి, ఉపాధి చూపించే విధంగా మంత్రి గారు చర్యలు తీసుకోవాలి. దళారులు పెద్దమాఫియాగా ఏర్పడ్డారు, ఆ మాఫియాను అరికట్టడానికి మంత్రి గారు చర్యలు తీసుకోవాలి. జూరాల నుంచి

నీటిని అక్రమంగా చెరువులకు పెద్ద ఎత్తున తరలించుకొని క్యాట్ ఫిష్ పెంపకం జరుగుతోంది. దాన్ని కూడా పూర్తిగా అరికట్టాలని మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ షిండే హనుమంత్ (జుక్కల్):– ఫస్ట్ మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిజాంసాగర్ ప్రాజెక్టు మా జుక్కాల నియోజకవర్గంలో ఉంది. అప్పుడే ఏర్పాటు చేసినటువంటి ఫిష్ సీడ్ ఫామ్ శిథిలావస్థలో ఉంది, దాన్ని తిరిగి పునరుద్ధరించాలని ప్రభుత్వానికి దాని ఎస్టిమేషన్స్ కూడా పంపించడం జరిగింది, త్వరగా దాన్ని మంజూరు చేయాలని కోరుతున్నాను. రూ.24 కోట్లతో దాదాపు 4 వేల పై చిలుకు చెరువులలో చేప పిల్లలను కొనుక్కొచ్చి వేస్తున్నాము, ఎక్కడ నుంచో కొనుక్కు రావడం కంటే మన దగ్గరే ఆస్కారం ఉంది. కాబట్టి నిజాంసాగర్ ప్రాజెక్టులో ఫిష్ సీడ్ ఫామ్‌ను అభివృద్ధి చేసే విధంగా త్వరలోనే శాంక్షన్ చేయాలని కోరుతున్నాను. ఫిషరీస్‌లో కొంత అధికారుల కొరత ఉంది. ఇంత పెద్ద ఎత్తులో చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసి వాటిని చెరువుల్లో వేసిన తరువాత వాటిని పర్యవేక్షించడానికి సరైన స్టాఫ్ లేకపోతే కొంత అజమాయిషీ తగ్గుతుంది. సొసైటీలకు లాభం జరగాలనీ మంచి ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినప్పటికీ, ఆ సొసైటీలకు లాభం జరగకుండా దళారీలు తప్పుడ్రోవ పట్టిస్తూ ఇతరత్రా కార్యక్రమాలు చేస్తున్నారు. అధికారులను నియమించాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ బాబు మోహన్ (అందోల్):– నా నియోజకవర్గంలో సింగూరు ప్రాజెక్టు ఉంది. ఆ ప్రాజెక్టు చుట్టూ వేలాది మత్స్యకారులు నివసిస్తూ, జీవనోపాధి సాగిస్తున్నారు. మత్స్యకార సంఘాలున్న చెరువులకు మాత్రమే చేప పిల్లలను పెంచడానికి వేయడం జరిగింది. ఇంకా చాలా మంది మత్స్యకారులు నన్ను అడిగారు కొత్త సంఘాలు వేస్తే బాగుంటుందని. కొత్త సంఘాల ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా తమరి ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను. సింగూరులో దాదాపు 65 లక్షల చేప పిల్లలను నేను మంత్రి హరీష్‌రావు గారు 5, 6 సార్లు వేసి మత్స్యకారులకు జీవనోపాధి కల్పించాము. ఆ చేపలను అమ్ముకునేందుకు మార్కెట్లను ఏర్పాటు చేసే ఆలోచన మంత్రి గారికి ఏమన్నా ఉందా అని అడుగుతున్నాను. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు చేపలను ఎగుమతి చేసుకొని విక్రయాలు జరుగుతుండేవి. మన మత్స్యకారులకు కూడా అలాంటి మార్గం చూపిస్తే వారి జీవనోపాధికి మంచి బాటలు వేసిన వారమవుతామని నేను కోరుతున్నాను.

శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్:– గౌరవ సభ్యులు ప్రభాకర్ గారు, భాస్కర్ రావు గారు, చిన్నారెడ్డి గారు, సునీత గారు, పద్మావతి గారు, రామ్మోహన్ రెడ్డి గారు, రాజయ్య గారు, అరుణ గారు, షిండే గారు, బాబూ మోహన్ గారు సభ్యులంతా వారి వారి అభిప్రాయాలను, ఎలా చేస్తే బాగుంటుందనే సూచనలను ప్రభుత్వానికి ఈయడం జరిగింది. మనకు 1947వ సంవత్సరంలో దేశానికి స్వాతంత్ర్యం వస్తే, వెనుకబడిన, బడుగు బలహీన వర్గాల వారికి మాత్రం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత స్వాతంత్ర్యం వచ్చింది. వెనుకబడిన, బడుగు, బలహీన వర్గాల వారి గురించి మాట్లాడాలంటే సమయం సరి పోయేది కాదు. ఈరోజు ఇంత మంది సభ్యులు అనేక అంశాలను చెప్పారు.

భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా చేయని విధంగా మొట్టమొదటిసారి చేప పిల్లల సీడ్ ఫ్రీగా తెలంగాణ రాష్ట్రంలో అన్ని రిజర్వాయర్లు, అన్ని చెరువుల్లో ఇవ్వాలని ముఖ్యమంత్రి గారు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. గంగపుత్రులు, ముదిరాజ్‌లు, ఏజన్సీ ప్రాంతంలోని ట్రైబల్స్ జీవనోపాధి కోసం దీని మీద ఆధారపడినందుకు చేప పిల్లల పెంపకం మీద పూర్తి హక్కు వారికే ఉంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఫిషరీస్ బడ్జెట్ రూ. 5 కోట్లు. ఖర్చు మాత్రం రూ. 1 కోటి మాత్రమే. ఈరోజు బడ్జెట్ రూ. 101 కోటి రూపాయలు. కేవలం మార్పులు, చేర్పులు తీసుకురావాలనే ఉద్దేశంతో హర్రీబర్రీగా చేప పిల్లలను చెరువులో వేయలేదు. అధికారులను, కుల సంఘాలకు సంబంధించిన వారిని సెక్రటేరియట్‌కు పిలిచి 3 మీటింగ్‌లు పెట్టడం జరిగింది. వారికి చెప్పింది ఒకటే మన భారతదేశంలో ఏ రాష్ట్రం చేయనిది మొట్టమొదటి సారిగా ఈ కార్యక్రమానికి మన రాష్ట్రం శ్రీకారం చుట్టింది. గతంలో ఇంత పెద్ద ఎత్తున చేప పిల్లల పెంపకం జరగలేదు కాబట్టి, అధికారులకు కూడా కొత్త. మేము మీటింగ్‌లో చెప్పిన గైడ్ లైన్స్ ఏమిటంటే క్వాలిటీలో, క్వాంటిటీలో, సైజ్‌లో ఎక్కడ కూడా రాజీ పడొద్దని చెప్పాము. గతంలో దళారీ వ్యవస్థ ఉన్న మాట వాస్తవం. చేప పిల్లలను ఎంచుకునే విషయంలో సొసైటీ మెంబర్‌లు అధికారులు ఎన్ని గంటలైనా అక్కడే కూర్చొని ఎంచుకోమని చెప్పాము. సొసైటీ మెంబర్లు ఏమన్నారంటే దానికి కావాల్సిన పరికరాలు లేవు, ఆ కాంట్రాక్టర్లే తెచ్చుకుంటారు. దానికి లెక్క తేలిదంటే వెంటనే ఆర్డర్ ఇచ్చి ఆ పరికరాలను మనమే కొనుగోలు చేయడం జరిగింది. ఈ రోజు గంగపుత్రులు, ముదిరాజ్‌లు చాలా సంతోషంగా ఉన్నారు.

**11.20 ఉ.**

చేప పిల్లలు అందుబాటులోకి వస్తాయి. రేపు వాటిని అమ్ముకోడానికి అవకాశం ఉంది. ఎక్కడ చూసిన మన రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయి. మొన్న కలెక్టర్స్ కాన్ఫరెన్స్‌లో కూడా ముఖ్యమంత్రి గారు చెప్పారు. చెరువులు, చెరువుల్లోని చేపలు కళకళలాడడమే నా జీవిత లక్ష్యమని ముఖ్యమంత్రి గారు చెప్పారు. హరీష్‌రావు గారి దయవల్ల మిషన్ కాకతీయ కార్యక్రమంతో చెరువుల

పూడికతీత బ్రహ్మాండంగా జరిగింది. చేపపిల్లల పెంపకం విషయంలో గతంలో రాష్ట్రాన్ని యూనిట్‌గా చేసుకొని, ఇష్టానుసారంగా టెండర్లు వేసి, రేట్లు మాట్లాడుకొని వ్యవహారం నడిపించుకున్నారు. జిల్లాలను ఒక యూనిట్‌గా తీసుకొని జిల్లా వారీగా టెండర్లు వేసే విధంగా, ఎక్కడా కాంప్రమైజ్ కాకూడదని డైరెక్షన్స్ ఇచ్చాము. దాంట్లో భాగంగా గతంలో రూపాయి నలభై పైసలున్న చేప పిల్ల ఇప్పుడు అరవై పైసలకే దొరుకుతుంది. దానివల్ల మనకు రూ. 24 కోట్లు ఆదా అయ్యింది. ఇన్ని కోట్ల చేప పిల్లలను పెంచిన తరువాత, మార్కెటింగ్ ఎక్కడ చేయాలి, ఎక్స్‌పోర్ట్ ఏ విధంగా చేస్తారు అని అడిగారు. దీనికి సంబంధించిన బెనిఫిషరీస్ ఉన్నారు. వంద మార్కెట్లను ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉంది. నేను గౌరవ శాసన సభ్యులకు, గౌరవ శాసన పరిషత్ సభ్యులకు, పార్లమెంట్ సభ్యులందరినీ రిక్వెస్ట్ చేస్తున్నాను. ఈ విషయమై ఆల్‌రెడీ కలెక్టర్లకు లెటర్స్ పంపించడం జరిగింది. మీరు చొరవ తీసుకొని మార్కెట్ యార్డ్‌లకు సంబంధించి స్థలాలను చూపిస్తే మార్కెట్ యార్డులను నిర్మించడం జరుగుతుంది. ఈ విషయంలో పెద్దలు శ్రీనివాస్ రెడ్డి గారి నియోజకవర్గంలో ఫౌండేషన్ స్టోన్ వేశాము. అక్కడ బ్రహ్మాండమైన మార్కెట్ ఉంది. దానికి కాంపౌండ్ వాల్, డ్రైనేజ్ ఫెసిలిటీస్, వాటర్ ఫెసిలిటీస్ ఒక బోర్ వేసి అన్ని సదుపాయాలు కల్పించడం జరిగింది. ఎవరు అడిగితే వాళ్లకి, ఆయా నియోజకవర్గాలలో స్థలాలు సేకరిస్తే, ఈ చేపలను, ఏప్రిల్, మే వచ్చే లోపల ఆ మార్కెట్‌లలో పెట్టడానికి అవకాశం ఉంటుంది. అందువల్ల గౌరవ సభ్యులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలని తెలుపుతున్నాను. మన దగ్గర ఈ సీడ్‌ను పెంచుకోడానికి అవకాశం ఉంది. భవిష్యత్‌లో ఇది ఉపయోగపడుతుంది. మహబూబ్‌నగర్, నిజామాబాద్ అదే విధంగా ఇంకా కొన్ని ప్రాంతాలలో మనం భవిష్యత్‌లో మార్కెట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని మనవి చేస్తున్నాను. ఆ దిశలో ప్రభుత్వం ఆలోచన చేస్తుందని, తప్పకుండా రాబోయే కాలంలో మన ప్రాంతంలో చేపలకు సంబంధించిన సీడ్ ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. చేపల పెంపకం విషయమై గతంలో శ్రీనివాస్ రెడ్డి గారు వేరే రాష్ట్రాలకు వెళ్లి తెలుసుకోవడం జరిగింది. అందులో భాగంగా వారు జార్కండ్ కూడా వెళ్లారు. ఆరు ప్రాంతాలలో ఫిష్ కల్చర్‌ని అమలు చేస్తున్నారు. అవకాశం ఉంటే మనం అన్ని ప్రాంతాలలో చేద్దాము. అరుణ గారు, మిగిలిన సభ్యులు దళారి వ్యవస్థల గురించి మాట్లాడారు. వచ్చే సంవత్సరం నుండి దళారులు ఉండడానికి వీలు లేదు. ఆ విషయాన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటుంది. గతంలో దళారి వ్యవస్థ ఉండేది. సొసైటీలు, సొసైటీ మెంబర్స్ సంఖ్య విషయంలో కూడా కొంతమందికి ఆందోళన ఉంది. మనకు అవకాశం వస్తుందో లేదో అనే భావనలో ఉన్నారు. మొన్న నిజాం కాలేజిలో, ముదిరాజుల సంఘం మీటింగ్‌లో, ప్రెస్ కాన్ఫరెన్స్‌లో, ఫెడరేషన్ సభ్యుల మీటింగ్ అప్పుడు కూడా నేను చెప్పాను. ఇక్కడున్న శాసనసభ్యులకు, అసెంబ్లీ సమావేశాలు చూస్తున్న ప్రతి ఒక్కరికీ, ఆ కమ్యూనిటీ వాళ్లకి, అందరికీ తెలుపుతున్నారు. చేప పిల్లలను పెంచడం అనేది ఒక్క సొసైటీ మెంబర్ హక్కు కాదు. ఆ కులానికి సంబంధించిన ప్రతి వ్యక్తి హక్కు అని మనవి చేస్తున్నాను. ఆ చేప పిల్లలు, గ్రామంలో ఉన్నటువంటి, కులానికి సంబంధించినటువంటి వారికి హక్కు కల్పించాలని మా ఉద్దేశ్యం. ఆ నియోజకవర్గాలలో, ఆ గ్రామాలలో ఉన్నటువంటి వాళ్లను కొత్తగా సొసైటీలలో సభ్యులుగా చేర్చుకోడానికి మీ అందరి సహకారం కావాలి. ప్రభుత్వ ఆలోచన ఒక్కటే అధ్యక్షా. ఎంత డబ్బు ఖర్చు అవుతుందని కాదు, వెనుకబడిన కులాలకు సంబంధించిన వాళ్ల, ఆర్థికంగా, సామాజికంగా బాగుపడాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని తీసుకోవడం జరిగింది. వృత్తి పరంగా ఎవరైనా చనిపోతే, వారి కుటుంబ సభ్యులకు ఇచ్చే మూడు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను అయిదు లక్షల రూపాయలకు పెంచడానికి మేము శ్రీకారం చుట్టడం జరిగింది. మా టార్గెట్ అది.

(అంతరాయం)

దయచేసి వినండి. మళ్లీ తరువాత ఏం జరగలేదని అంటారు. చేప పిల్లల పెంపకానికి సంబంధించి, మార్కెట్ యార్డులకు సంబంధించి మీరు ఇచ్చిన ప్రతి ప్రతిపాదనను శాంక్షన్ చేసే బాధ్యత తీసుకుంటామని నిండు సభలో తెలియజేస్తున్నాను. నలభై సంవత్సరాల క్రింద స్వాతంత్ర్యం రాలేదు. బడుగు, బలహీన వర్గాలు, వెనుకబడిన తరగతులకు కేసీఆర్ గారి పరిపాలనలో వచ్చింది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇన్ని కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఏప్రిల్, మే, జూన్ మొదలయ్యే సరికి రూ. 500 కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నాము. అందుకే మార్కెటింగ్ ఫెసిలిటీస్ కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ రోజు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని సభ ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను.

మీరు తీసుకునే స్థలం ఆధారంగా, పట్టణాలలో యూనిట్‌కి రూ. 7.50 లక్షలు ఇస్తే సరిపోతుందని అంచనా, సైజ్ పెద్దగా ఉంటే ఎక్కువ ఇస్తాము. మార్కెట్ యార్డులను నిర్మించడానికి ప్రభుత్వం వద్దకు ఎన్ని ప్రతిపాదనలు తీసుకొచ్చినా అన్నింటినీ మంజూరు చేస్తాము.డబ్బు క్రైటీరియా కాదని మీ ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను.

**11.30 ఉ.** శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి:– అధ్యక్షా, మన జనాభాలో అధికశాతమైన రైతాంగం యొక్క "రైతు దినోత్సవం". ఈ కిసాన్ దినోత్సవం సందర్భంగా గౌరవ శాసనసభ్యులకు, రాష్ట్రంలో ఉండే రైతాంగానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. కేసీఆర్ గారి నాయకత్వంలో రైతాంగానికందరికీ మంచిరోజులు వచ్చాయి. ఈ మంచి రోజులు ఇంకా కొనసాగి వారి నాయకత్వంలో రైతులందరూ సుఖంగా బ్రతుకుతారని ఆశిస్తున్నాను.

MR.SPEAKER: Question No.2169 Minister for Health.

## బీబీనగర్ నిమ్స్‌లో ఓ.పి. సేవలు

*ప్రశ్న నెం. 68(2169)

సర్వశ్రీ పైళ్ల శేఖర్ రెడ్డి (భువనగిరి), కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి (మునుగోడు):– వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) యాదాద్రి జిల్లా బీబీనగర్ వద్ద నిమ్స్ ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ల వైద్య సర్వీసులు లభ్యంగా ఉన్నాయన్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ప్రస్తుతం ప్రతిరోజు చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య ఎంత;

ఇ) సదరు ఆసుపత్రిలో ఇన్ పేషెంటు సర్వీసులను ఎప్పటిలోగా ప్రారంభించడమవుతుంది;

**వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (డా. సి. లక్ష్మారెడ్డి ):**

అ) అవునండీ.

ఆ) రోజుకు 100 నుండి 120 మంది అవుట్‌పేషెంట్లు చికిత్స పొందుతున్నారు.

ఇ) 4 నెలల లోపల ఇన్ పేషెంట్ సర్వీసులను ప్రారంభించడమవుతుంది.

శ్రీ పి. శేఖర్ రెడ్డి:– అధ్యక్షా, బీబీనగర్ నిమ్స్ హాస్పటల్‌ను మన ముఖ్యమంత్రిగారు, ఆరోగ్య శాఖ మంత్రిగారు మార్చి మాసంలో ఓ.పి సేవలను ప్రారంభించారు. కానీ మా పేదవారు కూడా కార్పోరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో నిమ్స్‌లో ఓ.పి సేవలు ప్రారంభించినప్పటికీ ఇన్ పేషెంట్లకు సంబంధించి కనీసం మూడు, నాలుగు బెడ్లతోనైనా ప్రారంభించాలి. ఎందుకంటే ఇప్పటికే 16,500 మంది పైచిలుకు పేషెంట్లు వివిధ గ్రామాల నుంచి వస్తున్నందున వెంటనే ఇన్‌పేషెంటు సేవలు ప్రారంభించి తద్వారా పేదవారికి మెరుగైన వైద్యసేవలు అందించి కేసీఆర్ గారి లక్ష్యాన్ని నెరవేర్చాలని మీద్వారా కోరుతున్నాను.

శ్రీ కె. ప్రభాకర్ రెడ్డి: అధ్యక్షా, 2006 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 100 కోట్లతో బీబీనగర్‌లో నిమ్స్ హాస్పటల్‌కు పౌండేషన్ వేసింది. ఆ తరువాత 2007 సంవత్సరంలో పనులు మొదలయ్యాయి. ఆ తరువాత 2009వ సంవత్సరంలో ఎన్నికలు వచ్చిన సందర్భంగా సదరు హాస్పటల్ పనులు ఇన్‌కంప్లీట్‌గా ఉన్నప్పటికీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు హడావిడిగా హాస్పటల్‌ను ప్రారంభించారు. కానీ 2009 నుంచి 2014 వరకు ఆ హాస్పటల్ ప్రజలకు సేవలు అందించలేదు. అక్కడ అవుట్ పేషెంట్లు లేరు, ఇన్ పేషెంట్లు లేరు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేసీఆర్ గారి ఆశీస్సులతో, గౌరవ జిల్లా మంత్రి జగదీశ్వర్ రెడ్డి గారి చొరవతో, గౌరవ ఆరోగ్య శాఖ మంత్రిగారి కో-ఆర్డినేషన్‌తో అవుట్ పేషెంట్లు ఆ హాస్పటల్‌ను వినియోగించుకుంటున్నారు. అక్కడ అవుట్‌పేషెంటు విభాగాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా నల్గొండ, వరంగల్ జిల్లా వాసులు అనేక మంది అవుట్ పేషెంట్లు వచ్చి ఆ హాస్పటల్‌ను వినియోగించుకుంటున్నారు. అక్కడ ఇన్ పేషెంట్ల విభాగాన్ని కూడా అందుబాటులోకి తేవాల్సిన అవసరమున్నందున ఇన్ పేషెంట్ల విభాగాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారని మంత్రిగారిని అడుగుతున్నాను? అంతే కాకుడా ఆ ప్రాంతంలో రూరల్ మెడికల్ కళాశాలను కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. అదే విధంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదివే అవకాశాన్ని విద్యార్థులకు కల్పిస్తే బాగుంటుందని మీద్వారా మనవిచేస్తున్నాను.

డా. సి. లక్ష్మారెడ్డి:– అధ్యక్షా, బీబీనగర్‌లో ఉన్న నిమ్స్ హాస్పటల్ 2005 నుంచి 2009 వరకు కన్‌స్ట్రక్షన్ జరగడం, ఆ తరువాత అది పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడం జరిగింది. అటువంటి హాస్పటల్‌కు సంబంధించిన కాంట్రాక్టర్లతో మాట్లాడి కొన్ని పనులు చేయించి ఓ.పి సేవలను ప్రారంభించడం జరిగింది. ఇంకా అక్కడ నిర్మాణానికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. వచ్చే మూడు, నాలుగు మాసాలలో పూర్తిస్థాయిలో ఇన్‌పేషెంటు విభాగాలను ప్రారంభించి ఆ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించడం జరుగుతుంది. ఆ ప్రాంతం మొత్తం హైవే కాబట్టి రోడ్డు యాక్సిడెంట్లు ఎక్కువ జరుగుతున్నాయనే ఉద్దేశంతో ట్రామా సెంటర్‌ను కూడా అక్కడ ఏర్పాటు చేస్తాము. అట్లాగే గౌరవ సభ్యులు ప్రభాకర్ రెడ్డి గారు అడిగినట్లుగా అక్కడ మెడికల్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి

పరిశీలనలో ఉన్నది. వచ్చే మూడు, నాలుగు మాసాలలోనే బీబీనగర్‌లోని నిమ్స్ హాస్పటల్‌ను ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవడం జరుగుతుంది.

శ్రీ చింతల రామచంద్రారెడ్డి (ఖైరతాబాద్) :- అధ్యక్షా, బీబీనగర్‌లో నిమ్స్ హాస్పటల్‌ను నిర్మాణం చేసినప్పుడు 150 ఎకరాల పైచిలుకుతో అక్కడ అన్ని వసతులతో హాస్పటల్‌ను ఏర్పాటుచేసి పేషెంట్లకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని గత సభలో కూడా మేమందరం మాట్లాడటం జరిగింది. ఇంతకుముందు గౌరవ మంత్రిగారు మాట్లాడుతూ అవుట్ పేషెంట్లు 110 మంది వస్తున్నారని చెప్పారు. రూ. 100 కోట్ల పైచిలుకు బడ్జెట్‌తో 155 ఎకరాల భూమిలో నిర్మాణం చేసిన హాస్పటల్ అన్ని వసతులతో ఉండాల్సిన హాస్పటల్ అది. దానికి ఇన్‌పేషెంటుగా మూడు బెడ్లు, నాలుగు బెడ్లు అని కాకుండా వంద బెడ్లకంటే ఎక్కువ వసతులతో హాస్పటల్ నిర్మాణం చేసి అందులో అన్నిరకాల వైద్య సౌకర్యాలను కల్పించాలి. ఎందుకంటే ఆరేడు జిల్లాల ప్రజలకు సౌకర్యంగా ఉన్నటువంటి హాస్పటల్ అన్ని వసతులతో ఉండాలి. ఎందుకంటే హైదరాబాదులోని నిమ్స్ హాస్పటల్ నుంచి బీబీనగర్‌లోని నిమ్స్ హాస్పటల్‌కి కావలసినవన్నీ ఏర్పాటు చేయడం జరుగుతుంది. కాబట్టి వెంటనే దానిని పూర్తి చేయాలి. అక్కడి డైరెక్టర్ గారికి కూడా అన్ని విషయాలు తెలుసు. కాబట్టి అన్ని వసతులతో ఆ హాస్పటల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని మీద్వారా కోరుతున్నాను.

డా. సి. లక్ష్మారెడ్డి:- అధ్యక్షా, బీబీనగర్‌లో ఉన్న నిమ్స్ హాస్పటల్‌కు 161 ఎకరాలను కేటాయించడం జరిగింది. దాంట్లో ఆరెకరాలు రోడ్ వైడెనింగ్‌లో పోవడం వల్ల 155 ఎకరాలు మిగిలింది. ఈ హాస్పటల్‌ను వంద పడకల ఆసుపత్రి కాకుండా 650 పడకలతో 21 డిపార్ట్‌మెంట్లతో అంటే హైదరాబాదులోని నిమ్స్‌లో ఉన్న డిపార్ట్‌మెంట్లతోబాటు ఇంకా అదనంగా కొన్ని డిపార్ట్‌మెంట్లను యాడ్‌చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవడానికి ప్రయత్నం చేస్తున్నాము. గతంలో కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లడం వంటి వివిధ కారణాలున్నందున ఇప్పటికే వాటిని కొంతవరకు పరిష్కరించడం జరిగింది. ఈ హాస్పటల్‌పనులు మరలా మొదలయ్యాయి కాబట్టి వచ్చే మూడు, నాలుగు మాసాలలో పూర్తిస్థాయిలో ఇన్‌పేషెంటు విభాగాన్ని అందుబాటులోకి తేవడం జరుగుతుంది.

MR.SPEAKER: Now, I will take up adjournment motions.

## సభాకార్యక్రమము

### వాయిదా తీర్మానాల అనుమతి గురించి

1. శ్రీ కె. జానారెడ్డి గారు మరియు ఇతరులు ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీల సంక్షేమ పథకాలకు మార్జిన్ మనీ విడుదల గురించి ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

2. శ్రీ జి. కిషన్‌రెడ్డి గారు సంచార జాతులవారి సంక్షేమం మరియు అభివృద్ధి కోసం చట్టం తేవాలని కోరుతూ ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

3. శ్రీ ఏ. రేవంత్‌రెడ్డి గారు మరియు ఇతరులు తెలంగాణ అమరవీరుల స్మృతి చిహ్నం ఏర్పాటు గురించి ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

4. శ్రీ సున్నం రాజయ్య గారు గ్రామసేవకుల వేతనాలు, పదోన్నతుల గురించి ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

MR.SPEAKER: Now, Tea break for 15 minutes.

(Then the House adjourned at 11.40 A.M for 15 minutes)

12.00 మ. (The House re-assembled at 12.00 Noon of the Clock of the House and the Hon'ble Speaker was in the Chair.)

MR. SPEAKER: Now, let us take up Short Discussion on National Highways, R & B Roads & Bridges in the State.

## లఘుచర్చ

### " రాష్ట్రంలో జాతీయ రహదారులు, ఆర్ & బి రోడ్లు మరియు వంతెనల'' గురించి

శ్రీ కె. చంద్ర శేఖర్ రావు (ముఖ్యమంత్రి): అధ్యక్షా, సమైక్య రాష్ట్రంలో నేటి తెలంగాణ రాష్ట్రం ఒక ప్రాంతంగా ఉన్న సమయంలో అనేక సందర్భాల్లో మనమంతా అనేక రకాలుగా బాధపడ్డాము. గత్యంతరం లేని పరిస్థితులను నెమరేసుకుంటూ కొన్ని సందర్భాల్లో కుమిలి పోయే వాళ్లము. తెలంగాణ ఉద్యమం 15 సంవత్సరాల సుదీర్ఘ పోరాటమని నేను చెబుతుంటాను. 15 సంవత్సరాల సుదీర్ఘ పోరాటమని నేనెందుకు చెబుతాననే విషయం అందరికన్నా మీకు బాగా తెలుసు. 2001వ సంవత్సరంలో ఈ ఉద్యమం

ప్రారంభమైందని చాలా మంది అనుకుంటున్నారు. తమరు, నేను, గౌరవ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి గారు, వ్యవసాయ శాఖ మంత్రి హరీశ్ రావు గారు, ఇంకా కొంత మంది మిత్రులం కలిసి 1999లోనే ఉద్యమానికి శ్రీకారం చుట్టినప్పటికి 2001లో పూర్తి స్థాయిలో లాంచ్ చేశాము. ఆ రోజు ఎంత బాధ పడినప్పటికీ అనేక కష్టాలు తీరకుండా ఉండేవి. కరెంటు కష్టాలు తీరాలనుకున్నాము. కొంత మేరకు సఫలీకృతం అయ్యాము. నాశనం అయిన మన చెరువులను చూసి కుమిలి పోయాము. ఆత్మ గౌరవం పెరిగే లాగ మన చెరువులను బాగు చేసుకోవాలనుకున్నాము. ఇప్పటివరకు దాదాపుగా 15,000 నుంచి 16,000 చెరువులను బాగు చేసుకున్నాము. ఇంకా ఆ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సంవత్సరం సంవృద్ధిగా కురిసిన వర్షాల వల్ల నిండిన చెరువులను చూస్తే మనసు నిండుతున్నది. పేదలకు, వృద్ధులకు, అభాగ్యులకు ఇచ్చే పింఛన్‌లను బిక్షమేసినట్లు కాకుండా, ఆత్మ గౌరవ పూర్వకంగా వారికి అవసరమైనంత మేరకు, కడుపు నిండా పెన్షన్స్‌ను ఇచ్చుకోవడం జరుగుతోంది. ఇలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

జాతీయ రహదారుల విషయంలో చాలా బాధ పడేవారము. జాతీయ రహదారులు ఆంధ్ర రీజియన్‌లో ఎక్కువగా ఉండటం, తెలంగాణ రీజియన్‌లో తక్కువగా ఉండటం, సమైక్య రాష్ట్రంలో వివక్షకు గురికావడాన్ని కళ్లార చూశాము. పట్టుపట్టి సాధించుకోవాలని తీవ్ర ప్రయత్నాలు మొదలు పెట్టాము. సమర్థులైన మంత్రి గారు ఆ శాఖను నిర్వహిస్తున్నారు. ఆ శాఖ అధికారులు చురుకుగా కేంద్ర ప్రభుత్వంతో పర్స్యూ చేయడం వల్ల ఈరోజు అద్భుతమైన ఫలితం వచ్చింది. ఇది చాలా అరుదుగా లభించే అవకాశం. తెలంగాణ సాధనకై బాధ పడ్డాము, తపన పడ్డాము, కుములిపోయాము. విముక్తి కావాలనుకున్నాము, విముక్తి చేసుకున్నాము. ఆనాడు ఉద్యమ సమయంలో ప్రొ. జయశంకర్ గారు, మీరు, కళ్లెం యాదయ్య కావచ్చు. ఇంకా చాలా మంది మన మధ్య లేరు స్వర్గస్తులయ్యారు. తెలంగాణను ఎలా సాధించుకోవాలని, తెలంగాణ ఏర్పడిన తరువాత మనము ఏవిధంగా చేసుకోవాలని ఎప్పుడూ ఆలోచించే వాళ్లము. భగవంతుని కృప, ప్రజల దీవెనల వల్ల, కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొంత మేరకు సాధించుకోగల్గుతున్నాము. మనం చేసుకున్న ఎఛీవ్‌మెంట్స్‌లో జాతీయ రహదారి ఒకటి. మంత్రి గారు జాతీయ రహదారులతో పాటు, రాష్ట్ర రహదారులు, వంతెనలు, తెలంగాణ ప్రజలు కోరుకుంటున్న విషయాల గురించి మరొక నోట్ పెట్టారు. ఈనోటు కూడా సభ్యులందరికి అందుబాటులో ఉంచాము. ఈ రెండు విషయాల గురించి మాట్లాడినట్లైతే మంత్రి గారు సమాధానం ఇస్తారు. నేను కూడా సభలో ఉండే ప్రయత్నం చేస్తాను.

తెలంగాణ రాష్ట్రంలో నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రాన్ని అంగీకరింపచేయడంలో, అవసరమైన నిధులను పెద్ద మొత్తంలో మంజూరు చేయించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం గణనీయమైన విజయం సాధించిందని సంతోషంగా ప్రకటిస్తున్నాను.

(ట్రెజరీ బెంచీల నుంచి బల్లలు చరిచారు)

ఈ విజయం బంగారు తెలంగాణ సాధనలో ఒకమేలి మలుపు. ఏడు దశాబ్దాల చరిత్రలో గత ప్రభుత్వాలు సాధించలేకపోయిన అద్భుతమైన ఫలితాన్ని కేవలం రెండున్నరేళ్ల కాలంలో అకుంఠిత దీక్షతో, నిరంతర కృషితో తెలంగాణ ప్రభుత్వం సాధించగలిగింది.

సమైక్యరాష్ట్రంలో తెలంగాణకు అన్ని రంగాల్లో తీవ్రమైన వివక్ష అమలైనట్లుగానే జాతీయరహదారుల గుర్తింపు విషయంలోనూ అమలైంది. కాలానుగుణంగా, పెరిగిన అవసరాలకు తగినట్లుగా కొత్త జాతీయ రహదారులు ఏర్పడలేదు. ఇది తెలంగాణ అభివృద్ధికి గొడ్డలి పెట్టుగా మారింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పరిస్థితిని మార్చేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టింది. జాతీయ రహదారుల నిర్మాణంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుంచింది. నూతన జాతీయ రహదారుల నిర్మాణం అవసరాన్ని కేంద్రం ముందు బలంగా ప్రతిపాదించింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి మనకున్న జాతీయ రహదారి కేవలం 2,527 కిలోమీటర్లు. ఆనాడు దేశంలో జాతీయ రహదారుల సగటు 2.80 కిలోమీటర్లు మాత్రమే. ఆనాడు సమైక్య రాష్ట్రంలో ఆంధ్ర సగటు 3.15 కిలోమీటర్లు అయితే, తెలంగాణ సగటు 2.20 కిలోమీటర్లు మాత్రమే. రాష్ట్రం ఏర్పడే నాటికి జాతీయ రహదారుల సగటులో దక్షిణ భారతదేశంలో తెలంగాణ అట్టడుగున ఉన్నది. ఈపరిస్థితిని మార్చి తీరాలని ప్రయత్నాలు ప్రారంభించాం. కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారిని అనేక పర్యాయాలు కలిసి జాతీయ రహదారులను విస్తరించాల్సిందిగా విన్నవించాం. నేను స్వయంగా పూనుకొని పలుమార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధాన మంత్రి గారిని, కేంద్ర మంత్రిగారిని కలిసి సమగ్ర నివేదికలను, ప్రతిపాదనలను అందించాను.

రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనలోని సహేతుకతను కేంద్రం గుర్తించింది. తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి

ముందుకొచ్చింది. 2,776 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారులను రాష్ట్రానికి మంజూరు చేయించుకోవడంలో ప్రభుత్వం సఫలమైంది.

ఇక్కడ ప్రత్యేకమైన విషయాన్ని పేర్కొనాలి. గత ఏడు దశాబ్దాలలో తెలంగాణలో నిర్మించిన జాతీయ రహదారి కేవలం 2,527 కిలోమీటర్లు. ఇప్పుడు ఈ రెండున్నరేళ్లలో తెలంగాణ ప్రభుత్వం సాధించగల్గింది 2,776 కిలోమీటర్లు. గత ప్రభుత్వాలు 70 సంవత్సరాల్లో సాధించిన హైవేల కన్నా ఈ రెండున్నరేళ్లలో మా ప్రభుత్వం ఎక్కువ హైవేలను సాధించింది.

**12.10 మ.**

**కొత్తగా మంజూరైన 19 జాతీయ రహదారులు**

| క్ర. సం. | రహదారి పేరు | కి.మీ. |
|---|---|---|
| 1. | హైదరాబాద్ – మెదక్ – రుద్రూరు – బోధన్ – బాసర – భైంసా | 248 |
| 2. | నిజాంపేట్ – నారాయణ ఖేడ్ – బీదర్ | 60 |
| 3. | మద్నూర్ – బోధన్ – నిజామాబాద్ | 76 |
| 4. | హైదరాబాద్ – మొయినాబాద్ – చేవేళ్ల – మన్నెగూడ – కొడంగల్ – కర్ణాటక సరిహద్దు వరకు | 135 |
| 5. | కోదాడ – మిర్యాలగూడ – దేవరకొండ – కల్వకుర్తి – జడ్చర్ల | 211 |
| 6. | కరీంనగర్ – సిరిసిల్ల – కామారెడ్డి – ఎల్లారెడ్డి – పిట్లం | 165 |
| 7. | సిరిసిల్ల – సిద్దిపేట – జనగాము – అర్వపల్లి – సూర్యాపేట | 184 |
| 8. | మంచిర్యాల – చంద్రాపూర్ (మహారాష్ట్ర) – వయా ఆసిఫాబాద్ – రెబ్బన | 90 |
| 9. | నిర్మల్ – మామడ – ఖానాపూర్ – మల్లాపూరం – రాయికల్ | 90 |
| 10. | సూర్యాపేట – ఖమ్మం – అశ్వారావుపేట – రాజమండ్రి | 177 |
| 11. | సారపాక – ఏటూరునాగారం – కాళేశ్వరం – చెన్నూరు – కౌటాల – సిర్పూర్ | 396 |
| 12. | మిర్యాలగూడ – పిడుగురాళ్ల – నర్సరావుపేట ( ఆంధ్రప్రదేశ్) | 26 |
| 13. | భద్రాచలం – జీలుగుమిల్లి – జంగారెడ్డిగూడెం – దేవరపల్లి | 68 |
| 14. | జహీరాబాద్ – బీదర్ – నెగ్లూర్ | 25 |
| 15. | సంగారెడ్డి – నర్సాపూర్ – తూప్రాన్ – గజ్వేల్ – జగదేవ్ పూర్ – భువనగిరి – చౌటుప్పల్ | 152 |
| 16. | చౌటుప్పల్ – ఇబ్రహీంపట్నం – ఆమనగల్ – షాద్‌నగర్ చేవెళ్ల – శంకర్ పల్లి – కంది | 186 |
| 17. | మెదక్ – సిద్దిపేట – ఎల్కతుర్తి | 133 |
| 18. | హైదరాబద్ ఓ. ఆర్. ఆర్. ఘట్‌కేసర్ – ఏదులాబాద్ – వలిగొండ – తొర్రూరు – కెల్లికుదురు – మహబూబాద్ – ఇల్లందు – కొత్తగూడెం | 234 |
| 19. | వరంగల్ – ఖమ్మం | 120 |
| | మొత్తం : | 2,776 |

త్వరలోనే మన రాష్ట్రంలో జాతీయ రహదారుల పొడవు 5,303 కిలోమీటర్లకు పెరగనుందని సభకు సగర్వంగా తెలియచేస్తున్నాను. ఈరోజు దేశంలో జాతీయ రహదారుల సగటు 3.81 కిలోమీటర్లు. తెలంగాణ రాష్ట్రంలో అది 4.62 కిలోమీటర్లు. అంటే ప్రభుత్వ కృషి వల్ల తెలంగాణలో జాతీయ రహదారుల సగటు జాతీయ సగటును మించిపోయింది. దక్షిణ భారతదేశంలో నిన్నటి దాకా అట్టడుగున ఉన్న మన రాష్ట్రం, నేడు అగ్రభాగాన నిలిచిందని ఎంతో ఆత్మవిశ్వాసంతో ప్రకటిస్తున్నాను.

జాతీయ రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 2,690 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను మన రాష్ట్రానికి మంజూరు చేసింది. మరోవైపు రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి సెంట్రల్ రోడ్ ఫండ్ నుంచి 1,020 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. ఎన్.హెచ్.ఎ.ఐ. పరిధిలో చేపట్టే మరో ఐదు హైవేలను ఫోర్ లేన్లతో నిర్మించడానికి 8వేల కోట్ల రూపాయలను ఇస్తున్నామని కేంద్ర మంత్రి శ్రీ నితిష్ గడ్కరీ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఇండియన్ రోడ్ కాంగ్రెస్ లో ప్రకటించారు. ఇది రాష్ట్ర ప్రజలకు గొప్ప శుభవార్త. ఆ రహదారుల వివరాలు ఇలా ఉన్నాయి.

| | | | |
|---|---|---|---|
| 1. | సంగారెడ్డి | – నాందేడ్ రోడ్ కు | 2,500కోట్లు |
| 2. | సూర్యాపేట | – ఖమ్మం రోడ్‌కు | 1,000కోట్లు |
| 3. | జగిత్యాల | – కరీంనగర్ – వరంగల్ రోడ్‌కు | 2,300కోట్లు |
| 4. | మంచిర్యాల | – చంద్రాపూర్ రోడ్‌కు | 1,500కోట్లు |
| 5. | కోదాడ | – ఖమ్మం రోడ్‌కు | 700కోట్లు |

ఇవే కాకుండా మారుమూల అటవీ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి కోసం 1590 కోట్ల రూపాయల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపాము. గోదావరి నదీ తీరం వెంబడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సారపాక నుంచి కాళేశ్వరం దాకా, ప్రాణహిత నది తీరం వెంట కాళేశ్వరం నుంచి కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌతాల వరకు అటవీ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాము. వీటి మంజూరుకు కూడా కేంద్రం అంగీకరించిందని సభకు సంతోషంగా తెలియజేస్తున్నాను.

మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అతివేగంగా విస్తరిస్తున్నది. ఈ నగరం చుట్టూ ఇప్పుడున్న ఔటర్ రింగు రోడ్డు పెరుగుతున్న అవసరాల రీత్యా ఎంతమాత్రం సరిపోదు. మరింత విశాలమైన పరిధిలో మరో రింగు రోడ్డు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. దానికి సానుకూలంగా స్పందించిన కేంద్రం

నగరం చుట్టూ 338 కిలోమీటర్ల అతి పొడవైన రీజనల్ రింగు రోడ్డును జాతీయ రహదారుల ప్రమాణాలతో నిర్మించడానికి అంగీకరించింది. ఈ రోడ్డు వివరాలు ముందుగా పేర్కొన్న 19 రోడ్లలో ఇంతకు ముందే ప్రస్తావించాను.

రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను మన్నించి, విశాల దృక్పథంతో స్పందించి రాష్ట్రంలో నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి పూనుకున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి సభాముఖంగా, సవినయంగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. ఇందుకోసం కృషిచేసిన తెలంగాణ పార్లమెంట్ మెంబర్లకు, ఆర్ అండ్ బి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావుగారికి, అధికారులందరికీ హృదయపూర్వకంగా అభినందనలు తెలుపుతున్నాను.

శ్రీ జి. చిన్నా రెడ్డి:- అధ్యక్షా, తెలంగాణలో నూతన జాతీయ రహదారుల నిర్మాణం మరియు తెలంగాణ ప్రభుత్వం చేసిన కృషి గురించి ముఖ్యమంత్రి గారు చాలా వివరంగా వివరించడం జరిగింది. వారు చెప్పినట్లుగా గతంలో పరిపాలించిన ప్రభుత్వాలు తెలంగాణ ప్రాంతంలో కేవలం 2,527 కిలోమీటర్ల జాతీయ రహదారులను సాధించుకుంటే, కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే 2,776 కిలోమీటర్ల రోడ్డు మంజూరు చేయించుకోగలిగామని చెప్పారు. చాలా సంతోషం. మనం ఒక్కసారి వెనుకకు పోయి చూస్తే ఈ రాష్ట్రం 2 జూన్, 2014నాడు ఏర్పడింది. అదే రోజు టి.ఆర్.ఎస్. ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆరోజు నుండి అక్టోబర్, 2015 వరకు పాత రిపోర్టులు గాని, పత్రికా ప్రకటనలు గాని చూస్తే, "తెలంగాణకు నై ఆంధ్రకు సై"అనే వార్తలు కనిపించాయి. అంటే అంతవరకు రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. మనం నష్టపోతున్నాము, రిపోర్టులను తయారు చేసి తప్పకుండా కేంద్రానికి పంపాలి, సాధించుకోవాలి అనే ప్రయత్నం అక్టోబరు 2015 తరువాత మాత్రమే మొదలు పెట్టావమనే విషయం గౌరవ మంత్రివర్యులకు తెలియజేస్తున్నాను. ప్రకటనల మూలంగా రహదారులు మంజూరయ్యాయని చెబుతున్నారు. కాని ఈనాటికీ, డబ్బు విడుదల అవ్వడం గాని, పనులు మొదలవ్వడం గాని జరగలేదని తెలియచేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణం 5 సంవత్సరాల్లో పూర్తి అయ్యాయో వాటిని మెయింటెయిన్ చేయడానికి ప్రభుత్వం రూ.2వేల కోట్లు మంజూరు చేయడం జరిగింది. పనులు కూడా జరుగుతున్నాయి. మేము కళ్లారా చూస్తున్నాము. ఆనాడు మనకున్న 10 జిల్లాల హెడ్ క్వార్టర్స్ నుండి స్టేట్ హెడ్ క్వార్టర్స్ వరకు 4 రోడ్ల నిర్మాణం చేస్తామని చెప్పడం జరిగింది. ఈనాడు ఆ 10 జిల్లాలను పరిపాలనా సౌలభ్యం గురించి 31 జిల్లాలుగా విభజించడం జరిగింది. ఈ 31 జిల్లాలకు కూడా గతంలో ప్రకటించిన జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర రాజధానికి 4 రోడ్ల నిర్మాణం వర్తిస్తుందా అనే విషయం గౌరవ మంత్రి గారు చెప్పాల్సిందిగా కోరుతున్నాను. మండల హెడ్ క్వార్టర్ నుండి నియోజక వర్గ హెడ్ క్వార్టర్‌కు గాని లేదా మండల హెడ్ క్వార్టర్ నుండి జిల్లా హెడ్ క్వార్టర్ వరకు డబుల్ రోడ్లను మంజూరు చేస్తున్నామని చెప్పడం జరిగింది. ఆ పనుల విషయంలో నిర్మాణం జరుగుతున్నాయా, మంజూరు ఇవ్వడం జరిగిందా, అందుకు ఎంత డబ్బు మనం ఇచ్చాము, పనులు ఏ పరిస్థితిలో ఉన్నాయో చెప్పాల్సిన అవసరం ఉంది. జాతీయ రహదారులకు సంబంధించి 2776 కిలోమీటర్ల రహదారులను సాధించుకున్నామని ముఖ్యమంత్రిగారు చెప్పారు. దురదృష్టకరమైన విషయం ఏమంటే మహబూబ్‌నగర్ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం జరిగిందని మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను. కేవలం కల్వకుర్తి, జడ్చర్ల రోడ్డు మాత్రమే ఉంది. కొడంగల్‌ను తీసుకెళ్లి వికారాబాద్ జిల్లాలో కలపడం జరిగింది.

**12.20 మ.** అధ్యక్షా, ఈ జిల్లాకు సరైన ప్రాధాన్యత కాని, ప్రాముఖ్యత కాని ఇవ్వలేదనే మాటను మనవి చేస్తున్నాను. కొన్ని ముఖ్యమైన రోడ్ల విషయాలను తెలియజేస్తాను, వాటిని కాస్త తొందరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. రోడ్ల విషయంలో జాగ్రత్తపడిఅక్టోబర్,2015 తరువాత ప్రతిపాదనలు పంపి, వాటికి ఆమోదం పొందే ప్రయత్నం చేస్తున్నారో, వాటితోపాటు ఈ రోడ్లను మంజూరు చేయించు కోవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. రాయచూర్ నుంచి కల్వకుర్తి వరకు నేషనల్ హైవే ప్రతిపాదన ఉందని చాలా రోజులుగా వింటున్నాము. రాయచూర్ నుంచి గద్వాల్, గద్వాల్ నుంచి ఆత్మకూర్, ఆత్మకూర్ నుంచి వనపర్తి, వనపర్తి నుంచి నాగర్‌కర్నూల్, నాగర్ కర్నూల్ నుంచి కల్వకుర్తి వరకు, అదే విధంగా కల్వకుర్తి నుంచి శ్రీశైలంకు వెళ్లేందుకు జాతీయ రహదారి ఉందనే మాట మనవి చేస్తున్నాను. మన పక్క రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతానికి చాలా దగ్గరగా సోమశిల బ్రిడ్జ్ నిర్మాణం జరిగితే, ఈ రహదారి హైదరాబాద్‌కి దగ్గరవుతుందనే మాట వింటున్నాము. సోమశిల బ్రిడ్జితోపాటు హైదరాబాద్ నుంచి కల్వకుర్తి, కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ అదే విధంగా పక్కన ఉన్న కొల్లాపూర్ రోడ్డును జాతీయ రహదారిగా చేస్తే పక్కన ఉన్న రాయలసీమ ప్రాంతంలోని నందికొట్కూరుకు వెళ్లేందుకు దగ్గరవుతుందన్న విషయాన్ని సవినయంగా మనవి చేస్తున్నాను. రాయచూర్, గద్వాల్, వనపర్తి,

నాగర్‌కర్నూల్, కల్వకుర్తి రహదారులను ఏవైతే అనుకుంటున్నామో, అదే విధంగా వనపర్తి నుంచి జడ్చర్ల మధ్య ఉన్న రోడ్డును కూడా లింక్ చేయగలిగితే బాగుంటుంది. వనపర్తి నుంచి జడ్చర్ల రోడ్డు వయా బిజినపల్లి నుంచి నాగర్‌కర్నూల్ తరువాత ఉన్న రహదారి సోమశిల నుంచి హైదరాబాద్ వరకు ఉన్న రహదారులకు లింక్ అవుతాయి. కనుక చాలా జిల్లాలకు మేలు జరుగుతుందన్న మాటను సవినయంగా మనవి చేసుకుంటున్నాను. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడు అలంపూర్ నుంచి నందికొట్కూరు కూడా మరో బ్రిడ్జ్ నిర్మాణం తుంగభద్ర నదిపై నిర్మించుటకు ప్రతిపాదన ఉండినది. కాని నేటి వరకు కూడా అది ఆచరణ యోగ్యం కాలేదు. కనుక దీనిని నిర్మిస్తే రవాణా సౌకర్యం పెరిగే అవకాశం ఉంటుంది. గతంలో కొన్నింటికి శంకుస్థాపనలు కూడా జరిగాయి. అటువంటి వాటికి మీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి, వాటిని మొదలు పెట్టవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. అదే విధంగా జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలను కూడా గమనించాలని తెలియజేస్తున్నాను. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి విజయవాడ రహదారులు కాని, హైదరాబాద్ నుంచి బెంగుళూర్ రహదారులు కాని, రాజీవ్ రహదారి కాదది మృత్యు రహదారని నిన్న కొంతమంది గౌరవసభ్యులు అన్నారు. ఈ రహదారులపై ప్రమాదాలు జరిగి అనేక మంది అమాయకులు తమ ప్రాణాలను కోల్పోతున్నారన్న విషయాన్ని మనవి చేస్తున్నాను. కనుక అమాయకుల ప్రాణాలు బలిగాకుండా ప్రభుత్వం తగిన నివారణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని తమ ద్వారా గౌరవ మంత్రివర్యులకు తెలియజేస్తున్నాను. హైదరాబాద్ చుట్టూ ఇన్నర్, ఔటర్ రింగు రోడ్డులు వచ్చాయి. ఇవే కాకుండా మరో 300 కి.మీ.ల గురించి ప్రతిపాదన ఉందన్నారు. ఈ ఔటర్ రింగ్ రోడ్డు ఏ స్థితిలో ఉంది? ఈ రహదారికి ఎన్ని వేల కోట్లు నిధులు అవసరం అవుతాయనే అంచనాలను చెప్పాలని మనవి చేస్తున్నాను. జిల్లా హెడ్‌క్వార్టర్లుగా 31 ప్రాంతాలను గుర్తించడం జరిగింది. వీటికి రింగ్‌రోడ్డులను ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్నది ఏ దశలో ఉన్నాయి, మరియు వీటి గురించి కార్యాచరణ ఏమిటో తెలపాలని మీ ద్వారా మనవి చేస్తున్నాను. జిల్లా కేంద్రాలైన పాత పట్టణాల్లో చాలా ఇరుకైన రహదారులున్నాయి. కనుక వీటి విషయంలో రహదారుల విస్తరణ కార్యక్రమం కూడా చేపట్టాలని మనవి చేస్తున్నాను. ముఖ్యంగా వనపర్తి పట్టణంలో రహదారుల విస్తరణ విషయమై చాలా కాలంగా ఎదురుచూస్తున్నాము. కనుక ఈ విషయమై ప్రభుత్వం వద్ద ఎటువంటి కార్యాచరణ ఉందో చెప్పాల్సిన అవసరం ఉంది. రోడ్డు విస్తరణ కార్యక్రమాలపై ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలను, కేటాయించుకున్న బడ్జెట్ గురించిన విషయాలను తెలియజేయవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారు ఇక్కడికి వచ్చినప్పుడు, హైదరాబాద్, బెంగుళూర్ మధ్యలో గల 550 కి.మీల జాతీయ రహదారిని ఎక్స్‌ప్రెస్ హైవేగా మారుస్తామన్న మాట జనవరి, 2016లో చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని తెలిపి 12 మాసాలు కావస్తోంది, కనుక దీనిపై తీసుకున్న చర్యలు ఏమిటో తెలియజేయాలని కోరుతున్నాను. మీరు కార్యక్రమాలు చేయడం లేదని చెప్పడం లేదు. కాని మేము సూచించిన కొన్ని ప్రాంతాలు మిగిలిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా పూర్తిగా అశ్రద్ధకు గురైందని, అక్కడ జాతీయ రహదారులను తీసుకునే అవకాశం ఉంటే వాటిని తీసుకోవాలని తెలియజేస్తున్నాను. ఆర్‌అండ్‌బి, పంచాయితీ రాజ్ డిపార్ట్‌మెంట్ వారి ఆధీనంలో ఉన్న రోడ్లను తీసుకుంటారన్న మాటని ప్రభుత్వం చెబుతున్నది. పంచాయితీ రాజ్ ఆధ్వర్యంలో ఉన్న రోడ్లు, పొడువుగా ఉన్న రోడ్లను ఎక్కువ మండలాలతో కనెక్ట్ చేసేటుటువంటి విధంగా, ఆ రోడ్లను ఆర్‌అండ్‌బి శాఖ వారి నుంచి తీసుకుని ఆ రోడ్ల నిర్మాణాలను పునరుద్ధరణకు పూనుకుంటే బాగుంటుందనే విషయాన్ని తెలియజేస్తున్నాను.

శ్రీ జి.కిషన్ రెడ్డి:- అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తదుపరి కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ రహదారులకు సంబంధించి అత్యంత సానుకూల సహాయం అందుతుందన్న విషయాన్ని మనవి చేస్తున్నాను. అనేక జిల్లాల్లో జరిగిన ఉద్యమాల్లో కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారు తెలంగాణ పోరుయాత్రను ఆయన ప్రారంభోత్సవం చేసి దీనిలో ఆయన ఒక రోజు పాల్గొన్నారు. అదే విధంగా తెలంగాణ ప్రాంతంపై నితిన్ గడ్కరీ గారికి అపారమైన సానుభూతి ఉంది. తెలంగాణలో తిరిగినప్పుడు రోడ్ల పరిస్థితిని చూశారు, కనుక మన రాష్ట్రం నుంచి ఎన్ని ప్రతి పాదనలు వచ్చినా సానుకూలంగా, సానుభూతితో తెలంగాణ ప్రాంత అభివృద్ధి జరగాలన్న ఆకాంక్షతో ఆయన రహదారులను శాంక్షన్ చేస్తున్నారు. "అమెరికా ధనవంతుల దేశం కాబట్టే అక్కడ రోడ్లు అద్భుతంగా ఉన్నాయి, కాని అమెరికా రోడ్లు అద్భుతంగా ఉన్నాయి, కనుకనే అభివృద్ధి చెందిందని" అంటారు. కనుక రోడ్లను అభివృద్ధి పరచవలసిన అవసరం ఉంది. కాంగ్రెస్ వారి పాలనలో హైవేస్ నుంచి

వనపర్తి ప్రాంతానికి గతంలో రోడ్డు కూడా లేదు. వనపర్తి జిల్లా హెడ్ క్వార్టరైంది, కాని ఆ రోడ్డుపై ప్రయాణిస్తుంటే బాధగా అనిపించింది. కాంగ్రెస్ హయాంలో మన రాష్ట్రం తెలంగాణకు చాలా అన్యాయం జరిగింది. వీళ్లు గతంలో చేపట్టిన రాజీవ్ రహదారిలో ఎన్ని అవినీతి కుంభకోణాలో, ఎన్ని సభా సంఘాలో, ఎన్నిసార్లు ఈ శాసన సభలో ఆ విషయమై చర్చ జరిగిన విషయం అందరికీ తెలుసు.

**12.30 ప.** వాజ్‌పేయి గారు ఆ రోజు ఎంతో సాహసంతో నేషనల్ హైవేస్ కోసం నిర్ణయం తీసుకొని మన దేశంలో మొట్ట మొదటి సారిగా పెద్దఎత్తున ఫోర్‌వేస్ నిర్మాణం చేయించారు. ఆయన వల్లనే ఈ రోజు ఎన్నో నేషనల్ హైవేస్ వచ్చాయి. ఆ సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ, హైదరాబాద్ నుంచి షిరిడి రోడ్డు ఈ రెండు రోడ్లు పెండింగ్‌లో ఉండేవి. ఆ రోడ్లన్నీ ఈ మధ్య కాలంలో పూర్తయ్యాయి. తెలంగాణ ప్రజలు హైదరాబాద్ నుండి షిరిడికి వెళుతున్నప్పుడు అనేక మంది ప్రమాదంలో మరణిస్తుంటారు. కాంగ్రెస్ హయంలో ఆ రోడ్డును ఏమి అభివృద్ధి చేయలేదు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రప్రభుత్వ చొరవతో ఈ రోజు మళ్లీ తెలంగాణలో అనేకమైన కొత్తరోడ్లు వస్తున్నాయి. రోడ్ల విషయంలో గతంలో చాలా నిర్లక్ష్యం జరిగింది. నితిన్‌గడ్కారి గారు ఒక మాట చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 40 శాతం రోడ్లు ఉండాలన్నారు. కానీ,మనకు 2శాతం రోడ్లు మాత్రమే ఉన్నాయి. రెండు శాతం రోడ్లమీదనే నలభై శాతం ట్రాఫిక్ కొనసాగుతుంది. ఇది చాలా ప్రమాదకరం. ప్రతి ఏటా 15 లక్షల మంది చనిపోతున్నారు. దీన్ని నివారించేందుకు ఈ రోజు చాలా చర్యలు తీసుకున్నారు. ప్రమాదాలు జరగకుండా చూడడం కోసం ఎంత డబ్బు అయినా ఖర్చుపెట్టి ప్రమాదాలను నియంత్రిస్తామని ఇటీవలే నితిన్‌గడ్కారి గారు నా ముందే తుమ్మల నాగేశ్వరరావుగారికి చెప్పారు. మహబూబ్‌నగర్ రోడ్డులో ఒక సారి ప్రమాదం జరిగినప్పుడు మగవాళ్లంతా చనిపోయారు. ఆడవాళ్లు మాత్రం మిగిలారు. అటువంటి రోడ్లలన్నింటిని యుద్ధప్రాతిపదికన రాష్ట్రప్రభుత్వం కేంద్రప్రభుత్వం నుంచి నిధులు తెచ్చుకొని ఆ రోడ్లన్నీ బాగు చేయవలసినదిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

హైదరాబాద్ నుంచి బెంగళూరు, హైదరాబాద్ నుంచి విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవేస్ చేయబోతున్నారు. దానిని ఒక కన్సల్‌టెన్సీకి ఇచ్చారు. అది చాలా పెద్ద ప్రాజెక్టు. తెలంగాణలోనే సుమారు 210 కి.మీలు వస్తుంది. సుమారు రూ. 8400 కోట్లు అవుతుందని కేంద్రమంత్రిగారు నాకు చెప్పడం జరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు రోడ్డు వేయడానికి 190 కి.మీకు, రూ. 7600 కోట్లు అవసరం అవుతుందని ఎస్టిమేషన్ వేశారు. డిపిఆర్ తయారు చేశారు. ఆ రకంగా ఎక్స్‌ప్రెస్ రోడ్లు వచ్చినట్లయితే చాలా తక్కువ సమయంలో మనం బెంగళూరు, విజయవాడకు వెళ్లడానికి అవకాశం ఉంటుంది. డ్రైపోర్ట్‌లు కూడా ఏర్పాటు చేస్తానని మంత్రిగారు చెప్పారు. ఇన్‌లాండ్‌వాటర్‌సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రిగారు చాలా పట్టుదలతో ఉన్నారు. ఎప్పుడు నేను వారిని కలిసినా వారు నాతో మీ గోదావరి నదికి ఇన్‌లాండ్ వాటర్ సిస్టమ్ రావాలని పదేపదే చెపుతారు. మీరు పట్టుదలతో పని చేయండి. పోలవరం ప్రాజెక్టు విషయం గురించి ముఖ్యమంత్రితో మాట్లాడుతాను. ఇన్‌లాండ్‌వాటర్ సిస్టమ్ రావాలి. మీకు సముద్రం లేదని బాధపడకూడదు. కాబట్టి గోదావరి నదిని ఉపయోగించుకొని ఇన్‌లాండ్ వాటర్ సిస్టమ్‌ను తీసుకురావడం కోసం ఎంత డబ్బైనా నేను ఇస్తానని మంత్రిగారు పదేపదే చెప్పారు.

హైదరాబాద్ నుంచి వరంగల్‌కి వెళ్లే రోడ్డు కోసం కేంద్ర కాబినేట్ మీటింగ్‌లో ఏ మాత్రం వెనుకంజ లేకుండా కేంద్రప్రభుత్వమే ప్రధానమంత్రి నరేంద్రమోడీ గారి నేతృత్వంలో సమారు 1900 కోట్లతో టెండర్లు వేస్తే, ఎల్ అండ్ టి కంపెనీ సమారు రూ. 1424 కోట్లతో కాంట్రాక్టు తీసుకుంది. కేంద్రమంత్రిగారే స్వయంగా శంకుస్థాపన చేశారు. ఈ రకంగా తెలంగాణ ప్రాంతంలో సమగ్రమైనటువంటి అభివృద్ధి జరగవలసిన అవసరం ఉంది. ఎందుకు ఈ విషయాన్ని చెబుతున్నానంటే మనకు ఆంధ్ర రాష్ట్రంలో లాగ మనకు ట్రైన్ కనెక్టివిటీ లేదు. తెలంగాణ ప్రజలకు ట్రైన్‌లల్లో వెళ్లడం అలవాటు కూడా లేదు. తెలంగాణ ప్రజలందరూ కూడా ఎక్కువగా రోడ్డు ప్రయాణమే చేస్తారు. ఎందుకంటే రోడ్లు వేయకుండా గత ప్రభుత్వాలు ఇక్కడకు ట్రైన్స్ రాకుండా చాలా నిర్లక్ష్యం చేశాయి. కాబట్టి రోడ్ల అభివృద్ధి జరగాలి. అందుకోసం సమగ్రంగా ముఖ్యమంత్రిగారు ఏవైతే నేషనల్ హైవేస్ గురించి చెప్పారో ఆ నేషనల్ హైవేస్‌లన్నీ పూర్తి చేయడం కోసం మనమందరం రాజకీయాలకు అతీతంగా ప్రయత్నం చేసినట్లయితే అన్ని రంగాలల్లో మన తెలంగాణ అభివృద్ధి చెందుతుంది. రోడ్లు ఒక్కటే కాదు రోడ్లు అభివృద్ధి జరిగితే రోడ్ల ప్రక్కన ఫ్యాక్టరీలు వస్తాయి. హైదరాబాద్‌కు కేంద్ర మంత్రి గారు వచ్చినప్పుడు ఒకమాట చెప్పారు. నేషనల్ హైవేస్ ప్రక్కన వ్యాపారాలు పెట్టడానికి సమారూ 1300

వ్యాపారాలను గుర్తించారు. ఈ నేషనల్ హైవేస్ నిర్మాణం జరిగితే కొన్ని లక్షల మందికి ఉపాధి కూడా దొరుకుతుంది. తెలంగాణ ప్రభుత్వం ఒక ఎజెండాగా వాటర్, రోడ్లును పెట్టుకున్నట్లయితే తప్పకుండా తెలంగాణ రాష్ట్రం దేశంలో ఒక అగ్రగామి రాష్ట్రంగా ఏర్పడుతుంది. రాష్ట్రప్రభుత్వం పూర్తి స్థాయిలో కేంద్రప్రభుత్వం ఇస్తున్న నిధులను సద్వినియోగం చేసుకొని వేగవంతంగా ముందుకు వెళ్లవలసిన అవసరం ఉందని మీ ద్వారా కోరుతున్నాను.

వరంగల్‌కి వెళ్లే హైవేలో ఒక ఫ్లైవోవర్ కోసం సుమారు రూ. 320 కోట్లతో మంజూరయింది. ఈ విషయం మన మంత్రి గారికి కూడా తెలుసు. కానీ, లాండ్ అక్విజేషన్ కొరకు జి.హెచ్.ఎం.సి. దగ్గర నిధులు లేవంటే మంత్రిగారు, కేంద్రమంత్రిగారిని మీరే లాండ్ అక్విజేషన్ ఇవ్వమని అడిగారు. దానికి వారు ఒప్పుకున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆ ఫ్లైఓవర్ కొరకు నిధులు శాంక్షన్ కాబోతున్నాయి. అలాగే ఈరోజు ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం కేంద్రప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నది. కేంద్రప్రభుత్వం 24 నవంబర్‌కు ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రిన్స్‌పుల్ అంగీకరించింది. ఈ రీజనల్ రింగ్ రోడ్డును మేము అంగీకరిస్తున్నాము. డి.పి.ఆర్.ను పంపండని మన ప్రభుత్వానికి మంత్రిగారు లెటర్ రాశారు. నాకు కూడా ఆ లెటర్ పంపించారు. కాబట్టి మనం రోడ్ల అభివృద్ధి కోసం కృషి చేయాలి.

వాటర్ ట్రాన్స్‌పోర్ట్ ఏదైతే వస్తుందో అది చాలా ఖర్చుతో కూడుకొని ఉంటుంది. డ్రైపోర్ట్‌లు కానీ, ఇన్‌లాండ్ వాటర్ సిస్టమ్‌లను మనం అభివృద్ధి చేసుకోవలసిన అవసరం ఉన్నది. ఆర్ అండ్ వి రోడ్లకు, పంచాయతీ రోడ్లకు రాష్ట్రప్రభుత్వం కొంత డబ్బులను కేటాయింపు జరపాలి. మీ నియోజకవర్గంలో కూడా నేను తిరిగివచ్చాను. అక్కడక్కడ రోడ్లు బాగాలేవు. పంచాయతి రోడ్లు కొన్ని ఉన్నాయి. ఆర్ అండ్ బీ రోడ్లు కొంత ఉన్నాయి. ఆ రోడ్లుకు పెద్దఎత్తున నిధులు ఖర్చు పెట్టినట్లయితే మనం అనేక రకాలుగా మనం రోడ్ల మీద ఖర్చు పెడితే పెట్రోలియం ప్రాడక్ట్ మనం సేవ్ చేసిన వాళ్లమవుతాము. టైమ్ సేవ్ చేసిన వాళ్లమవుతాము. ప్రమాదాలను రక్షించిన వాళ్లమవుతాము. కాలుష్యాన్ని తగ్గించిన వాళ్లమవుతాము. ప్రభుత్వం ప్రధానమంత్రి సడక్ యోజనను మళ్లీ పునరుద్ధరించింది. ఆ రోడ్ల ద్వారా మనం గ్రామాలకు కనెక్టివిటీ పెంచుకోవలసిందిగా మీ అందరిని కోరుతూ, నేను మరొక్కసారి శాసనసభ తరఫున నితిన్‌గడ్కరి గారికి, నరేంద్ర మోడీ గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**12.40 ప.**

جناب جعفر حسین (Janab Jaffar Hussain): محترم اسپیکر صاحب! آج مجھے National Highways and R&B پر بات کرنے کا جو موقع دیا گیا ہے، میں آپ کا شکریہ ادا کرتا ہوں۔ پہلی چیز تو میں آپ کو بتاتا ہوں کہ GHMC میں جو R&B roads ہیں، ان روڈس کا اگر آپ condition دیکھیں گے تو ابھی جو recently monsoon آیا تھا، بارش ہونے کی وجہ سے کافی روڈس تباہ و برباد ہو گئے۔ تو پہلے اس کا maintenance کرنا بے انتہا ضروری ہے۔ آپ نے جو نئے روڈس بتایا ہے، ہم نئے روڈس کا welcome کرتے ہیں۔ سی ایم صاحب نے کہا کہ 2,776 new roads کے لئے ہم نے sanction لایا ہے۔ ہم اس کا welcome کرتے ہیں۔ مگر میرا سوال آپ کے ذریعہ سے منسٹر صاحب سے یہ ہے کہ آپ تو نئے روڈس بنائیں گے، بڑی خوشی کی بات ہے، میں یہ کہنا چاہتا ہوں کہ جو پرانے روڈس ہیں، جو damaged ہیں، ان کے لئے آپ کے پاس کیا تجویز ہے؟ آپ وہ کب بنائیں گے؟ آپ اس کو کب درست کریں گے؟ خاص طور سے شہر کے اندر روڈس damaged ہونے کی وجہ سے کافی لوگ پریشان ہیں، accidents ہو رہے ہیں، طبیعتیں خراب ہو رہی ہیں، خاص طور سے جب ہم گاڑی میں جاتے ہیں، کسی کو back pain رہتا ہے، کسی کو neck pain رہتا ہے، ویسے لوگوں کی بھی حالت خراب ہوتی ہے۔ تو آپ کو نئے روڈس بنانا بے حد ضروری ہے مگر ساتھ ہی ساتھ پرانے روڈس جو repair میں ہیں، ان کو take up کرنا بے حد ضروری ہے۔ جیسا کہ آپ جانتے ہیں کہ سی ایم صاحب نے بتایا کہ 8,000 crore rupees لے کر آئے ہیں جن میں چار روڈس کو identify کیا گیا ہے۔ ہم welcome کرتے ہیں، آپ اس کا کام بھی تیزی سے مکمل کیجئے جس کو sanction مل گیا ہے۔ تو میں آپ کے ذریعہ یہ کہنا چاہتا ہوں کہ تلنگانہ کے اندر 2,690 national highways ہیں، 3,152 state highways ہیں، major district roads 12,079 ہیں، other district roads 9,0134 ہیں تو اس حساب سے 26,935 ہمارے پاس روڈس موجود ہیں۔ ان کے اندر آپ کے 1,632 four lane roads ہیں، ڈبل لائن روڈس 7,357 ہیں، intermediate roads 772 ہیں، 17,076 single lane ہیں، جملہ 26,935 ہوتے ہیں جن میں آپ کے پاس cement concrete roads 254 km. ہے، 25,994 black top ہیں، 285 metal ہیں، اور 304 unmetalled ہیں۔ تو میں آپ کے ذریعہ حکومت سے یہ پوچھنا چاہتا ہوں کہ یہ جو روڈس ہیں، آپ ان کو کب مکمل کریں گے؟ جیسا 1,706 single lane ہیں، ان کو maintain کرنا ضروری ہے، نہ صرف maintain کرنا ہے، بلکہ اس کے ساتھ ساتھ ان روڈس کو بھی ڈبل روڈس کر کے ان کو بھی develop کرنا بے انتہا ضروری ہے۔ چونکہ آج آپ جانتے ہیں اور دیکھتے ہیں کہ پرسوں بھی ٹرانسپورٹ منسٹر صاحب نے کہا کہ 1200 RTC buses گاؤں میں نہیں چل رہے ہیں۔ یہ 1200 buses کیوں نہیں چل رہے ہیں صاحب، کیا آپ کو معلوم ہے؟ وہاں پر روڈس کی facility نہ ہونے سے RTC والوں نے کہا کہ ہم بسیں نہیں چلا سکتے کیونکہ یہاں پر facilities برابر نہیں ہیں۔ اس کے لئے RTC والے بسیں نہیں چلا رہے ہیں۔ یہ جو 1200 روڈس ہیں، آپ ان کو develop کیجئے اور یہاں پر RTC buses کو چلایئے۔ جہاں پر RTC buses جو حکومت کی جانب سے چلائی جاتی ہیں، وہ بسیں اگر نہیں چلائی جا سکتی ہیں، تو خانگی

vehicles کیسے چلیں گی؟ وہ لوگ maintenance کیسا کریں گے؟ یہ بھی آپ کو سوچنے کی ضرورت ہے۔ تو اسی لئے میں آپ کے ذریعہ یہ کہنا چاہتا ہوں کہ آپ نے 31 اضلاع بنادئے۔ State headquarters سے سی ایم صاحب نے کہا تھا کہ four lane road بنائیں گے connecting کے لئے، آپ وہ کب بنائیں گے، یہ بھی بتائیے۔ ایک اہم شہر سے روڈ جاتی ہے جس کو old Kurnool road کہا جاتا ہے جو سنتوش نگر سے ہوتے ہوئے Bangalore Highway پر connect ہوتی ہے۔ وہ old Kurnool road کئی برس سے آج تک بھی repair میں ہے، ایک bridge بن رہا ہے، اس bridge کی وجہ سے more than one and a half years سے وہاں پر ایک bypass دے دئے۔ شہر کے اندر اگر آپ مسلسل bypass کے ذریعہ جائیں گے تو ٹرافک میں کتنی مشکل ہوتی ہے، آپ کو اس کو بھی دیکھنے کی ضرورت ہے۔ اور ایک اہم بات یہ ہے کہ Bombay Highway ایک زمانہ سے بن رہا ہے۔ سنگاریڈی سے تلنگانہ اسٹیٹ کے بارڈر تک اگر آپ دیکھتے ہیں، میں recently وہاں پر سفر کیا تھا، مجھے سنگاریڈی سے عمرگاہ تک more than five hours لگے صاحب۔ کیونکہ وہ روڈ proper repair نہیں ہورہی ہے۔ اس روڈ کو repair کرنا ضروری ہے صاحب۔ اور آج national highway پر کیا ہو گیا صاحب کہ ٹول ٹیکس والے ٹیکس تو فوراً ہی لے لیتے ہیں، مگر یہ جو روڈس repair میں رہتے، ان کو پہلے take up کرنا چاہئے۔ مانسون میں کافی روڈس damage ہو گئے۔ ان روڈس کو take up کرنا ضروری ہے۔ اور Bombay Highway کو آپ first priority میں لیجئے۔ اور ایک چیز جو ہمارا outer ring road ہے، وہاں کچھ pending work ہے۔ Outer ring road کو بھی فوری مکمل کرنا چاہئے۔ اور outer ring road کی جو connectivity ہے، اس کو ابھی تک مکمل نہیں کیا گیا ہے۔ وہ connectivity آر اینڈ بی میں آتی ہے۔ R&B میں آنے کی وجہ سے اس connectivity کو مکمل کرنا چاہئے۔ وہاں پر بہت زیادہ accidents ہو رہے ہیں۔ یہ point اگر منسٹر صاحب کو بھی معلوم ہوگا تو وہ بھی اس کو clearly سمجھ سکیں گے۔ Connectivity نہ رہنے کی وجہ سے زیادہ حادثے ہو رہے ہیں، اس کے بارے میں بھی سوچنا چاہئے۔ National Highways پر آپ ambulances رکھتے ہیں، مگر ambulances اتنے زیادہ نہیں ہیں۔ خدانخواستہ اگر کسی کو accident ہوتا ہے تو وہ روڈ پر تڑپتے رہتا ہے، ambulance بہت دیر سے آتی ہے۔ وہاں پر ambulances بے انتہا ضروری ہیں۔ اور highway patrolling صاحب، اس کا اہم کام یہ ہوتا ہے کہ جو drunk and drive کرتے ہیں، ویسوں کو cover کرنا چاہئے۔ اگر کوئی معصوم اپنی گاڑی صحیح طریقہ سے چلا رہا ہے، اگر کوئی پی کر اس کے آگے پر آجاتا ہے اور ٹکر مارتا ہے تو ایسے معصوم خاندان مر رہے ہیں۔ ان کو بھی دیکھنا آپ کے لئے ضروری ہے۔ میں آپ سے یہی کہنا چاہتا ہوں کہ ایسے بہت سے مسئلے ہیں، چونکہ یہ مسئلہ بہت اہم تھا، وقت کم ہونے کی وجہ سے میں بھی زیادہ نہیں بول رہا ہوں، مگر آپ کے ذریعہ حکومت سے کہنا چاہتا ہوں کہ آپ کو کوئی وقت fix کرکے اس کو جلد سے جلد مکمل کرنا چاہئے۔ ہماری پارٹی کی طرف سے ہمارا مطالبہ یہی ہے کہ آپ شہر کی سڑکوں کو سب سے پہلے priority میں لیجئے۔ مجھے جو موقع دیا گیا، میں اس کے لئے آپ کا شکریہ ادا کرتا ہوں صاحب۔

శ్రీ సండ్ర వెంకట వీరయ్య(సత్తుపల్లి):- జాతీయ రహదారులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం అంగీకరించి పెద్ద ఎత్తున మన తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చినందుకు కేంద్ర మంత్రి గడ్కరీ గారికి అభినందనలు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం కూడా టైమ్‌కు వాటి ప్రతిపాదనలు పంపి జాతీయ రహదారుల్లో మన రాష్ట్ర వాటా సాధించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నాను. గ్రామాల నుంచి మండలాలకు, మండలాల నుంచి జిల్లాకు డబల్ రోడ్ వేయడం, అలాగే జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి ఫోర్ లైన్ రోడ్ వేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రయత్నం చేయడం జరుగుతోంది. ఈ మధ్య కాలంలో కొత్త జిల్లాలు, కొత్త మండలాలు ఏర్పాటు అయ్యాయి. గ్రామాల నుంచి మండలాలకు, జిల్లాల నుంచి రాష్ట్ర రాజధానికి రవాణా సౌకర్యాలు వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

మహబూబ్‌నగర్ జిల్లాలోని కొడంగల్, అలాగే కొత్తగా ఏర్పడిన కొన్ని జిల్లాలకు, కొత్తగా ఏర్పడిన పాత మండలాలకు కూడా ఇంకా గ్రామాల నుంచి రహదారులు అనుసంధానం కాలేదు. వాటి మీద కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలి. తెలుగు దేశం పార్టీలో ఎంతో అనుభవం గడించి, అలాగే ఈ ప్రభుత్వంలో కూడా రోడ్లు భవనాల శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వర రావు గారు పని చేస్తున్నారు. వారికి రోడ్ల పట్ల మంచి అవగాహన ఉంది. రోడ్ల నిర్మాణం మరియు నాణ్యతా ప్రమాణాల మీద కూడా దృష్టి పెట్టాలని వారికి తెలియజేస్తున్నాను.

రోడ్లు వెడల్పు చేసిన దగ్గర బ్రిడ్జిలు వెడల్పు కాకపోవడం వల్ల ప్రమాదాలు తీవ్రంగా జరుగుతున్నాయి. మొన్న ఖమ్మం-సూర్యాపేట హైవేలో పాలేరు రిజర్వాయర్ దగ్గర రోడ్డు వెడల్పు చేశారు కానీ బ్రిడ్జి దగ్గర నారో ఉండడం వల్ల డ్రైవర్ కొత్తవాడు కావడంతో గందరగోళంలో డ్రైవింగ్ చేయడంతో పది మంది చనిపోవడం జరిగింది. రోడ్ల వెడల్పు తోపాటు బ్రిడ్జిలను కూడా వెడల్పు చేసే విధంగా దృష్టి పెట్టకపోతే ఆ రోడ్డు మీద కొత్తగా ప్రయాణించే వారికి అవగాహన లేక ఆక్సిడెంట్స్ అయ్యే ప్రమాదం ఉంది. నేషనల్ హైవేల్లో గాని, రాష్ట్ర రహదారుల్లో గాని ఆక్సిడెంట్ల స్పాట్స్ కొన్ని ఉన్నాయి. ఆక్సిడెంట్ స్పాట్స్‌ను కూడా గుర్తించాల్సిన అవసరం ఉంది. ఇరిగేషన్ కెనాల్స్ మీద బ్రిడ్జీల నిర్మాణం మీద కూడా ప్రత్యేకమైన దృష్టి పెట్టాలి. ఎన్.ఎస్.పి. కెనాల్ మీద గాని, హైవే కు సంబంధించిన కెనాల్స్ మీద గాని బ్రిడ్జీలు నారోగా ఉండడం వల్ల ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి. అక్కడ బ్రిడ్జీల వెడల్పు కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి.

హైవేల మీద ఎక్కువగా స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి హైవేకు వెళ్లే దారిలో స్పీడ్ బ్రేకులు వేస్తే బాగుంటుంది కాని హైవేల మీద స్పీడ్ బ్రేకులు వేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి హైవేల మీద వెళ్లేవారికి రోడ్డు అవగాహన లేక స్పీడ్‌గా వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి నేషనల్ హైవే లేదా రాష్ట్ర రహదారులకు వెళ్లే దగ్గర స్పీడ్‌ను నియంత్రించే విధంగా టెక్నాలజీని ఆలోచించాలని మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను. రోడ్డు రవాణా తోపాటు జల రవాణా మీద కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రోడ్డు రవాణా ద్వారా రూపాయి ఖర్చవుతుంటే జల రవాణా ద్వారా రవాణా కోసం ముప్పై పైసలు మాత్రమే ఖర్చౌతోంది. పంచాయితీ రాజ్ డిపార్ట్‌మెంట్ ద్వారా చాలా రోడ్లను ఆర్ అండ్ బి తీసుకోవడం జరిగింది.

**12.50 మ.** పీఆర్, ఆర్ అండ్ బీ రోడ్లను ఆర్ అండ్ బీ శాఖ ద్వారా బీటీ రోడ్లుగా మార్చే ప్రయత్నం చెయ్యాలని కోరుతున్నాను. సూర్యాపేట, కోదాడ నుండి ఖమ్మం రోడ్లకు సంబంధించి రోడ్ల విస్తరణ జరగక ప్రమాదాలు జరుగుతున్నాయి. నేషనల్ హైవే రోడ్స్‌లో, ఆ రోడ్‌ను ఇంక్లూడ్ చేసినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఖమ్మం- మచిలీపట్నంకి అదే విధంగా ఖమ్మం- కాకినాడకి సరిహద్దులున్నాయి. ఖమ్మం జిల్లాలో డ్రైపోర్ట్ ఏర్పాటు చేయడానికి మంత్రి గారు పరిశీలించాలి. డ్రైపోర్ట్‌ను ఖమ్మం జిల్లాకు ఇచ్చినట్లయితే, సత్తుపల్లిలో ఏర్పాటు చెయ్యాలని మీ ద్వారా మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సున్నం రాజయ్య :- అధ్యక్షా, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల అంశం చాలా ముఖ్యమైన అంశం. ఆర్ అండ్ బీ మంత్రి గారికి అపార అనుభవం ఉంది. నాగార్జున సాగర్ నుండి హైదరాబాద్ వరకూ నాలుగు లైన్ల రోడ్డు వేయవలసిన అవసరం ఉంది. అక్కడ టూరిజం స్పాట్ ఉంది. ఆంధ్రా, తెలంగాణకు సంబంధించి ప్రత్యేకమైన రోడ్డు అది. మిగతా జిల్లాల నుండి హైదరాబాద్‌కు ఈ రహదారులకు సంబంధించి నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయవలసిన అవసరం ఉంది. దీనికి ప్రధాన ప్రమాణాలు పాటించాలి. కొత్తగూడెం నుండి పాల్వంచ, భద్రాచలం రోడ్డు నత్తనడకను నడుస్తోంది. పెద్ద బస్సులు, మోటార్ సైకిళ్లు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఆ రోడ్డు దాదాపు 20-25కిమీ ఉంది. దానిని సత్వరమే పూర్తి చెయ్యాలి. భద్రాచలంలో రెండవ బ్రిడ్జికి సంబంధించి కేంద్రమంత్రి శంఖుస్థాపన చేశారు. సంవత్సరం దాటింది. 2018 లో పూర్తి చేస్తారా లేక 2017 చివర్లోనైనా పూర్తి చేస్తారా అని అడుగుతున్నాను. భద్రాచలం అనేది పుణ్యక్షేత్రం. ఉభయ రాష్ట్రాల భక్తులు ఆ పుణ్యక్షేత్రానికి వస్తుంటారు. అందువల్ల బ్రిడ్జి నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చెయ్యాలి. భద్రాచలం నుండి పాల్వంచ రోడ్డును పూర్తి చెయ్యాలి. భద్రాచాలం నుండి వాజేడు, పేరేరు దాకా 144 కి.మీ. ఆర్ అండ్ బీ రోడ్డు ఉంది. 22 లోలెవల్ బ్రిడ్జిలున్నాయి. లోలెవల్ బ్రిడ్జిలు ఉండడం వల్ల యాభై అడుగుల వరదల వల్ల, ప్రయాణానికి బ్రేక్ వచ్చే పరిస్థితి ఉంది. 27 చోట్లున్న లోలెవల్ బ్రిడ్జిలను హైలెవల్ బ్రిడ్జిలుగా మార్చితే బాగుంటుందని మంత్రి గారి దృష్టికి తీసుకొస్తున్నాను. ఛత్తీస్‌ఘడ్ నుండి భూపాల్‌పల్లి వెళ్లే రహదారిని వెడల్పు చెయ్యాలి. దూలాపురం బ్రిడ్జికి సంబంధించి రెండు సంవత్సరాల నుండి పనులు జరుగుతున్నాయి. సైడ్ పిల్లర్స్ లేపి పనులను స్పీడప్ చెయ్యాలని కోరుతున్నాను. కొప్పుచూరు, గుమ్మడిదొడ్డి బ్రిడ్జిల నిర్మాణం చెయ్యాలి. మా దగ్గర నుండి వాజేడు మండల హెడ్‌క్వార్టర్‌కి వెళ్లాలంటే పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. వర్షాకాలం వస్తే చాలా ఇబ్బందిగా ఉంది. ఆ రోడ్డుకు సంబంధించిన పనులను కూడా తక్షణం ప్రారంభించాలి. వాజేడు మండలానికి సంబంధించి వెంకటాపురంలో పూసూరు-ఎదుదులపల్లి రోడ్డు పరిస్థితి బాగాలేదు. ఆ రోడ్డుకు సంబంధించిన పనులు కూడా ప్రారంభించాలి. కోయవీరాపురం దగ్గర బ్రిడ్జి నిర్మాణం చెయ్యాలి. చర్ల మండలంలో ఆర్.అండ్.బీ రోడ్లు వెయ్యాలి. గుంపల, మొగిలిపల్లి రోడ్లు దెబ్బతిన్నాయి. మా ప్రాంతంలో ఉన్నటువంటి రహదారుల మరమ్మతులు తక్షణమే చెయ్యాలి. మాది వెనుకబడిన ప్రాంతం, ఏజెన్సీ ప్రాంతం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భూపాల్‌పల్లి జిల్లా, ఖమ్మం జిల్లాలో ఇరుకైన రోడ్లు ఉన్నాయి. వాటిని డబుల్, ఫోర్ లేన్ రోడ్లుగా చెయ్యాలి. నల్లవాగు రోడ్డుకు సంబంధించి తక్షణమే చర్యలు తీసుకోవాలి.

శ్రీ ఇ. రవీందర్ రెడ్డి (ఎల్లారెడ్డి):- అధ్యక్షా, నూతన రహదారుల నిర్మాణం అంతా ప్రభుత్వ కృషి అని చెప్పాలి. ఆర్ అండ్ బీ బ్రిడ్జీలు, రోడ్ల మీద మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగంగా, గత డెబ్బై సంవత్సరాలుగా, గత పాలకులు నిర్మించిన రోడ్ల కంటే వంద శాతం అధికంగా ఈ రెండు సంవత్సరాలలో నిర్మించడం అనేది గౌరవ ముఖ్యమంత్రి గారి కృషి అని తెలియజేస్తున్నాను. మా మంత్రి గారైన తుమ్మల నాగేశ్వర రావు గారికి, ఎం.పికి, సలహాదారులకి, ఆర్ అండ్ బీ అధికారులకు ముఖ్యంగా కేంద్రమంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ అంశం మీద మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు మీకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే

నాటికి, జాతీయ రహదారుల విషయంలో, ఆంధ్రప్రదేశ్‌లో 3.15 కి.మీ. తెలంగాణలో 2.2 కి.మీ. ఉంది అంటే చాలా సిగ్గుచేటు అధ్యక్షా.

**1.00 మ.** గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మన రోడ్లను పట్టించుకున్న పాపాన పోలేదు. అలాంటి సందర్భంలో మన ముఖ్యమంత్రిగారు, మంత్రిగారు, ఎంపీలు స్వయంగా ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రిగారిని కలిసి డీ.పీ.ఆర్. ప్రపోజల్స్‌ను సమర్పించి మంజూరు చేయించినందుకు వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. సభ్యులు చిన్నారెడ్డి గారు మాట్లాడుతూ కేంద్రం శాంక్షన్ చేసింది గానీ ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదని చెబితే నాకు చాలా బాధ అనిపించింది. ముందుగా డీపీఆర్‌లు తయారైన తరువాత టెండర్ల ప్రక్రియ పూర్తయిన తరువాతనే నిధులు విడుదలవుతాయి. వారి ప్రభుత్వం ముందుగా మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇచ్చినట్లుగా కేంద్ర ప్రభుత్వం ఇస్తుందనుకుంటున్నారా? ప్రభుత్వం మంచి చేస్తే అభినందించాలి. స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై సంవత్సరాలైనప్పటికీ 40 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వమే పాలించింది.

టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలోనే ఇన్ని రోడ్లకు శాంక్షన్‌లు తీసుకొచ్చిందంటే తప్పనిసరిగా ప్రతిపక్ష సభ్యులు అభినందించాలి. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ గారు చేసిన సహాయానికి ముఖ్యమంత్రిగారు, ఆర్ అండ్ బి శాఖ మంత్రిగారు వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు కానీ కిషన్‌రెడ్డి గారు మాట్లాడినప్పుడు మాత్రం ఈ ప్రభుత్వాన్ని అభినందించాలి కానీ వారు అభినందించలేదు.

నా నియోజకవర్గంలోని జాతీయ రహదారులు హైదరాబాదు, మెదక్, బోధన్, బాసర రోడ్లు 40 కిలోమీటర్ల పైచిలుకు మంజూరయ్యాయి. కరీంనగర్, కామారెడ్డి, సిరిసిల్ల, ఎల్లారెడ్డి రోడ్లు 50 కిలోమీటర్లు మంజూరయ్యాయి. అంటే మొత్తం 90 నుంచి 100 కిలోమీటర్లు నా నియోజకవర్గంలో మంజూరైనందుకు ముఖ్యమంత్రి గారికి, మంత్రి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా హైదరాబాదు, మెదక్, బోధన్, బాసర రోడ్ల విషయంలో కేంద్రప్రభుత్వం మంజూరు ఇవ్వలేదు. ఎందుకంటే ప్యార్‌లల్‌గా సంగారెడ్డి నాందేడ్ రోడ్డు ఆల్‌రెడీ హైవే రోడ్డు 44 హైదరాబాదు-నాగ్‌పూర్ రోడ్డు ఉన్నందున ఆ మధ్యలో సంగారెడ్డి దగ్గర 25 కిలోమీటర్లు వస్తుందని మొదట రిజెక్ట్ చేస్తే మేం కొంతమంది ఎమ్మెల్యేలం ముఖ్యమంత్రిగారి దగ్గరికెళ్లి చెబితే వెంటనే ముఖ్యమంత్రిగారు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ గారితో ఫోనులో మాట్లాడంతోబాటు ఒక లేఖ రాసి మా ఎంపీల ద్వారా పంపిస్తున్నానని చెప్పారు. ఈ రోడ్డు హైదరాబాదు నుంచి మొదలు పెడితే భైంసా వరకు 9 నియోజకవర్గాలకు లింక్ ఉంటుంది. కాబట్టి ఇది చాలా ముఖ్యమైన రోడ్డు. ఈ రోడ్డులో టోల్‌గేట్ లేనందున రాజస్థాన్, వెస్ట్ యూపీ, గుజరాత్ నుంచి వచ్చే వాహనాలు మొత్తం ఈ రూట్‌లోనే వస్తాయి.

నేను గౌరవ మంత్రిగారిని కోరేదేమిటంటే HMDA రోడ్డును దయచేసి ఎక్స్‌టెన్షన్‌చేసి బాసర వరకు లింక్‌చేస్తే సౌలభ్యంగా ఉంటుంది కాబట్టి తప్పనిసరిగా పరిశీలించి కేంద్రమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి ఈరోడ్డును ఫోర్ లేన్ రోడ్డు చేయాలని కోరుతున్నాను. HMDA రోడ్డు నార్త్ టు సౌత్, సౌత్ టు నార్త్, అదే విధంగా హైవే నెం. 44 కూడా నార్త్ టు సౌత్ ఉన్నది. దీనికి ప్యార్‌లల్‌గా ఈస్ట్ – వెస్ట్ రోడ్డు కూడా ఉండాల్సిన అవసరమున్నది. రాజస్థాన్, వెస్ట్ యూపీ వాహనాలు చెన్నై వెళ్లాలంటే మన హైదరాబాదు, మెదక్ మార్గాన వెళ్లాలి. ఈ విధంగా వెళ్లాలంటే వంద కిలోమీటర్లు ఎక్కువ అవుతుంది. కాబట్టి మద్నూరులో మొదలయ్యే రోడ్డు ఎల్లారెడ్డికి వచ్చిన తరువాత ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి, కామారెడ్డి నుంచి సిరిసిల్ల, సిరిసిల్ల నుంచి సిద్దిపేట, జనగాం, సూర్యాపేట నుంచి విజయవాడకు వెళ్లి చెన్నై వెళ్లే అవకాశముండటమే కాకుండా సుమారు 150 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

అట్లాగే వైజాగ్ వెళ్లాలంటే హైదరాబాదు రాకుండా సుమారు 150 కిలోమీటర్లు తగ్గించుకునే అవకాశమున్నది. ఇప్పుడుండే రోడ్డును కరీంనగర్ నుంచి వరంగల్, వరంగల్ నుంచి ఖమ్మం, ఖమ్మం నుంచి రాజమండ్రి, రాజమండ్రి నుంచి వైజాగ్ చేరుకోవడానికి కూడా సుమారు 150 కిలోమీటర్ల దూరం తగ్గించుకోవచ్చు. కాబట్టి ఈరోడ్డును కూడా ఫోర్ లేన్ రోడ్డు చేస్తే బాగుంటుంది.

ముఖ్యంగా హైదరాబాదు నగరంలో రీజినల్ రింగ్‌రోడ్డును ఫోర్ లేన్‌కి ప్రపోజ్ చేస్తే భవిష్యత్తులో హైదరాబాదుకు రీచ్ కాకుండా ఎక్కడికక్కడ బయటికి వెళ్లేటట్లు ఉంటుంది. దానిని సిక్స్‌లేన్ రోడ్డు చేసుకోవడానికి కావలసిన భూసేకరణ ఇప్పుడే చేసుకుంటే తప్పనిసరిగా లాభం అవుతుంది. ఆ రకంగా చేయాలని నేను మంత్రిగారిని కోరుతున్నాను. నేషనల్ హైవేలలో చాలా యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. ఎక్కడైతే టీ జంక్షన్లు వస్తున్నాయో అంటే ఉదాహరణకు హైవే నెం. 44 నాగ్‌పూర్ రోడ్డులో బైపాస్ రోడ్లను డైరెక్టుగా కలుపడం వల్ల యాక్సిడెంట్లు జరిగి ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ మధ్యనే ఎల్లారెడ్డి దగ్గర రెండు లారీల మధ్యన కారు క్రష్ అయి అయిదుగురు చనిపోయారు. అలాంటి ప్రాంతాలలో

బియుపి ఫ్లైఓవర్ వేసినట్లైతే బాగుంటుంది. డైరెక్టు హైవే రోడ్డుకు వాహనాలు ఎక్కకుండా రోడ్డు క్రాస్ అయి ఎక్కేవిధంగా ఉంటే బాగుంటుంది. కొత్త రోడ్లకు డీపీఆర్ తయారుచేసేటప్పుడే బస్ అండర్‌పాస్ గానీ వెహికల్స్ అండర్‌పాస్ గానీ పెడితే యాక్సిడెంట్లు నివారించుకోవచ్చు.

అదేవిధంగా హైవేలలో రోడ్డు మధ్యలో గ్రీన్‌బెల్ట్ కింద చెట్లు పెడుతున్నారు. కానీ వాటికి ట్యాంకర్ల ద్వారా నీళ్లు సరిగా పోయక ఆ చెట్లు ఎండిపోతున్నాయి. కాబట్టి ఆ చెట్ల గురించి మూడు, నాలుగు కిలోమీటర్లకు ఒక బోర్‌వెల్ వేసి డ్రిప్ సిస్టం ఏర్పాటుచేస్తే ఆ చెట్లు బ్రతికి పెరుగుతాయి. అంతే కాకుండా రోడ్డు సైడ్లకు కూడా పైపులైన్‌లను వేసి డ్రిప్ సిస్టంను భూమిలోనే ఏర్పాటుచేస్తే బ్రహ్మాండమైన చెట్లు పెరిగే అవకాశముంటుంది కాబట్టి ఆ రకంగా ప్రయత్నం చేయాలని కోరుతున్నాను.

అదే విధంగా నా నియోజకవర్గంలోని మంజీరా ప్రాజెక్టు మీద రూ.40 కోట్లతో బ్రిడ్జిని మంజూరు చేసినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి, మంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నా పక్క నియోజకవర్గమైన జుక్కల్ నియోజకవర్గానికి కూడా బ్రిడ్జిని మంజూరు చేశారు. మా దగ్గర ఈ రెండు నేషనల్ హైవేల మీద బ్రిడ్జీలను శాంక్షన్ చేయడం కోసం రూ.15 కోట్లు పెచ్చించారు. కానీ కొన్నింటికి మాత్రమే టెండర్లు పిలిచారు. మిగిలినవి ఏం చేస్తారనేది చెప్పాలని కోరుతున్నాను. ఒకవేళ మిగిలిన ఆ బ్రిడ్జీలన్నీ ఆర్ అండ్ బి బ్రిడ్జీలుగా కన్వర్ట్ చేస్తారా అని గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని తీసుకొని బ్రహ్మాండంగా బంగారు తెలంగాణకు బాటలు వేయడానికి తొలిమెట్టుగా ఆర్ అండ్ బి రోడ్ల ద్వారా ఫోర్ లేన్ గానీ సిక్స్ లేన్ గానీ మండల హెడ్ క్వార్టర్ నుంచి జిల్లా హెడ్ క్వార్టర్‌కి కనెక్టివిటీ కల్పించినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి, మంత్రి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**1.10 మ.** శ్రీ కె. కోనప్ప (సిర్‌పూర్): అధ్యక్షా, జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా నా నియోజకవర్గంలోని కౌతాల నుండి సారపాక వరకు రహదారిని మంజూరు చేసిన ముఖ్యమంత్రి గారికి రెండు జోతులు జోడించి ధన్యవాదములు తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి తీసుకున్న నిర్ణయమని గర్వంగా చెప్పుకోవచ్చు. కౌతాల చాలా వెనుకబడిన ప్రాంతమనే విషయం మీకు కూడా తెలుసు. మీరు, మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వర రావు గారు చాలా సార్లు ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈనాటికి కూడా అక్కడ చాలా చోట్ల రోడ్లు లేని పరిస్థితి ఉంది. కౌతాల నుండి కొమురం భీం జిల్లాకు రహదారిని మంజూరు చేసినందుకు ధన్యవాదములు. మా నియోజకవర్గానికి ఆనుకొని ప్రవహిస్తున్న ప్రాణహిత నదిపైన వంతెనను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి గారిని కోరిన వెంటనే, వారు కూలంకషంగా పరిశీలించి ఆ బ్రిడ్జి చాలా అవసరమైనదని, తప్పకుండా మంజూరు చేస్తానని హామీ ఇవ్వడమే కాకుండా, బ్రిడ్జి మంజూరు చేసేటప్పుడు మొట్టమొదటి విడతగా రూ.95 కోట్లు నిధులను మంజూరు చేసినందుకు ధన్యవాదములు.

గూడెం – ఐరికి మంజూరు చేసిన బ్రిడ్జి నిర్మాణం వల్ల హైదరాబాద్ నుంచి రాయపూర్‌కు వెళ్లే వారికి సుమారుగా 80–90 కిలోమీటర్ల దూరాభారం తగ్గి మూడు రాష్ట్రాలకు కనెక్టివిటి కలుగుతుంది. ఈ బ్రిడ్జిని మంజూరు చేసి ఆ ప్రాంత ప్రజలను బాహ్యప్రాంతాలకు కనెక్టివిటి చేసినందుకు ధన్యవాదములు. బెజ్జూరు నుంచి కాగజ్‌నగర్ వరకు డబుల్ రోడ్‌ని మంజూరు చేశారు. మంజూరు చేసిన 110 కిలోమీటర్లు డబుల్ రోడ్ పనులు వేగంగా నడుస్తున్నాయి. రాజీవ్ రహదారిని కూడా మహారాష్ట్ర చంద్రాపూర్ వరకు పొడిగించడానికి చేసిన కృషికి, ప్రాణహిత బ్యాక్‌వాటర్ ముప్పు నుంచి కాపాడటానికి హైలెవల్ బ్రిడ్జిలను మంజూరు చేసినందుకు ఆ ప్రాంత ప్రజలందరం ముఖ్యమంత్రి గారికి ధన్యవాదములు తెలియజేస్తున్నాము. పిఆర్ నుంచి ఆర్‌అండ్‌బికి మార్చిన రోడ్లకు నిధులు మంజూరు చేసి మా ప్రాంత అభివృద్ధికై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి గారిని కోరుకుంటున్నాను. ధన్యవాదములు.

శ్రీ జి. బాలరాజు (అచ్చంపేట):- అధ్యక్షా, ఈ రోజు గౌరవ ముఖ్యమంత్రి గారు యావత్ తెలంగాణ ప్రజానీకం మెచ్చే విధంగా గత పాలకులు 60 సంవత్సరాల చరిత్రలో సాధించిన రోడ్లను కేవలం రెండున్నర సంవత్సారాల కాలవ్యవధి లోపల 2,700 కిలోమీటర్ల నేషనల్ హైవేను తెలంగాణ ప్రజలకు వరంగా ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గారికి ప్రత్యేక ధన్యవాదములు.

( ట్రెజరీ బెంచీల నుంచి బల్లలు చరిచారు.)

రాష్ట్రం, జిల్లాల విషయంలో ముఖ్యమంత్రి గారు సమదృష్టి కేంద్రీకరించరనడానికి ఇది నిదర్శనం. ఏ జిల్లాకు రానన్ని రోడ్లను మాజిల్లాకు కేటాయించినందుకు ముఖ్యమంత్రి గారికి ధన్యవాదములు.ఇంటర్ స్టేట్ కనెక్టివిటి కోసం గౌరవ ముఖ్యమంత్రి గారిని, ఆర్ అండ్ బి శాఖ మంత్రి గారిని అనేక సార్లు కలవడం జరిగింది. కృష్ణా రివర్ పై బ్రిడ్జిని నిర్మాణం చేసి అక్కడ ఉన్న రెండు

రాష్ట్రాల ప్రజలు శ్రీశైలం వెళ్లాలన్న, రెండు రాష్ట్రాల సంబంధాలు కొనసాగాలన్నా అచ్చంపేట నియోజకవర్గం వ్యాపారపరంగా ఎదగాలన్న ఈ బ్రిడ్జి కనెక్టివిటి అవసరమని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. అటవీ ప్రాంతమైనందున ఆ ప్రాజెక్టుల అనుమతుల విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని ముఖ్యమంత్రి గారు, మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు గారు చెప్పడం జరిగింది. బ్రిడ్జి నిర్మాణం, రోడ్డు ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఖచ్చితంగా సహకారం అందిస్తుందని చెప్పినందుకు ధన్యవాదములు. దీంట్లో ఇనిషియేటివ్ తీసుకున్నట్లైతే ప్రాంతాలుగా విడిపోదాము, ప్రజలుగా కలిసుందామని ఉద్యమ సందర్భంలో ముఖ్యమంత్రి వర్యులు చెప్పిన విషయాన్ని పునరుద్ధరించడానికి అవకాశం ఉంటుంది, ప్రజల సంబంధాలు మెరుగుపడటానికి అవకాశం ఉంటుంది. కావున, రెండు రాష్ట్రాలు చొరవ చూపడానికి వీలైతే మీరు కూడా చొరవ తీసుకోవాలని కోరుతున్నాను. నేషనల్ హైవే –765 తుక్కుగూడ నుంచి పాతాళగంగ వరకు శాంక్షన్ వచ్చిన రోడ్డు త్రీలైన్‌గా ఉన్నది. దానిని 4 లైన్‌గా మార్చినట్లైతే యాక్సిడెంట్‌లను నివారించడానికి అవకాశం ఉంటుంది. అత్యధిక సంఖ్యలో భక్తులు అనునిత్యం శ్రీశైలానికి వెళ్తుంటారు. రవాణా వ్యవస్థ బాగుపడితేనే వెనుకబడిన, నిర్లక్ష్యానికి గురైన మా నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవడానికి అవకాశం లభిస్తుందని తెలియజేస్తున్నాను.

(బెల్)

డిండి నుంచి మన్ననూర్ వరకు 20 కిలోమీటర్లు, మన్ననూరు నుంచి పాతాళగంగ నా నియోజకవర్గ బార్డరు వరకు 60 కిలోమీటర్ల రహదారికి సంబంధించిన 18 కోట్ల రూపాయలు శాంక్షన్ అయినప్పటికీ అటవీ అనుమతుల జాప్యం వల్ల వచ్చిన నిధులను కూడా వాడుకోలేని దౌర్భాగ్యస్థితి ఉంది. కేంద్రం మంత్రి నితిన్‌గడ్కరి గారు, జవదేకర్ గారు నా నియోజకవర్గానికి వచ్చిన సందర్భంలో ఈ సమస్యను రిప్రెజెంట్ చేయడం జరిగింది. అటవీ అనుమతుల విషయంలో రాష్ట్రప్రభుత్వ చొరవ వల్ల కేంద్ర ప్రభుత్వం అనుమతించి 18 కోట్లను మంజూరు చేయడం గర్వించదగిన విషయమైనప్పటికీ, అటవీ అనుమతుల విషయం జఠిలం కావడం వల్ల అక్కడి ప్రజలు రహదారుల విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. మేము మాట్లాడే ప్రతిసారి గమనిస్తున్నాము. ముఖ్యమంత్రి గారికి, ప్రభుత్వానికి ధన్యవాదములు తెలియజేయడానికి ఒకట్రెండు నిమిషాలే కేటాయిస్తున్నారు.

(బెల్)

మంచి సందర్భాన్ని పురస్కరించుకొని మాట్లాడే సమయంలో ప్రభుత్వం చేసిన మంచి కార్యాలను శాసన సభ్యుడిగా తెలియజెప్పాల్సిన బాధ్యత మాపై ఉన్నది. రవాణా వ్యవస్థపై గత ప్రభుత్వాలు దృష్టిసారించకపోవడమే తెలంగాణ ప్రాంతంగా పూర్తిగా దయనీయంగా మారడానికి కారణం. ఈ వెనుకబాటుతనాన్ని నిర్మూలించడానికి మా ముఖ్యమంత్రి గారు, మా మంత్రులందరూ ప్రయత్నం చేస్తున్న విషయాన్ని ఈ వేదికగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. ఆత్మస్థైర్యం దెబ్బతినేలాగా..........

(మైక్ కట్ చేయబడింది)

శ్రీ వి. సతీష్ కుమార్ (హుస్నాబాద్):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారికి, ఆర్ అండ్ బి శాఖ మంత్రి గారికి, ఆర్ అండ్ బి విభాగానికి, మన రాష్ట్రంలో 2700 కిలోమీటర్ల రహదారులను మంజూరు చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి గారికి ప్రత్యేక ధన్యవాదములు. ఉద్యమ సమయంలో వరంగల్‌లో మహా సంగ్రామం, మహా సింహగర్జన పెట్టినప్పుడు గౌరవ ముఖ్యమంత్రి గారు సిద్ధిపేట, హుస్నాబాద్ మీదుగా సైకిల్ యాత్ర చేసుకుంటూ వరంగల్‌కు వచ్చిన విషయాన్ని గుర్తుంచుకొని ముఖ్యమంత్రి గారు నా నియోజకవర్గం హుస్నాబాద్‌కి కనెక్టివిటిగా మెదక్, సిద్ధిపేట, హుస్నాబాద్ – ఎలుకతుర్తి – వరంగల్‌కు వచ్చే విధంగా 137 కిలోమీటర్లు రహదారిని ఇచ్చినందుకు ప్రజలందరూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నా నియోజకవర్గం నుండి వరంగల్, వరంగల్ నుంచి ఎలుకతుర్తి మీదుగా హుజూర్‌బాద్ వరకు నా నియోజకవర్గం ఉంటుంది. అక్కడ కూడా 60 కిలోమీటర్ల రహదారిని ఇచ్చినందుకు ముఖ్యమంత్రి గారికి ధన్యవాదములు. గతంతో పోల్చుకుంటే తెలంగాణ రాష్ట్రప్రభుత్వం వచ్చిన తరువాతనే ఒక మండలం నుంచి ఇతర మండలాలకు, మండలాల నుంచి జిల్లాలకు కనెక్టివిటి రోడ్లు మెరుగయ్యాయని, రహదారుల విషయంలో హుస్నాబాద్ నియోజకవర్గం మొదటి నుంచి చాలా వెనుకబడిన ప్రాంతమని గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువచ్చినప్పుడు దాదాపు 70 శాతం కనెక్టివిటి రోడ్లను మా నియోజకవర్గానికి ఇచ్చినందుకు ధన్యవాదములు.

**1.20 మ.** శ్రీ జి. విట్టల్ రెడ్డి (ముథోల్):– అధ్యక్షా, రోడ్లు బాగుంటేనే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుంది. అందులో భాగంగానే గౌరవనీయులు ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఒక మంచి నిర్ణయం తీసుకున్నారు. చిరకాల కోరిక అయిన వంశగుడి బ్రిడ్జ్ పూర్తి చేశారు. సుమారు 40 సంవత్సరాల నుండి ఆ ప్రాంత ప్రజలు చాలా సార్లు అడగడం జరిగింది. గత ప్రభుత్వాలు ఈ పని చేయలేదు.

మన ముఖ్యమంత్రి గారు దయతో అంగీకరించి ట్రాన్స్‌పోర్ట్ మినిస్టర్ తుమ్మల నాగేశ్వరరావు గారికి చెప్పడం, మా జిల్లా మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి గారు, రామన్న గారు కూడా మీటింగులు ఏర్పాటు చేసి ఇది చాలా ముఖ్యమైన అంశమని చెప్పారు. గోదావరి వంతెన పైన నాటు పడవల మీద వెళ్లే క్రమంలో ప్రమాదాల్లో ఎంతో మంది చనిపోవడం జరిగింది. పంచకోట బ్రిడ్జ్‌ను రాష్ట్రముఖ్యమంత్రిగారు, ఆర్ అండ్ బి మంత్రులు అందరు కలిసి డి.పి.ఆర్. తయారు చేసి సుమారు రూ. 95 కోట్లతో మంజూరు చేయడం జరిగింది. అభివృద్ధి పనుల్లో భాగంగా రెండు రోడ్ల పనులు కూడా జరుగుతున్నాయి. దీని వలన మా ప్రాంత ప్రజలకు రెండు విధాల లాభం ఉంది. మా ప్రాంత రైతులు పండించిన పసుపు, మొక్క పంటను తీసుకుని సుమారు వంద కిలో మీటర్ల దూరం ఉన్న నిజామాబాద్ మార్కెట్‌కు పోవాలి. ఈ బ్రిడ్జ్ పనులు పూర్తైతే 30 కిలో మీటర్లు మాత్రమే దూరం ఉంటుంది. హైదరాబాదు రూటులో మెదక్, బోధన్, భైంసా. ఈ రోడ్లు కూడా చాలా ప్రసిద్ధి చెందింది.

శ్రీ దుర్గం చిన్నయ్య (బెల్లంపల్లి):- తెలంగాణలో నూతన జాతీయ రహదారుల నిర్మాణం, ప్రభుత్వ కృషి విషయంపై మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. బెల్లంపల్లి నియోజక వర్గంలో వేమున పల్లి, బీమిలి, వెన్నెల ప్రాంతాలన్నీ పూర్తిగా మారు మూల ప్రాంతాలు. 1985 సంవత్సరంలో ఆర్ అండ్ బి మంత్రి గారు వేమునపల్లి మండలానికి ఎడ్ల బండిలో రావడం జరిగింది. ఆనాటి నుండి ఈనాటి వరకు 30 గ్రామాల ప్రజలు అక్కడ ఉన్న వాగు దాటడానికి ఇప్పటికీ పడవల మీదనే టౌన్‌కి వస్తున్నారు. పోయిన సంవత్సరంలో ఒక గర్భిణి స్త్రీ ఆసుపత్రికి పోడానికి సాయంత్రం పూట ఒడ్డుకు వచ్చి పడవ నడిపేవానికి ఫోన్ చేస్తే అతను తాగి అవతలి ఒడ్డున పడుకుని ఉన్నాడు. ఆ పరిస్థితుల్లో ఆ గర్భిణి స్త్రీ అక్కడే ప్రాణాలు కోల్పోవడం వలన తల్లీ బిడ్డలిద్దరూ చనిపోవడం జరిగింది. మూడు రోజుల తరువాత నేను, ప్రభుత్వ విప్ కోవా లక్ష్మి గారు అందరం కలిసి ముఖ్యమంత్రి గారి ఇంటికి వెళ్లి మాటల సందర్భంలో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోవడం జరిగింది. ఆరోజే వెంటనే ఆర్ అండ్ బి మంత్రి గారికి ఫోన్ చేసి, అప్పుడు ఉన్న మంత్రి కేటీఆర్ గారికి ఫోన్ చేసి ఈ కాలంలో కూడా ఇంకా ప్రజలు పడవల మీద పోతున్నారా అని ఎల్లుండే మీటింగును ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయమని ముఖ్యమంత్రి గారు ఆదేశిస్తే వెంటనే రెండ్రోజుల్లో మీటింగ్ ఏర్పాటు చేసి రోడ్డు మరియు బ్రిడ్జికి రూ.18 కోట్లు మంజూరు చేయడం జరిగింది. ఆ పనులు జరుగుతున్నాయి. అందుకు మా తరఫున, మా నియోజక వర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతూ, మంచిర్యాల నుండి చంద్రపూర్ వరకు రూ.15 వందల కోట్లు మంజూరు చేయడానికి ఏదైతే కృషి చేశారో ఇది పూర్తిగా మా ప్రాంతంలో ఉన్న 4 నియోజక వర్గాల ప్రజలు ఋణపడి ఉంటారు.

శ్రీ జి. కిషోర్ కుమార్ (తుంగతుర్తి):- అధ్యక్షా, ఏ ప్రాంతమైనా రవాణా వ్యవస్థ సరిగా లేకపోతే కుంటుపడుతుంది కనుక ఆ ప్రాంతం అభివృద్ధికి నోచుకోకుండా వెనుకబడే అవకాశం ఉంది. అటువంటి విషయాన్ని అర్థం చేసుకుని 20 సంవత్సరాలుగా ఉన్న 2500కిలో మీటర్ల జాతీయ రహదారులను కేవలం 2 సంవత్సరాలలోనే మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నందుకు తెలంగాణ శాసన సభ సభ్యునిగా ముఖ్యమంత్రి గారికి మరియు కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.మా వద్ద మూడు జాతీయ రహదారులు పోతున్నాయి. సిరిగంచెట్టు-రేణుగుంట, తొసెంచెర్ల మొత్తం పని అయిపోయింది. తొసెంచెర్ల-నక్రేకల్ రోడ్డు విషయంలో బాగా ఆలస్యం అవుతుంది. కాబట్టి, ఆ విషయాన్ని ఒకసారి పరిశీలించాల్సిందిగా మంత్రి గారిని కోరుతున్నాను. హైదరాబాదు నుండి భద్రాచలంకి వేసిన 234 కిలో మీటర్ల రోడ్డును 10 మీటర్ల హైవేగా శాంక్షన్ తీసుకువచ్చిన సందర్భంలో ఆ రోడ్డు ఔటర్ రింగు రోడ్డు నుండి ఏదులాబాదు, నల్గొండ మీదుగా పోతున్న సందర్భంలో ఆ రోడ్డును భువనగిరి రోడ్డుకు కనెక్ట్ చేయకుండా డైరెక్ట్ ఔటర్ రింగ్ రోడ్డుకు కనెక్ట్ చేస్తే ఏదులాబాదు, నల్గొండ రోడ్డుకు పోయే అవకాశం ఉంది కాబట్టి, ఆ వెసులుబాటును పరిశీలించాలని గతంలో శేఖర్ రెడ్డి, ఎంఎల్ఏ గారు కూడా అడిగారు. ఈ విధంగా చేయడం వలన ఫ్లేస్ కూడా తగ్గుతుంది కాబట్టి, ఆ విషయాన్ని గుమనించి పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నాను. గతంలో డబుల్ రోడ్డు అంటే రోడ్డుకు ఇరుప్రక్కలా వైడనింగ్ తీస్తూ, వాటిని మాత్రమే ఎక్స్‌టెన్షన్ చేసేవారు. ఇప్పుడున్న నియమ నిబంధనల ప్రకారం పాత రోడ్లను పూర్తిగా తొలగించి ఎత్తు పల్లాలను సాఫు చేస్తూ, అద్భుతమైన రోడ్డు వేసే అవకాశం ఉంది. పాత రోడ్లకు ఇచ్చిన కిలో మీటర్ల పరిధి మేరకు 10 కిలో మీటర్లు వెనుకకు తీసుకువచ్చారు. ఆ 10 కిలో మీటర్లకు సంబంధించి కూడా శాంక్షన్ ఇస్తే సూర్యాపేట నుండి మిర్యాలగుడ మంచి రోడ్డు తయారయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే నా నియోజక వర్గంలో అవనిభూమి నుండి పోతున్న మోత్కూరు రోడ్డు కానివ్వండి, దంతాల పల్లి పోతున్న నూతన్‌కల్ రోడ్డు కానివ్వండి, నాగారం మీద నుండి వచ్చే తుంగతుర్తి రోడ్డు వీటన్నింటికీ శాంక్షన్లు వచ్చాయి. ఒక్క నా నియోజగ వర్గంలోనే ఆర్ అండ్ బి డిపార్ట్‌మెంట్ నుండి దాదాపు

రూ. 150 కోట్లు నిధులకు సంబంధించిన విడుదల జరిగిందంటే తెలంగాణ రాష్ట్రం ఎంత అద్భుతంగా ముందుకు పోతోందో గమనించవచ్చు. ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి వలిగొండ నుండి భువనగిరికి వస్తోంది. వలిగొండ నుండి చిట్యాల వరకు చిన్న బిట్ మిగిలిపోతుంది. మొన్న జరిగిన బస్ యాక్సిడెంట్ ఆ రోడ్డులోనే జరిగి వందల మంది గాయాలకు గురై కొంత మంది చనిపోయారు. దానిని కూడా డబుల్ రోడ్డుకు కన్వర్ట్ చేసి రహదారిగా తీసుకుంటే లాభం జరిగే అవకాశం ఉంటుంది. ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణం జరుగుతున్నప్పుడు ప్రక్కనే ఉన్న వాటర్ గ్రిడ్ పైపు లైన్లకు సంబంధించి రెండు డిపార్ట్‌మెంట్ల మధ్య ఒక ఘర్షణ వాతావరణం ఏర్పడి ఒక డిపార్ట్‌మెంట్ మీద మరో డిపార్ట్‌మెంట్ కేసులు పెట్టుకునే వాతావరణం కనపడుతోంది. కాబట్టి, ప్రభుత్వం రెండు డిపార్ట్‌మెంట్ల మధ్య ఒక సమీక్ష నిర్వహించి గందరగోళ వాతావరణం నుండి బయట పడేయాల్సిన ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఆర్ అండ్ బి రోడ్లు దాదాపు పూర్తి అవుతూనే రెండు మూడు కిలోమీటర్ల పంచాయతీ రాజ్ రోడ్లు చిన్న చిన్న బిట్లు మిగిలిపోతున్నాయి. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి డిపార్ట్‌మెంట్లు ఒక సమీక్ష నిర్వహించుకుని అవసరమైతే పంచాయతీ రాజ్ రోడ్లను ఆర్ అండ్ బి శాఖకి బదిలీ చేసుకుని మొత్తం ఆర్ అండ్ బి రోడ్లు క్రింద పరిగణలోకి తీసుకుంటే అభివృద్ధి పథంలో ముందుకు పోయే అవకాశం ఉంటుందని తెలియజేస్తున్నాను.

శ్రీ పుట్టా మధుకర్ : అధ్యక్షా, ముఖ్యంగా ఇన్ని వందల కిలోమీటర్లను నేషనల్ హైవేలుగా శాంక్షన్ తీసుకువచ్చిన గౌరవ ముఖ్యమంత్రి గారికి, ఆర్ అండ్ బి శాఖా మాత్యులకు, పని చేసిన అధికారులకు, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ, మంథని నియోజక వర్గంలో స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు మారుమూల ప్రాంతంగా ఉన్న దానిని వెలుగులోకి తీసుకువస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. శ్రీ పి.వి. నర్సింహారావు గారు ఎం ఎల్ ఏ గా ఉన్నప్పుడు ఒక రెండు బ్రిడ్జిలు కట్టారు. 60 సంవత్సరాల కాలంలో మానేరు, గోదావరి ఎక్కువగా ప్రవహిస్తున్నప్పటికీ సింహ బాగాన ఉన్న కాంగ్రెస్ పార్టీ నా నియోజక వర్గంలో ఒక్క బ్రిడ్జి కూడా కట్టలేకపోయింది.

**1.30 ప.** అధ్యక్షా, మంథని నియోజక వర్గాన్ని వెలుగులోకి తీసుకువస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కెసిఆర్ గారికి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నాను. గతంలో పి.వి నర్సింహారావు గారు ఎమ్ఎల్ఏగా ఉన్న ప్పుడు ఆ ప్రాంతంలో రెండు బ్రిడ్జిలను నిర్మించారు. 60 సంవత్సరాలపాటు కాంగ్రెస్ పార్టీ సింహ భాగాన పరిపాలించినప్పటికీ, నా నియోజక వర్గంలో మానేరు గోదావరి ఎక్కువగా ప్రవహిస్తున్నప్పటికీ, వీటిని నిర్మించలేకపోయింది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన కొద్ది కాలంలోనే ముఖ్యమంత్రి గారు ఈ విషయమై చొరవ చూపించి బోర్లేరు వద్ద ఒక బ్రిడ్జ్, ఖమ్మంపల్లి వద్ద బ్రిడ్జిని మంజూరు చేశారు. ఒక బ్రిడ్జి పనులు ప్రారంభం కూడా అయ్యాయి. ఇంకొక బ్రిడ్జి నిర్మించడం కోసం టెండర్లను పిలువటకు సిద్ధంగా ఉంది. ఇది సంతోషకరమైన విషయం. కాగజ్‌నగర్ నుంచి ఏటూరి నాగారం వరకు, జాతీయ రహదారిని నిర్మిస్తున్న వద్ద పలుగు బ్రిడ్జి కూడా వస్తున్నది. అదే విధంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారంల వద్ద బ్యారేజీ మరియు బ్రిడ్జిలు కూడా వస్తున్నాయి. దీని వల్ల ఈ ప్రాంతం సస్యశ్యామలం అయ్యే అవకాశాలు ఉన్నాయి. చిత్తశుద్ధి ఉంటే దేనినైనా సాధించగలము అన్న దానికి ముఖ్య మంత్రి కెసిఆర్ గారే నిదర్శనమని చెబుతున్నాను. అదే విధంగా వారి సమక్షంలో పని చేస్తున్నందుకు సంతోషంగా ఉందని తెలియజేస్తున్నాను. కాళేశ్వరం, భూపాలపల్లి, వరంగల్ నుంచి చెన్నై హైవేను కలిపే జాతీయ రహదారి వస్తే బాగుంటుందని మీ ద్వారా మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను. జగిత్యాల, ధర్మారం, పెద్దపల్లి, మంథని, భూపాలపల్లి నుంచి జాతీయ రహదారి అయినా లేక నాలుగు లైన్ల రహదారి అయినా శాంక్షన్ చేస్తే బాగుంటుందని మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను. వీటన్నిటినీ త్వరితగతిన పూర్తి చేసి మంథనిని వెలుగులోకి తెచ్చే విధంగా కృషిచేయాలని, మీ ద్వారా మంత్రి గారిని వేడుకుంటున్నాను.

శ్రీ గంగుల కమలాకర్:– అధ్యక్షా, గౌరవ ముఖ్య మంత్రిగారు ప్రతిపాదించిన రహదారుల్లో, మా కరీంనగర్ పట్టణానికి ఒక నేషనల్ అథారిటీ హైవే ఆఫ్ ఇండియాలో భాగంగా ఒక రహదారి, మరియు నేషనల్ హైవేలో ఒక రహదారిని శాంక్షన్ చేశారు. వీటితోపాటు భారతదేశంలో మూడవ బ్రిడ్జి సౌత్ ఇండియాలోనే మొట్టమొదటి కేబుల్ బ్రిడ్జి కరీంనగర్‌లో గల మానేరుపై కడుతుండడం మా ప్రజల అదృష్టంగా భావిస్తున్నాను. వీటిని మంజూరు చేసినందుకు పట్టణ ప్రజల పక్షాన, ముఖ్య మంత్రి గారికి, మంత్రివర్యులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ బ్రిడ్జి పర్యాటకులకు ఒక అసెట్‌గా మారుతుంది. కరీంనగర్ లెఫ్ట్ రోడ్ చింతకుంట నేషనల్ హైవే రోడ్డు, రైట్ రోడ్ రేకుర్తి నేషనల్ అథారిటి ఆఫ్ ఇండియా రోడ్డు, ఈ రెండింటితోపాటు స్టేట్ హైవే కూడా ఉంది. ఈ రెండు రోడ్లు పక్క పక్కగా వెళుతున్న కూడా లింక్ ఎక్కడా కూడా చూపించలేదు. కనుక వీటిని సేమ్ విడ్త్‌తో రెండు రోడ్ల లింక్‌లను కలపాలని మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పాయం వెంకటేశ్వర్లు (పినపాక):– అధ్యక్షా, షార్ట్ డిస్కషన్‌లో భాగంగా, తెలంగాణలో నూతన జాతీయ రహదారుల నిర్మాణం, వాటిపై ప్రభుత్వం చేసిన కృషిని వివరిస్తూ, గతంలో ఎన్నడూ లేని విధంగా రహదారుల గురించి రెండున్నర సంవత్సరాల కాలంలో పెద్ద ఎత్తున జాతీయ రహదారుల నిర్మాణానికి 19కోట్ల రూపాయలను మంజూరు చేశారు. మా పినపాక నియోజకవర్గం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం. గతంలో నా నియోజక వర్గంలో నేషనల్ హైరోడ్డు కూడా లేదు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా రహదారులను మంజూరు చేసిన ముఖ్య మంత్రి గారికి, తుమ్మల నాగేశ్వరరావు గారికి నా తరపున, మా ప్రాంత ప్రజల తరపున ప్రత్యేకమైన ధన్యవాదములు తెలియజేస్తున్నాను. ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడాలన్నా, రవాణా సౌకర్యం ముఖ్యమైనదని తెలియజేస్తున్నాను. రవాణా సౌకర్యం మెరుగుపపడాలని, ప్రజల జీవితాల్లో వెలుగులు రావాలని, భావించి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, 19 జాతీయ రహదారులను మంజూరు చేయడమనే విషయం దేశ చరిత్రలోనే మిగిలిపోతుందన్న విషయాన్ని తెలియజేస్తున్నాను. మా నియోజకవర్గం బూర్గంపహాడ్ నుంచి సారిపాక వరకు, అశ్వాపురం నుండి మణుగూరు, పినపాక మండలాల మీదుగా తాలేశ్వరం, సింగూరు, తోటాల, సిర్పూర్ వరకు 396 కి.మీ.ల నేషనల్ హైవే వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం బ్రిడ్జిల నిమిత్తం రూ.15 వందల, 38 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయం. ఈ వంతెనల నిర్మాణం గురించి గోదావరి నదిపై నాలుగు బ్రిడ్జీల నిర్మాణాలను చేపడుతోంది. అందులో నా నియోజక వర్గంలో గల పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం వద్ద పర్ణశాల నుంచి మణుగూరు మండలం రాయుగూడెం ప్రాంతాలను కలుపుతూ, దక్షిణ భారతదేశంలోనే తీగలతో నిర్మాణం చేబట్టబోతున్నందుకు మంత్రి వర్యులకు ధన్యవాదములు తెలియజేస్తున్నాను. గుండాల మండలంలో కూడా సరైన రహదారులు లేవు. కనుక గుండాల నుంచి దామరతోగు మీదుగా రంగాపూర్ వరకు బిటి రోడ్డు నిర్మాణం, గుండాల నుంచి పాశ్వా వరకు, చెట్టుపల్లి నుంచి కొమరావు వరకు బిటి రోడ్డు నిర్మాణం, మరకోడు నుంచి రేగేడు వరకు, అశ్వాపూర్ మండలం మణుగూరు నుంచి ఆర్.టి.సి. బస్సులు నడుస్తున్న రోడ్డును వైడెనింగ్ చేసేందుకు ఆలోచించాలని తమ ద్వారా గౌరవ ముఖ్య మంత్రి గారికి, గౌరవ మంత్రి గారికి తెలియజేస్తూ ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదములు తెలియ జేస్తున్నాను.

డా. జె. గీత (జహీరాబాద్):– అధ్యక్షా, గౌరవ ముఖ్య మంత్రి గారు రహదారుల ఏర్పాటు గురించి చదివి వివరించారు. అభినందనలు. మా పాలనలో మేము కూడా రోడ్లను వేశాము. కనుకనే మోటర్ వెహికల్స్, కార్లు వెళ్లేవి. మీరు ఇచ్చిన నోట్‌లో 24,250 కి.మీ.ల వరకు రోడ్లు ఉండేవని ఉంది. సింగిల్ లైన్ ఉన్న వాటిని డబుల్ లైన్ చేస్తున్నారనే మాట వింటుంటే చాలా సంతోషంగా ఉంది. గత సంవత్సరం 20 శాంక్షన్ అయ్యాయి. వాటిని కూడా ఈ పేపర్‌లో పొందుపరిచారు. దానిలో జహీరాబాద్ నుంచి ఒక రోడ్డు శాంక్షన్ అయినట్టున్నాయి. జహీరాబాద్ నుంచి తాండూర్, కొడంగల్, మహబూబ్‌నగర్, వయా నాగర్ కర్నూల్, కొల్హాపూర్ నుంచి నందికొట్కూర్ వరకు ఉంది. ప్రపోజల్ పెట్టారని తెలిసింది, కాని ఆ ప్రపోజల్ విషయం ఈ లిస్ట్‌లో లేదు. జాతీయ రహదారిలో చిన్న రోడ్డు మాత్రమే శాంక్షనైనట్టు ఇచ్చారు. జహీరాబాద్, బీదర్, డెగ్యూల్ శాంక్షన్ చేసినందుకు నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. చాలా చిన్న పని 25కి.మీల రహదారిని మాత్రమే ఇచ్చారు. పెద్ద పనులున్నాయి, వాటిని తప్పకుండా మీరు ఫాలోఅప్ చేస్తారని, నేను ఆశిస్తున్నాను. మా జహీరాబాద్ నియోజక వర్గం 65బాంబే హైవే సంగారెడ్డి నుంచి సదాశివపేట్ ఫోర్‌లైన్ రోడ్ల పనులు నడుస్తున్నాయి. ఫోర్‌లైన్ పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయి. దీనిపై దృష్టిపెట్టాలని ఆ పనులను స్పీడ్అప్ చేయించాలని కోరుతున్నాను. సంగారెడ్డి రోడ్డు మెరుగుపడుతోంది కాని, సదాశివపేట, నుంచి జహీరాబాద్ రోడ్డు చాలా అధ్వాన్న స్థితిలో ఉంది. ఈ రోడ్డు సంగారెడ్డి నుంచి సదాశివపేటకు 40కి. మీ. లు ఉంటుంది.ఈ రోడ్డు ఎంత దారుణంగా ఉందంటే, స్పాండిలైటిస్ వంటి రోగాలు వస్తాయి, గర్భిణీలకు ప్రమాదకరంగా మారింది. చాలా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఎల్అండ్‌టి సంస్థ వారిని గట్టిగా అడిగి పనులను తొందరగా పూర్తి చేయించాలని కోరుతున్నాను. నో మంత్స్ బేబీలాగా పని అవుతోంది. ఎల్అండ్‌టి వారు మా పని కాదంటున్నారు. లోకల్, స్టేట్ ఆర్.అండ్.బి. వారు ఎవరూ ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై దృష్టి సారించాలని కోరుకుంటున్నాను.

**1.40 మ.** ప్రమాదాలు చాలా అవుతున్నాయి. ప్రమాదాలు పెరిగిపోయాయి. ఈ ప్రమాదాలను అరికట్టాలంటే అక్కడ ఆర్.ఓ.బీ.ని ఏర్పాటు చేయాలి. అలాగే ఈ ప్రాంతంలో ఒక ట్రామా సెంటర్‌ని ఏర్పాటు చేయాలని మిమ్మల్ని కోరుతున్నాను. బాంబే హైవే కాబట్టి అక్కడ చాలా ట్రాఫిక్ ఉంటున్నది. అక్కడ ట్రాఫిక్ వల్ల మనుషులు నడవాలన్నా ఇబ్బందిగా ఉంది. కార్లు వెళ్లాలన్నా కష్టంగా ఉంది. అక్కడ ఒకరైల్వే ట్రాక్ ఒకటి ఉంది. ఇది మీ సబ్జెక్ట్‌కాకపోయినా మీరు తప్పకుండా సహకరిస్తారని అనుకుంటున్నాను. రైల్వేఓవర్ బ్రిడ్జ్‌ను మీరు మాకు ఇవ్వగలిగితే మేము సంతోషిస్తాము. It is

very necessary to have this Railway Over Bridge. హరీష్ రావుగారికి కూడా ఆ విషయం తెలుసు. వారు తరచుగా అటువైపు వస్తుంటారు. అదేవిధంగా పంచాయతీరాజ్ రోడ్లు కూడా ఆర్ అండ్ బి తీసుకుంటుందని తెలిసి మేము ఆర్ అండ్ బికి లిస్ట్ పంపడం జరిగింది. ఆరు మాసాలైనా ఆ ఊసే లేదు. వారు మాకు సరైన సమాధానం కూడా ఇవ్వలేదు. మన స్టేట్ రోడ్ల గురించి ఈ రిపోర్టులో పొందుపరచారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్‌లైన్స్ రోడ్లు వేస్తామని చెప్పడం జరిగింది. నా నియోజకవర్గంలో ఆ ఊసే లేదు. అది ఇగ్నోర్ అవుతుందా, నెగ్లెక్ట్ అవుతుందా నాకు తెలియదు కానీ, ఒక్క రోడ్డు కూడా ఎక్కడా వేయలేదు. ఆ విషయంలో కూడా మీరు దృష్టిసారించాలి. పంచాయతీ రోడ్లను ఆర్ అండ్ బిలో తీసుకునేలాగ అయితే మీరు దాన్ని తప్పకుండా ప్రయారిటీగా తీసుకోవాలి. గత సంవత్సరం మీరు ఏవైతే ప్రతిపాదనలు పంపారో జహీరాబాద్ నుంచి కర్నూల్ రోడ్డు గురించి దాన్ని కూడా మీరు జాతీయ రహదారి చేసేలా చూస్తారని నేను కోరుతూ, మా సమస్యలను తప్పకుండా నెరవేరుస్తారని స్పీకర్ గారి ద్వారా మీకు తెలియజేస్తున్నాను.

శ్రీ హనుమంత్ షిండే (జుక్కల్):- అధ్యక్షా, జుక్కల్ నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత రూ. 200 కోట్లు రోడ్ల కోసం మంజూరు చేయడం జరిగింది. జహీరాబాద్, బీదర్ రోడ్డు కు ఏదైతే 25 కి.మీ.లు నేషన్ హైవే వేశారో దానికి కనెక్ట్ చేస్తూ నిజామాబాద్, బోధన్, మద్నూరు రోడ్డుకు 76 కి.మీ.లు రోడ్డు హైవే ఉన్నది. కాబట్టి జుక్కల్ నియోజక వర్గం ద్వారా బీదర్‌కు కనెక్ట్ చేస్తే బాగుంటుంది. మీ ద్వారా మంత్రిగారు కన్‌సిడర్ చేయాలని కోరుతున్నాను.

శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి (ఇబ్రహీంపట్నం):- అధ్యక్షా, హైదరాబాద్ నుంచి నాగార్జున సాగర్ రోడ్డు 160కిలోమీటర్లు స్టేట్ హైవే ఉన్నది. ఇటీవల నేషనల్ హైవేగా 2776 కిలోమీటర్లు గుర్తించి శాంక్షన్ చేయడం జరిగింది. అందులో భాగంగా 160 కిలో మీటర్లు ఉన్న రోడ్డును ఫోర్ లైన్ రోడ్డుగా వేస్తే ఇంటర్ స్టేట్‌కు లింక్ పోతుందని మనవి చేస్తున్నాను. ఇది చాలా పురాతనమైనటువంటి రోడ్డు. యాచారం నుంచి కందుకూరుకు ఒక రోడ్డును ఏర్పాటు చేయవలసినదిగా కోరుతున్నాను. అదే విధంగా తక్కల పల్లి నుంచి మేడి పల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద ఆ రోడ్లను కూడా వేయవలసినదిగా కోరుతున్నాను. దయచేసి ఈ సారి బడ్జెట్‌లో వీటి కోసం నిధులు కేటాయించ వలసినదిగా కోరుతున్నాను.

శ్రీ ఆర్. రవీంద్రకుమార్ (దేవరకొండ):- అధ్యక్షా, కోదాడ, మిర్యాలగూడ మీదగా దేవరకొండ నుండి కల్వకుర్తి-జడ్చర్ల రోడ్డును నేషనల్ హైవేగా గుర్తించినందుకు గౌరవ మంత్రిగారికి, ముఖ్యమంత్రిగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ రోడ్డు కేవలం వంద మీటర్లుకు మాత్రమే పరిమితం అయి ఉన్నది. దానిని ఫోర్ లైన్ రోడ్డుగా చేస్తే బాగుంటుంది. అదే విధంగా దేవరకొండలో గత ప్రభుత్వం ఉన్నప్పుడు రోడ్డు వైన్‌డింగ్ చేశారు. కానీ, నాసిరకంగా పనులు చేసినందువలన మధ్యలో డివైడర్లు పెట్టారు. అక్కడే ప్రక్కన ఉన్న కరెంట్ పోల్స్‌ను తొలగించకపోవడం వలన రోజు అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మొత్తం పాడైపోయింది. ఈ విషయమై మంత్రిగారు ఆలోచన చేయాలి. ఇబ్రహీంపట్నం ఎం.ఎల్.ఎ గారు చెప్పినట్లుగా నాగార్జునసాగర్ రోడ్డును నేషనల్‌హైవేగా చేయాలి. నాగార్జున సాగర్ పర్యాటక కేంద్రం కాబట్టి ఆ రోడ్డును ఫోర్‌లైన్ రోడ్డుగా చేయమని అడుగుతున్నాను.

శ్రీ వై.అంజయ్య (షాద్‌నగర్):- అధ్యక్షా, తెలంగాణ వస్తే ఏం వస్తుందని చాలా మంది హేళన చేసిన సందర్భాలు చూశాను. గౌరవ ముఖ్యమంత్రి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో అందుకు ఈ రోడ్లే నిదర్శనం. రీజనల్ రింగ్ రోడ్డును షాద్‌నగర్ ద్వారా వేసినందుకు ముఖ్యమంత్రిగారికి, మంత్రిగారికి ధన్యవాదాలు. షాద్‌నగర్ ద్వారా హైదరాబాద్ నుంచి బెంగళూరు నేషనల్ హైవే ఉన్నది. బాంబేకి వెళ్లవలసిన వాహనాలు కూడా షాద్ నగర్ నుంచే వెళతాయి. షాద్ నగర్ చుట్టూ రింగ్ రోడ్డును ఏర్పాటు చేస్తే బాగుంటుందని మీ ద్వారా మంత్రి గారిని కోరుకుంటున్నాను. పాత నేషనల్ హై వే ఉన్నది. కొత్తూరు దగ్గర చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్.ఒ.పి కూలిపోయి చాలా ఇబ్బంది అవుతుంది కాబట్టి ఆ రోడ్డును బాగు చేయవలసినదిగా కోరుతున్నాను. షాద్‌నగర్ నుంచి మక్తల్ ఆర్ అండ్ బి రోడ్డుపై ఉన్న రైల్వే ట్రాక్ దగ్గర చాలా ఇబ్బందిగా ఉన్నది. దాని మీద చర్యలు తీసుకోవలసినదిగా కోరుతున్నాను.

శ్రీ ఎన్.దివాకర్ రావు (మంచిర్యాల):- తెలంగాణ గడ్డ మీద పుట్టిన బిడ్డలు ఎవరైతే ఈ ప్రభుత్వాన్ని గెలిపించారో వారి కోసం గౌరవ ముఖ్యమంత్రిగారు కష్టపడి ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ఎనలేని కృషి చేస్తున్నారు. అందుకు ముఖ్యమంత్రిగారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు. ఇటీవల నేషనల్‌హైవేగా 2776 కిలోమీటర్లు చేసినందుగా ముఖ్యమంత్రిగారికి, మంత్రిగారికి, కేంద్రమంత్రిగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మంచిర్యాల, చంద్రాపూర్ రోడ్డు

కోసం 90కిలోమీటర్లు రోడ్డుకు రూ.1500కోట్లు కేటాయించారు. ఆ రోడ్డు మంచిర్యాల నుంచి కాకుండా నాకున్న సమాచారం ప్రకారం కోల్‌బెల్ట్ నుంచి పోతుంది. దయచేసి ఈ రోడ్డును మంచిర్యాల నుంచి మందమర్రి దాకా కలపవలసినదిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. మంచిర్యాల జిల్లాకు బైపాస్ రోడ్డును ఏర్పాటు చేయవలసినదిగా కోరుతున్నాను. అదే విధంగా ఆర్ అండ్ బి రోడ్డు భసంత్ నగర్ నుంచి అంతరాం దాకా ఉంది. మంచిర్యాల నుంచి అంతరాం దాకా గోదావరి నది మీద ఒక బ్రిడ్జి కట్టాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పి.బాబుమోహన్ (అందోల్):- అధ్యక్షా, సంగారెడ్డి నుండి నాందేడ్ రోడ్డు ఎన్నో ప్రమాదాలతో కూడుకొని ఉన్నది. అక్కడ చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు నా నియోజకవర్గంలో 5,6 మండలాలను కవర్ చేసుకుంటూ పోతుంది. ఈ రోడ్డు కోసం రూ.2500కోట్లు మంజూరయ్యాయి. ఈ డబ్బును మంజూరు చేసిన ముఖ్యమంత్రిగారికి, మంత్రిగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**1.50 మ.** శ్రీ పాయం వెంకటేశ్వర్లు:- నా నియోజక వర్గంలో రెండు రోడ్లున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎన్.హెచ్. రోడ్లు గాని మిగతా రోడ్లు గాని చాలా బాగున్నాయి. నా అశ్వరావు పేట నియోజకవర్గం ప్రక్కనే 3 కిలోమీటర్ల దూరంలో ఆంధ్ర బార్డర్ ఉంది. ఆ బార్డర్ దాటి ఒక్క అడుగు ముందుకు వేసినా విపరీతమైన ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉంది. మన రాష్ట్రంలో చాలా చోట్ల రోడ్లు బాగున్నప్పటికీ, నా నియోజక వర్గంలో పి.ఆర్. రోడ్లు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయి. విలేజ్ నుంచి విలేజ్‌కు వెళ్లాలంటే రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రధానంగా ఆర్.అండ్.బి.లో ఉన్న రోడ్డు ముల్కలపల్లి మండలం టు అనుబాటుపల్లి ఈ మధ్యనే కొత్తగా వచ్చిన మండలం ఇది. అలాగే చంద్ర గోండు మండలం 44 కిలో మీటర్లు ఉంది. దాన్ని ఆర్.అండ్.బి. వారు టేకోవర్ చేశారు. ఈ మండలాలన్నింటికి రోడ్లు ఇవ్వాలని మంత్రి గారిని కోరుతున్నాను. జగన్నాధపురం టు తోపుగూడెం, మల్కారి టు తిరుమలకొండ, మర్రిగూడెం టు శాంతి నగర్, చెన్నాపురం టు పట్వారి గూడెం ఇంకా చాలా రోడ్లున్నాయి, వాటిని కూడా ఇవ్వాలని కోరుతున్నాను.

శ్రీ డి.మనోహర్ రెడ్డి (పెద్దపల్లి):- ఒక ప్రాంత అభివృద్ధికి రహదారులే ముఖ్య ఆధారం.పెద్దపల్లి కొత్త జిల్లాగా ఏర్పడిన సందర్భంలో, పెద్దపల్లి నుంచి హైదరాబాద్ మీదుగా వెళ్లే రాజీవ్ రోడ్డును నేషనల్ హైవేగా మార్చినట్లైతే సౌకర్యంగా ఉంటుంది. రాజీవ్ రోడ్డు ప్రమాదాలకు నెలవై నిత్యం చాలా మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. పెద్దపల్లి నుంచి వరంగల్‌కు ఒకదారి, జగిత్యాల నుంచి పెద్దపల్లి మీదుగా భూపాల్ పల్లికి ఒక దారిని వేస్తే సౌకర్యంగా ఉంటుందని మీ ద్వారా గౌరవ మంత్రి గారికి మనవి చేస్తున్నాను.

శ్రీమతి కోవా లక్ష్మి (ఆసిఫాబాద్):- తెలంగాణ జాతీయ రహదారులను శాంక్షన్ చేయించినందుకు ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు. మంచిర్యాల నుంచి మందమర్రి బెల్లంపల్లి, మహారాష్ట్ర బార్డర్ అయిన చంద్రాపూర్ నుంచి కొమురం భీమ్ జిల్లా వరకు రోడ్ శాంక్షన్ చేయడం, అలాగే పరకాల, కాళేశ్వరం, ఏటూరి నాగారం నుంచి మా కొమురం భీమ్ జిల్లా సిర్‌పూర్ కాగజ్ నగర్‌కు కలిపినందుకు ముఖ్యమంత్రి గారికి మా ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాను.

శ్రీ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి (జనగాం):- తెలంగాణ రాష్ట్రం తెచ్చుకొని 2,776 కిలోమీటర్ల జాతీయ రహదారులను శాంక్షన్ చేయించుకోవడం చాలా హర్షించదగ్గ విషయం. చేస్తున్న ఈ పని తెచ్చుకున్న తెలంగాణకు నిలువెత్తు నిదర్శనం. యాదాద్రి నుంచి గోదావరి వరకు 4 లైన్ రోడ్డు కోసం కేంద్ర మంత్రి గడ్కరీ గారిని పిలిచి శాంక్షన్ చేయించారు, పని కూడా లక్షణంగా జరుగుతోంది. ఒక చిన్న విన్నపం ఏమంటే ఏనాడో 100, 150 సంవత్సరాల క్రితం పెట్టిన చెట్లు అక్కడున్నాయి. ఆ రోడ్డు వైడెనింగ్ కోసం సెంటర్ నుంచి అటు ఇటు వంద ఫీట్లు పోగా ఇంకా 70,75 ఫీట్లు వైడెనింగ్ జరుగుతోంది. 200 ఫీట్ల రోడ్డది. ఈ 75 ఫీట్లలో రోడ్డు నిర్మాణం జరగాలి. చెట్లు పోకుండా కాపాడుతూ రోడ్ల నిర్మాణం చేస్తే బాగుంటుంది. చెట్ల ఆకారం 8 నుంచి 10 ఫీట్లు ఉంటాయి, అంటే చెట్లు అంతగా పెరిగాయి. నా నియోజక వర్గంలో మండలం నుంచి హెడ్ క్వార్టర్ వరకు రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు శాంక్షన్ చేయడం హర్షించదగ్గ విషయం. శాంక్షన్ చేసిన బిట్‌లో ముత్యాల టు వడ్లకుంట వరకు శాంక్షన్ చేశారు. అందులో 6 కిలోమీటర్లు మిస్ అయింది. ఆ విషయాన్ని మంత్రి గారి దృష్టికి కూడా తీసుకురావడం జరిగింది. దాన్ని ఇన్‌క్లూడ్ చేసి రోడ్డు వేయించాల్సిందిగా మంత్రి గారికి మనవి చేస్తున్నాను.

శ్రీ చల్లా వంశీచంద్ రెడ్డి (కల్వకుర్తి):- ముఖ్యమంత్రి గారు రీజినల్ రింగు రోడ్డును 338 కిలోమీటర్లతో ఏర్పాటు చేస్తామని చెప్పడం జరిగింది. ప్రస్తుతమున్న ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఈక్విటీ స్ట్రెచ్‌లో తీసుకొని మా నియోజక వర్గంలోని కొత్తగా ఏర్పడ్డ కడ్తాల మండల కేంద్రం నుంచి ఈ రోడ్డు వెళ్లే విధంగా చేయాలి. తుక్కుగూడా నుంచి అచ్చంపేటకు ఒక జాతీయ రహదారి ఉంది. ఆ రహదారి కల్వకుర్తి

నుంచి 3 కిలోమీటర్ల దూరంలో కొత్రా గేట్ దగ్గర లెఫ్ట్‌కు వెళుతుంది. కేవలం 3 కిలో మీటర్లలో కల్వకుర్తి హెడ్ క్వార్టర్ ఉంది. ఆ రోడ్డు డబుల్ రోడ్డు, హైవే రోడ్డు ట్రిబుల్ రోడ్డు, కాబట్టి కొత్రా గేట్ నుంచి కల్వకుర్తి వరకు నేషనల్ హైవే ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

శ్రీ ఎ.రేవంత్ రెడ్డి (కొడంగల్):– రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్డు చేస్తామని ఒక స్కీమ్ తీసుకుంది. ఆర్ అండ్ బి రోడ్లను కూడా చేసింది. పంచాయితీ రాజ్ డిపార్ట్‌మెంట్ నుంచి ఆర్ అండ్ బి డిపార్ట్‌మెంట్‌కు రోడ్లు ట్రాన్స్‌ఫర్ చేస్తే తప్ప డబుల్ రోడ్లను చేయడానికి లేదు. దౌలతాబాద్ మండలం నుంచి బొమ్మరాజ్ పేట్, అక్కడ నుంచి వికారాబాద్‌కు, కొత్త జిల్లాకు మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి ఇవ్వాల్సిన డబల్ రోడ్డును పంచాయితీ రాజ్ నుంచి ఆర్.అండ్.బికి ట్రాన్స్‌ఫర్ చేసి డబల్ రోడ్డు చేయాలి. దామరచింత మండలం నుంచి మహబూబ్ నగర్‌కు వయా మద్దూల్ కోయిల్‌కొండల్ పోవాలి. దాన్ని కూడా పంచాయితీ నుంచి ఆర్.అండ్.బి.కి మళ్లించి డబల్ రోడ్ చేయించాలి. కోస్గి మండలం హెడ్ క్వార్టర్‌లో కూడా ఒకటిన్నర కిలోమీటర్ ఆర్.అండ్.బి.లోనే ఉంది. వైడెనింగ్ అండ్ డబల్ రోడ్డు కోసం మండల కేంద్రం నుంచి జిల్లా హెడ్ క్వార్టర్‌కు ఇవ్వాల్సింది కూడా పెండింగ్‌లో ఉంది, దాని వివరాలు అధికారుల దగ్గర ఉన్నాయి. ఈ మూడు అంశాలను మంత్రిగారు దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ కె. జానా రెడ్డి(నాగార్జునసాగర్):– జాతీయ రహదారుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన విషయాన్ని చెప్పారు, చాలా సంతోషం. జాతీయ రహదారులను మంజూరు చేయించినందుకు, ఇచ్చినందుకు వారికి, తెచ్చినందుకు మీకు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ మొదలు పెట్టని విషయాన్ని వారు ప్రశ్నించారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని రహదారుల మంత్రి గారు ఇచ్చిన నోట్ విషయంలో నేను కొన్ని అంశాలను లేవనెత్తుతున్నాను. 13,380 ప్రణాళికలు, అనుమతులు పూర్తి చేసి మొదలవుతున్న విషయం, ముఖ్య పట్టణాల కోసం 5,634 రెండు వరుసల రోడ్లు, మండల జిల్లా కేంద్రాలకు 2,466, ఇవి ప్రణాళికలా, లేక మంజూరు చేసినవా అని అడుగుతున్నాను.

**2.00 మ.** మీరు మంజూరు చేసింది రూ. 8,100 కోట్లు. హరిత హారం కార్యక్రమాన్ని పెద్ద మొత్తంలో ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. దానికి రూ. 123 కోట్ల మంజూరు చేశామని చెబుతున్నారు. రెండూ కలిపి రూ. 8223 కోట్లు అవుతుంది. అదే విధంగా రూ. 13380 కోట్లు రోడ్లకు, వంతెనల నిర్మాణానికి, మంజూరు చేశామని అన్నారు. రూ. 8223 కోట్లు మరియు రూ. 13380 కోట్లు కలిపితే రూ. 21,603 కోట్లు అవుతుంది. ఆ డబ్బును మీరు శాంక్షన్ చేసినట్లా చేయనట్లా? రూ. 1800 కోట్లు పునరుద్ధరణ పనులకు పే చేశామని అంటున్నారు. రెన్యువల్స్ కాకపోతే రూ. 21,603 కోట్లు మంజూరు చేశారు, రెన్యువల్స్‌తో కలుపుకుంటే రూ. 23403 కోట్లు మంజూరు చేశారు. వీటిలో కృష్ణా, గోదావరి పుష్కరాలకు రూ. 591 కోట్లు కేటాయించారు. ఆ డబ్బు ఇందులో కలపలేదు. ఆ రూ.1800 కోట్లు మరియు ఈ రూ. 591 కోట్లు కలిపితే రూ. 2391 కోట్లు అవుతుంది. ఆ డబ్బు మీరు పే చేసి ఉండాలి. రూ. 2391 కోట్లతోబాటు, నాలుగు వేల కోట్ల రూపాయలు పేమెంట్ చేశామంటున్నారు. పుష్కరాలకు ఖర్చుపెట్టింది, పునరుద్ధరణకు ఖర్చుపెట్టింది తీసివేస్తే, రూ. 4250 కోట్లు ఇప్పటివరకూ ఎక్స్‌పెండిచర్ అయినట్లుగా అర్థం అవుతుంది. వాటిని కలుపుకుంటే రూ. 6600 కోట్లు అయినట్లు అవుతుంది. ఈ విషయమై క్లారిటీగా చెప్పాలి.

అధ్యక్షా, సంవత్సరానికి మీరు రూ. 1400 కోట్లు ఖర్చు పెట్టినట్లు అవుతుంది. మూడు సంవత్సరాలకు రూ. 5200 కోట్లు ఖర్చు పెట్టారు. యావరేజ్‌గా మొత్తం రూ. 18000 కోట్లు అవుతుంది. ఇంకా రెండు సంవత్సరాలు ఉంది. ఇంకా రూ.1600 కోట్లుతో పనులు కావలసి ఉంది. మనకున్న సమయం రెండు సంవత్సరాలు. ఈ విధంగా చేస్తే, సుమారు 8-9 సంవత్సరాలలో ఈ కార్యక్రమాలు పూర్తవుతాయి. అంటే వచ్చే అయిదు సంవత్సరాలు కూడా ఇవే పనులు జరిగే పరిస్థితి ఉంది. మీరు చెబుతున్నది కొంచెం గందరగోళంగా ఉంది. చాలా నిధులు మంజూరు చేశారు, ఇంకా మంజూరు చేస్తే బాగుంటుందని గౌరవ సభ్యులు మాట్లాడారు. యాభై సంవత్సరాల కొకసారి లక్ష కోట్ల రూపాయలకు శాంక్షన్స్ ఇచ్చి, అద్భుతంగా పనులు జరుగుతున్నాయని చెప్పడం అంటే గందరగోళంగా ఉంటుంది. ప్రజలకు అర్థం కాకుండా ఉంది. ఈ పనులు ఎప్పుడు జరుగుతాయి, జరిగితే, ఆశించిన పద్ధతులలో ఎప్పుడు అవుతాయని ప్రజలలో ఆందోళన ఉంది. మీకు ఒక ఎగ్జాంపుల్ చెబుతున్నాను. వట్టంపల్లి, సోమశిల ప్రాజెక్టుకు సంబంధించిన పనులు మొదలుపెట్టలేదు, వాటికి ఎప్పుడో నిధులు మంజూరు చేశారు. ఆ పనులు ఇప్పుడు చేయవలసి ఉంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత సాధించిన ప్రగతి అని ఈ నోట్‌లో ఉంది. ఇది ప్రగతా? ప్రణాళికా? ప్రగతి అంటే ఇప్పటికే అభివృద్ధి సాధించాలి. ఈ ప్రణాళిక ఎప్పుడు అవుతుంది, ఎట్లా అవుతుందనేది మీరు మాకు తెలియజేయాలి. హరిత

ప్రమాణాలకు పర్యావరణ హిత నిర్మాణాలకు అనువుగా రహదారుల నిర్మాణం అని అన్నారు. దక్షిణ భారతదేశంలోనే మొదటి సారిగా తీగలతో గోదావరి పై పర్ణశాల వద్ద, మానేరు పై కరీంనగర్ వద్ద వంతెనల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. దీనికి సంబంధించి టెండర్స్ పిలిచారా, అగ్రిమెంట్ చేసుకున్నారా? దీనికి ఎంత డబ్బు అవుతుంది? నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ మరియు పశు పక్ష్యాదుల తాగునీటి అవసరాలకి 150 రహదారులలో చెక్‌డ్యామ్‌లతో వంతెనల నిర్మాణం చేశామన్నారు. ఇది ఒక ప్రణాళిక. దీనికి ఎంత డబ్బు ఖర్చుపెట్టాలి? ప్రగతి సాధించామని అంటున్నారు. మేము కూడా సూచనలు ఇవ్వాలి. మాకు అర్థం కాలేదు. రూ. 21 వేల కోట్లు ఎక్స్‌పెండీచర్ పెట్టారు. మూడు నెలలో ఎంత ఎక్స్‌పెండీచర్ అయ్యింది? మీరు డబ్బు మంజూరు చేసేందుకు ఎన్ని సంవత్సరాలు పడుతుంది? పదిహేను సంవత్సరాలకు సంబంధించిన ప్రణాళికను మా ముందు పెట్టారు. ప్రగతి జరుగుతుందని చెబుతున్నారు. ఈ విషయాలపై మంత్రి గారు క్లారిఫై చెయ్యవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు : అధ్యక్షా, ఇంచుమించు సభలో ఉన్న వారందరూ మాట్లాడారు. అందరికీ ధన్యవాదాలు. మనం అందరం కూడా చాలా రోజులుగా రాజకీయాలలో ఉన్నాము. మా గురువు గారు జానారెడ్డి గారు నా చిన్నతనం నుండీ రాజకీయాలలో ఉన్నారు. వారు ఆర్ అండ్ బీ మినిస్టర్‌గా పనిచేశారు. నేను కూడా గతంలో కొద్ది రోజులు ఆర్ అండ్ బీ మినిస్టర్‌గా పనిచేశాను. వాజ్‌పాయ్ గారి ఆధ్వర్యంలో, గోల్డన్ క్వాడ్రిలేటరల్ పేరుతో పెద్ద రోడ్లకు శ్రీకారం చుట్టడం జరిగింది. అందుకు మనం వారిని అభినందించాలి.

**2.10 ము.** రెండు ప్రధాన జాతీయ రహదారులు బెంగుళూరు, బాంబే రోడ్డు గానీ, మద్రాసు- కలకత్తా రోడ్డు గానీ ఆయన హయాంలోనే వచ్చాయి. ఆరోజుల్లో నేను కూడా రెండు సంవత్సరాలు ఈ శాఖలో మంత్రిగా ఉన్నాను. కుందూరిగారు అప్పుడు ఉపరితల రవాణా శాఖ మంత్రిగా ఉన్నారు. ఆ రోజుల్లో 300, 400 కిలో మీటర్ల రోడ్లు మంజూరు చేయించుకోవాలంటే చాలా కష్టంగా ఉండి ఆ సమయంలోనే ఈనాడు భద్రాచలానికి పూర్తవుతున్న జగ్‌తల్‌పూర్ రోడ్డు గానీ అదే విధంగా ఆంధ్రలో కోస్టల్ రోడ్డు గానీ వాజ్‌పాయి గారి టైంలోనే ఎక్స్‌ప్ట్ గోల్డెన్ కో – ఆర్డినేటర్ కాకుండానే ఈ రాష్ట్రానికిచ్చారు. మళ్లీ ఎన్‌డీయే ప్రభుత్వం కావచ్చు, ముఖ్యంగా గడ్కరీ గారు ముఖ్యమంత్రిగారి కోరిక మరియు పట్టుదలతో అన్ని నియోజకవర్గాలలో ఆ రహదారులు మంజూరై వారి వారి నియోజకవర్గాల నుంచి పోతున్నాయనే సంకేతం సభ్యులు మాట్లాడిన దానిని బట్టి తెలుస్తున్నది.

ఆ రోజుల్లో 200, 300 కిలోమీటర్లు జాతీయ రహదారులుగా ప్రకటించుకోవాలంటే మన రాష్ట్రం చాలా ఇబ్బంది పడిన మాట వాస్తవం. కానీ ఈనాడు రెండు సంవత్సరాల లోపల మన ముఖ్యమంత్రి గారి పట్టుదల, గడ్కరీ గారి దూరదృష్టి, జాతీయ రహదారుల పట్ల వారికున్న అవగాహన, గతంలో ఆయన కూడా మహారాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా పనిచేసిన అనుభవంతో మనం ఎన్ని ప్రపోజల్స్ పెడితే అన్నింటినీ మంజూరు చేశారు. వాస్తవంగా చెప్పాలంటే ప్రస్తుతం మన రాష్ట్రం నుంచి ప్రపోజల్స్ లేవు. మళ్లీ రేపటి నుంచి పంపించాలి. ప్రపోజల్స్‌ను పంపిన మరుసటి రోజునే గౌరవ ముఖ్యమంత్రి గారు నా శాఖకిచ్చిన సహకారం గానీ నేనెప్పుడు అడిగితే అప్పుడు ప్రధానమంత్రిగారిని గానీ గడ్కరీ గారి దగ్గరికి గానీ రమ్మంటే వెంటనే సాక్షాత్తూ ముఖ్యమంత్రి గారు నాలుగైదు సార్లు నాతోబాటు ఢిల్లీకి వచ్చారు. గడ్కరీ గారు మన రాష్ట్రానికి వచ్చినప్పుడు కూడా నాలుగైదు సార్లు ముఖ్యమంత్రిగారు మాట్లాడారు.

రెండు రహదారులలో సాక్షాత్తూ ముఖ్యమంత్రి గారు డిజైన్ చేసిన రెండు రహదారులున్నాయి. వీటి గురించి నేను కూడా ఆలోచించలేదు. అవి కేంద్రప్రభుత్వం మంజూరు చేస్తుందని, వచ్చే అవకాశమున్నదని నేను అనుకోలేదు. అందుట్లో మరీ ముఖ్యంగా భద్రాచలంలోని సారపాకనుంచి ఏటూరు నాగారం మీదుగా కాళేశ్వరం మీదుగా కౌతాల వరకు 390 కిలోమీటర్ల రహదారికి సంబంధించి నేను మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి గారు నన్ను పిలిచి మనకు ఈ రహదారి కావాలి, దీంట్లో అనేక సమస్యలు పరిష్కారమవుతాయి, ఇప్పుడు కట్టేటటువంటి గోదావరి ప్రాజెక్టులన్నీ మనకు ఈ గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్నాయి. నది వెంబడి మనకు రహదారి లేకపోవడం వలన అభివృద్ధిలో గానీ భవిష్యత్తులో శాంతిభద్రతల సమస్య కూడా మనకు ఉన్నందున నేనే ఢిల్లీ వస్తానని సాక్షాత్తూ కేంద్ర హోంమంత్రి గారిని, గడ్కరీ గారిని ఆయొక్క అవసరాన్ని, అత్యవసరాన్ని గుర్తించి వెంటనే మంజూరు చేయమని కోరితే కేంద్ర ప్రభుత్వం పెద్దమనసుతో ఆ రహదారి మంజూరు చేయడమే కాకుండా దానికి ఎన్.డబ్ల్యూ నిధులు కూడా వారే ఇస్తాం మీరు డీ.పీ.ఆర్. పంపించమని చెప్పారు. ఆ ఘనత గానీ, ఆ పట్టుదల గానీ మన రాష్ట్రముఖ్యమంత్రి గారికి దక్కుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అంతే కాకుండా హైదరాబాదు నగరం అభివృద్ధిని, ఈ రాష్ట్ర అవసరాలను దృష్టిలో పెట్టుకొని వచ్చేటటువంటి జాతీయ రహదారులన్నీ ఇప్పుడున్నటువంటి ఓఆర్.ఆర్‌కి అనుసంధానం

అయినా దానికంటే ముందుగా ఇంకొక రీజినల్ రింగ్ రోడ్డును తీసుకుంటే హైదరాబాదు అభివృద్ధికి, తెలంగాణ అభివృద్ధికి సాధ్యపడుతుంది కాబట్టి ఎట్టి పరిస్థితులలో మీరు దీనిని డిజైన్ చేయమని 336 కిలోమీటర్ల గురించి ఇందాక సభ్యులు జానారెడ్డి గారు గానీ, వంశీచంద్ రెడ్డి గారు గానీ అడిగినటువంటి రహదారులు అన్ని జిల్లాలను కవర్‌చేసే విధంగా ఈ జాతీయ రహదారిని ప్రకటించడమే కాకుండా అది ఫోర్ లేన్ రోడ్డుగా నిర్మాణం చేస్తామని చెప్పారు. దానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం పక్షాన కేంద్ర ప్రభుత్వానికి, గడ్కరీ గారికి మరియు మాకు సహకరించిన మా ముఖ్యమంత్రి గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

నేను గౌరవించే శాసనసభ్యులలో చిన్నారెడ్డి గారు ఒకరు. కానీ దురదృష్టమేమిటంటే వారు కొంచెం బాధగా మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాకు ఈ రెండున్నర సంవత్సరాలలో రహదారులకు అధిక ప్రాధాన్యతనిచ్చాం. ఇందాక జానారెడ్డి గారు చెప్పిన రూ.13 వేల 380 కోట్లలో మహబూబ్‌నగర్ జిల్లాకు రూ. 1855 కోట్లు రహదారుల గురించి మంజూరు చేయడం జరిగింది. అంతేకాకుండా వారు అడిగిన రహదారులకు సంబంధించి కూడా నిధులు కేటాయించాం. నిన్న సీ.ఆర్.ఎఫ్. వస్తే కూడా ఆ జిల్లాకే నిధులు ఎక్కువ కేటాయించాం. మహబూబ్‌నగర్ జిల్లాలో చాలా మండల కేంద్రాలు సింగిల్ రోడ్‌లో ఉన్నాయి. కొన్ని బి.టి రోడ్లు లేని మండల కేంద్రాలు కూడా ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఉంటే ముఖ్యమంత్రి గారు పట్టుబట్టి ఈ నియోజకవర్గం, ఆ నియోజకవర్గం అని కాకుండా, ఈ పార్టీ, ఆ పార్టీ అనకుండా అన్ని మండల కేంద్రాలకు డబుల్ రోడ్లు శాంక్షన్ చేయండి ఎంతైతే అంత ఖర్చు పెడదామని చెప్పారు.

ఇందాక గీతారెడ్డి గారు అడిగిన ఆంధోల్ మండల కేంద్రానికి కూడా శాంక్షన్ చేశాం. న్యాల్కల్ మండల కేంద్రానికి కూడా డబుల్ రోడ్డు శాంక్షన్ చేశాం. ఇవి కాకుండా రూ.19 కోట్లు వారి నియోజకవర్గానికి శాంక్షన్ చేశాం. అదే విధంగా వారు ఇందాక ఒక నేషనల్ హైవే చాలా బ్యాడుగా ఉందని చెప్పారు. మీ గ్రామానికి రూ.10 కోట్లు ఇచ్చాం, సదాశివపేటకు కూడా రూ.5 కోట్లు ఇచ్చాం. వీటన్నింటికి టెండర్లు పిలుస్తున్నాము. ఈ రకంగా ఈ సభలో ఉన్న సభ్యులందరూ ఒకసారి గమనిస్తే రహదారులకు సంబంధించి జానారెడ్డి గారు అడిగారు. మేం శాంక్షన్ చేసిన మాట, ఈ రకంగా డిజైన్ చేసిన ప్రకారం నిర్మాణం చేయాలనే మాట వాస్తవం. కానీ మొదటి సంవత్సరం డిలే అయింది. ఎందుకంటే గతంలో వేసిన రహదారుల నాణ్యత వాటియొక్క డ్యూరబిలిటీని దృష్టిలో పెట్టుకుంటే ఒక్క వర్షాకాలానికే రహదారులు చెడిపోయిన పరిస్థితిని మనం గమనించాం. అందువల్ల ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని మేం వేయబోయే రోడ్లు స్టేట్ రోడ్లు అయినప్పటికీ జాతీయ రహదారుల స్టాండర్డ్స్ ప్రకారం చేయాలని తీసుకున్నప్పుడు గతంలో ఉన్న డ్రమ్మిక్స్ ప్లాంట్లు గానీ వాటికున్న ఇంప్లిమెంట్స్‌నన్నింటిని మార్చాల్సి వచ్చింది. అందువల్ల మొదటి సంవత్సరం మేం శాంక్షన్ ఇచ్చినా కూడా మొదలుపెట్టలేకపోయాము. ఆ పాత పద్ధతిలో మొదలు పెట్టడానికి నేను కూడా నిరాకరించాను. ఎందుకంటే అదే పద్ధతి పాటిస్తే డబ్బులు ఖర్చు అవుతాయి తప్ప రహదారులు నిలబడవు కాబట్టి జాతీయ రహదారుల స్టాండర్డ్స్ ఉంటేనే రహదారుల పనులు మొదలు పెట్టమని చెప్పాను. ఇప్పటికి సుమారు వంద బ్యాచ్ ఫిక్సింగ్ ప్లాంట్లు ఈ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యాయి. గౌరవ సభ్యుల నియోజక వర్గాలలో వేస్తున్న డబుల్ రోడ్లు ఏ రకంగా వేస్తున్నారనేది గమనించండి. మా ప్రభుత్వం వేసిన రహదారులు, గత ప్రభుత్వాలు వేసిన రహదారులను చూడండి. ఇప్పుడు ఎవరైనా డ్రమ్మిక్స్ వాడేవారుంటే వాటిని నిరోధించి పూర్తి స్టాండర్డ్స్‌లో వేయాలి. తెలంగాణ రహదారులు చూసి పక్క రాష్ట్రాలు అసూయపడే విధంగా రహదారుల నిర్మాణం ఉండాలనేది నా కోరిక. ఆ రకంగానే తయారు చేస్తున్నామని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

ఇందాక చిన్నారెడ్డి గారు మాట్లాడుతూ రహదారులకు సంబంధించి కేవలం ప్రకటనలు మాత్రమే వచ్చాయి తప్ప ఎక్కడా పనులు జరగలేదని చెప్పారు. ఇప్పటికే రూ.2 వేలా 690 కోట్లు జాతీయ రహదారుల్లో మనం శాంక్షన్ ఇవ్వడం, టెండర్లు పిలవడం, పనులు జరుగుతున్నాయి. గత రెండు సంవత్సరాలలో కూడా రూ.490 కోట్ల పనులు జరిగాయి.

కేంద్ర ప్రభుత్వాన్ని నేనెక్కడ అప్రిషియేట్ చేస్తున్నానంటే ఒక జాతీయ రహదారి ప్రకటించాలంటే సుమారు 10వేల వెహికల్స్ వెళితేనే జాతీయ రహదారిగా ప్రకటించాలి. అయినా సరే మనం ప్రకటించినవి లెక్క కూడా చూడకుండా ఒక్క రోడ్డును కూడా ఎలిమినేట్ చేయకుండా మన ముఖ్యమంత్రి గారు అడిగిన అన్ని రహదారులను వెంటనే శాంక్షన్ చేసింది గడ్కరీ గారు కాబట్టి వారికి మళ్లీ ఒకసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

గడ్కరీ గారు మొన్న ఐఆర్‌సీకి వచ్చినప్పుడు నేను డయాస్ మీద చెప్పిందేమిటంటే అయ్యా మీరు అనౌన్స్‌మెంట్ చేశారు, వాటికి నిధులు కావాలని అడిగితే వెంటనే రూ.8వేల కోట్లు ల్యాండ్ అక్విజీషన్‌కు కావలసిన నిధులను కూడా వారే ఇస్తామని, మమ్మల్ని కేవలం ల్యాండ్ అక్విజీషన్ చేసుకోమని చెప్పి సంగారెడ్డి – అకోలా

రోడ్డు, జగిత్యాల – కరీంనగర్ రోడ్డు, సూర్యాపేట – ఖమ్మం, కోదాడ – ఖమ్మం, మంచిర్యాల - చంద్రాపూర్, మన్నెగూడ రోడ్లకు సంబంధించి తెల్లారే ఫైనాన్స్ మీటింగ్ పెట్టుకొని ఆయన ఢిల్లీకి వెళ్లి మా ఇ.ఎన్.సి. గారిని ఢిల్లీకి పిలిపించుకొని ఆర్డర్ ఇచ్చారు. ఈ ప్రభుత్వం యొక్క పట్టుదల, పర్స్యూయేషన్ వల్ల సాధించుకోగలిగాం. మీరందరూ అభినందించాలి. వీటన్నింటిని పూర్తి చేసే బాధ్యత కూడా శాసనసభ్యులు తీసుకోవాలి.

2.20 ని. కోదాడ – మిర్యాలగూడ – జడ్చర్ల ఇచ్చాము. కల్వకుర్తికి మీరు ప్రపోజ్ చేయలేదు. మనం ఇప్పుడు ప్రపోజ్ చేస్తున్నాము. నిన్న కూడా ఒక ప్రపోజల్ వచ్చింది.

( అంత రాయం)

మిస్టర్ స్పీకర్: సైలెన్స్ ప్లీజ్.

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు: ఇందులో ఇచ్చిన 2700 కిలోమీటర్ల జాతీయ రహదారే కాకుండా గీతా రెడ్డి గారడిగిన 96 కిలోమీటర్లకు సంబంధించిన ఆర్డర్ కూడా మాకు నిన్న సాయంత్రం వచ్చింది. ఈ ప్రభుత్వం యొక్క పట్టుదల, పర్సుయేషన్ ఏవిధంగా ఉందనే విషయాన్ని ఆలోచించాలి. గౌరవసభ్యులు అడగకపోయినా ముఖ్యమంత్రి గారే ఆలోచించి స్వయంగా మ్యాపు గీసుకొని, ఏ ప్రాంతం ద్వారా జాతీయ రహదారి వెళ్తే ఈ రాష్ట్రానికి ఉపయోగమని, అడిగిన ప్రతి రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చేట్లుగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేసింది. మీరిచ్చిన అభినందనలతో ఈ పనులను అదే పట్టుదలతో పూర్తిచేసేందుకు పని చేస్తామని మనవి చేస్తున్నాను. జిల్లాల వారీగా, ప్రతి నియోజకవర్గంలో పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అవసరమున్న చోటల్లా మేము శాంక్షన్ ఇవ్వడం జరిగింది. మొదటి సంవత్సరంలో స్టాండర్డ్‌గా చేయాలని కొంచెం డిలే చేసి ఈ సంవత్సరం పనులు మొదలుపెట్టాము. 13,000 కోట్ల రూపాయలతో మొదలు పెట్టిన రోడ్లన్ని ఈ టర్మ్‌లో పూర్తవుతాయా లేదా? అనేది జానారెడ్డిగారి అనుమానం. జానారెడ్డి గారూ మట్టం పల్లి దగ్గర ఇచ్చిన బ్రిడ్జ్ సంవత్సరంలో అయిపోతుందని చెప్పారు. పది సంవత్సరాలైనప్పటికి ఆ ప్రాజెక్టు అవుతూనే ఉంటుంది. అయినా సరే ఈ ప్రభుత్వ కాలంలో గోదావరి, కృష్ణా, పెన్నేరు, మానేరు మీద తలపెట్టిన బ్రిడ్జిలన్నింటిని ఈ ప్రభుత్వమే పూర్తి చేస్తుందని మనవి చేస్తున్నాను. కరీంనగర్ కేబుల్ బ్రిడ్జిల విషయంలో టెండర్లు పిలిచాము, పర్ణశాల విషయంలో డి.పి.ఆర్. తయారయ్యింది. దానికి త్వరలోనే టెండర్లు పిలుస్తాము. పక్క రాష్ట్రాలకు అనుసంధానం అయ్యే రహదారులకే కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులుగా ప్రకటిస్తుంది. దాని నార్మ్స్ కు తగినట్లుగా ఉంటేనే రహదారులు మనకు వస్తాయి. కానీ, కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్రంపై ఉన్న మక్కువ, గతంలో జరిగిన అన్యాయం, దక్షిణ భారతదేశంలో అట్టడుగున ఉన్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం కాబట్టి, ముఖ్యమంత్రి గారు తెలియజేసిన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్రం ఈనాడు తెలంగాణను దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి స్థానానికి తీసుకెళ్లింది. అది రాష్ట్ర ప్రభుత్వం యొక్క ప్రయత్నం, ముఖ్యమంత్రి గారి పట్టుదల అని మీ అందరికి మనవి చేస్తున్నాను. మహబూబ్ నగర్ – కొడంగల్ – తాండూరు 96 కిలోమీటర్లకు నిన్న సాయంత్రం ఆర్డర్ వచ్చింది.

(అంతరాయం)

( అప్రిషియేట్ చేయమని అలా అడుగుతారెందుకు అని గౌరవ సభ్యులు శ్రీ ఎస్.ఎ .సంపత్ కుమార్ గారు అన్నారు )

సంపత్ గారు మీరు అప్రిషియేట్ చేయాల్సిన అవసరం లేదు, ప్రజలు అప్రిషియేట్ చేస్తే చాలు.

(అంతరాయం)

కొంత మంది సభ్యులు వారి వారి నియోజకవర్గాల్లో ఇంకా రోడ్లు కావాలని, జాతీయ రహదారులుగా ప్రకటించాలని అడిగారు. ఇప్పుడిచ్చినవన్ని పూర్తి చేసినందున మళ్లీ 2,000–2,500 కిలోమీటర్లకు వెంటనే ప్రపోజల్ తయారు చేసి ప్రాధాన్యత కలిగి రహదారులను కేంద్రానికి పంపించమని ముఖ్యమంత్రి గారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా మీకింకా అవసరమైతే మంజూరు చేస్తామని మాటిచ్చారు. గౌరవ సభ్యులిచ్చిన సూచనలకు అనుగుణంగా, ఆ ప్రాంతాల ట్రాఫిక్‌కు అనుగుణంగా, ప్రాంతాల ప్రాముఖ్యతని దృష్టిలో పెట్టుకొని, ఇంకా 2,000–2,500 కిలో మీటర్లకు వెంటనే కేంద్ర ప్రభుత్వానికి ప్రపోజల్స్‌ని పంపిస్తామని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. డ్రైపోర్ట్స్‌కు సంబంధించి కేంద్ర మంత్రి గారు ఇంట్రెస్ట్‌గా ఉన్నారు. డ్రైపోర్టులకు అనువైన ప్రాంతాలను గుర్తించడానికి ముఖ్యమంత్రి గారు యంగెస్ట్ అండ్ ఎర్నెస్ట్ అనే కన్సల్టెన్సీకి బాధ్యత అప్పగించారు. భువనగిరి, జహీరాబాద్, జడ్చర్ల మూడు ప్రాంతాలను వారు గుర్తించారు. డ్రైపోర్ట్‌ను ఏర్పాటు చేయాలంటే అక్కడ ఉన్న ప్రొడక్టివిటి, ఉత్పాదకతను బట్టి అవి ఏయే ప్రాంతాలకు పోతాయని, ఏ ఏ దేశాలకు పోతాయని, ఎక్కడ ఉంటే మనకు మేలు జరుగుతుందని ఆలోచించి ఈ మూడు ప్రాంతాలను గుర్తించారు. ఇంకా ఒకట్రెండు ప్రాంతాలను తెలియజేస్తామని చెబుతున్నారు. ఈ రిపోర్ట్ రాగానే రాష్ట్రప్రభుత్వం ఏది ప్రతిపాదిస్తే దానిని ఇస్తామని కేంద్ర మంత్రి గారు ప్రకటించారు. పూర్తి రిపోర్ట్

రాగానే కేంద్ర ప్రభుత్వానికి ప్రపోజల్స్‌ను పంపిస్తామని మనవి. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి గారు జాతీయ రహదారులతో పాటుగా వాటర్ వేస్‌కు ప్రాముఖ్యత ఇస్తున్నందున గోదావరి నదిపైన కట్టేటువంటి బ్రిడ్జిలన్నింటిని జల రవాణాకు అనుకూలంగా ఉండేలా, భద్రాచలం నుంచి ఏటూరు నాగారం, కౌతల, ప్రాణహిత మహారాష్ట్ర బోర్డరు దాకా కట్టేటువంటి ప్రాజెక్టులను, చెక్‌డ్యాములను, బ్రిడ్జిలను దానికి అనుగుణంగా డిజైన్ చేస్తున్నాము. కేబుల్ బ్రిడ్జిలు తీసుకురావడానికి అదే కారణం. నీటి వల్ల కింద ఉన్నటువంటి నౌక యానానికి, జలరవాణాకు ఇబ్బంది ఉండకూడదని, ఇప్పుడు కట్టే బ్రిడ్జిలన్నింటిని జల రవాణాకు అనుకూలంగా నిర్మాణం చేస్తున్నాము. కేంద్ర ప్రభుత్వం భద్రాచలం నుంచి మహారాష్ట్ర బోర్డరు వరకు జల రవాణపై చాలా ఇంట్రస్ట్ చూపిస్తోంది. ఆ విషయమై ముఖ్యమంత్రి గారితో డిస్కస్ చేయడం జరిగింది. రిపోర్టు కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపించి గోదావరి నదిని జలరవాణాకు ఉపయోగించుకునే విధంగానే ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. గౌరవ సభ్యులు జాఫర్ గారు హైదరాబాద్ పట్టణానికి సంబంధించిన కొన్ని రహదారుల గురించి అడిగారు. మా పరిధిలో ఉన్న రహదారులన్నింటికి నిన్ననే టెండర్లు పిలిచాము, పనులు జరుగుతున్నాయి, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వాటికి కూడా నిధులు తీసుకువచ్చాము. సుమారు 100 కోట్ల రూపాయలతో హైదరాబాద్‌లోని నేషనల్ హైవేలన్నింటిని త్వరలో పూర్తి చేస్తామని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. కొంత మంది శాసనసభ్యులు పంచాయతీ రాజ్ రోడ్లను ఆర్ అండ్ బికి మార్చమని చెప్పారు. తప్పకుండా మా పరిమితుల్లో ఉన్న రహదారులు, పంచాయతీరాజ్‌లో పి.ఎమ్.జి.ఎస్.వై. కానీ, నాబార్డు కింద బిటి వేసి ఉంటే వాటిని ట్రాన్స్‌ఫర్ చేయండి. వాటిని తప్పకుండా ఆర్ అండ్ బి తీసుకొని పూర్తి స్థాయిలో మెయిటనెన్స్ చేయిస్తామని గౌరవసభ్యులకు మనవి. గతంలో 10 జిల్లాలు ఉన్నప్పుడు అన్ని జిల్లా కేంద్రాలకు 4లైన్స్ రహదారిని ఏర్పాటు చేశాము, కొత్త జిల్లాలు వచ్చిన తరువాత ఆరేడు జిల్లాలు మిగిలిపోయాయి. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో పెద్దపల్లి, మహబూబ్‌నగర్‌లోని ఒక జిల్లా ఉన్నాయి, ఆ ఆరేడు జిల్లాలకు కూడా 4లైన్ రోడ్‌ని వేసే బాధ్యత తెలంగాణ ప్రభుత్వమే తీసుకుంటుందని ఈ సందర్భంగా మనవి. 100-125 మండలాలు, కొత్తగా ఏర్పాటయిన మండలాలకు సంబంధించిన డబుల్‌రోడ్ల ప్రపోజల్స్‌ను కూడా తెప్పిస్తున్నాము. అన్ని మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్, అన్ని జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్ ముఖ్య పట్టణానికి 4 లైన్ ఉంటుంది. రేపు రాబోయే రెండున్నర సంవత్సరాల్లోనే వాటిని పూర్తి చేయిస్తామని కూడా మనవి. ఇంత పెద్దఎత్తున రహదారులకు సహకరించిన ముఖ్యమంత్రి గారికి ధన్యవాదములు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ రాష్ట్ర అభివృద్ధి ఏవిధంగా ఉండాలని ఆయన కన్న కలలను సాధించుకొని, తెలంగాణను సాధించుకొని, హరీశ్ రావు గారి కాకతీయ, ఇరిగేషన్, రహదారులు, వాటర్‌వేస్, డ్రైపోర్ట్స్, ఎయిర్‌పోర్ట్స్ మొదలైన అన్ని రంగాలను కూడా అభివృద్ధి చేశారు. ఆయన ముఖ్యమంత్రైన మూడు నెలల్లోనే కేంద్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ప్రతిపాదననిలిచ్చి నందుననే ఇంత త్వరగా నీటన్నింటిని సాధించుకోగలిగాము. బంగారు తెలంగాణ సాధించుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి అనుకుంటున్న తరుణంలో నా శాఖ అగ్రస్థానంలో ఉండాలని కోరుకుంటూ ఆయన ఇచ్చిన సహకారానికి, కేంద్ర ప్రభుత్వ సహకారానికి, మీరిచ్చిన అభినందనలకు ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

శ్రీ కె. జానారెడ్డి:- అధ్యక్షా, ఇప్పటి వరకు ఎంత డబ్బు ఖర్చయింది, మీరు మంజూరు చేసిన దానికి ఇంకెంత కావాలి, ఇంకెంత కాలంలో పూర్తవుతుందని నేను అడిగిన విషయానికి సమాధానం చెప్పలేదు. ఈ ప్రభుత్వమే పూర్తి చేస్తుందనే మాట చెప్పారు. అంటే ఎన్నిసంవత్సరాలైనా మీరే ఉండి పూర్తి చేస్తారా?

(అంతరాయం)

( ట్రెజరీ బెంచీల నుంచి కొంత మంది సభ్యులు సుమారు 25 సంవత్సరాలని మాట్లాడటం జరిగింది)

అదే చెప్పండి. పది హేను సంవత్సరాలని, ఇరవై సంవత్సరాలని, ఇరవై ఐదు సంవత్సరాలని చెప్పండి. అంటే 25 సంవత్సరాల్లో పూర్తవుతదని చెప్తే, సరే 25 సంవత్సరాలు మీరే ఉంటారని, మీరే చేస్తారని చెప్పండి.

**2.30 మ.** శ్రీ తుమ్మల నాగేశ్వర రావు : పెద్దలు జానా రెడ్డి గారు నాకు గురువు గారితో సమానం. 1982 సంవత్సరం నుండి కుడి ఎడంగా ఆయన అడుగుజాడల్లోనే వెళ్తున్నాను. ప్రణాళికలో 21 వేల కోట్లు ఉన్న మాట వాస్తవము. రూ. 13,360 కోట్లు శాంక్షన్ చేశామని చెప్పాము. మొదటి సంవత్సరం నీటన్నింటికీ ఎందుకు డిలే అయ్యిందో కూడా చెప్పాను. ఇప్పటి నుండి డిలే అయ్యే ప్రశ్నే లేదు. గత సవత్సరం, ప్రస్తుత సంవత్సరానికి రెన్యువల్స్ 5150 కిలో మీటర్లు చేశాము. సుమారు రూ. 12 వందల కోట్లు ఖర్చు పెట్టాము. అదే విధంగా రెండున్నర సంవత్సరాల్లో రూ. 4200 కోట్ల పనులు జరుగుతున్నాయి. ఇంకా రూ. 350 కోట్లకు బిల్స్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇరిగేషన్ గాని, రోడ్లు, మిషన్ భగీరథ గాని గతంలో బిల్లు తీసుకోవాలంటే ఏ రకమైన పద్ధతి ఉండేదో చిన్నారెడ్డి గారికి తెలుసు,

శాసన సభ్యులకూ తెలుసు. రూ.350కోట్లు కూడా రాబోయే కొద్ది రోజుల్లోనే రిలీజ్ చేస్తాము. వర్కింగ్ సీజన్ కాబట్టి, ఆర్ అండ్ బి శాఖకు, ఇరిగేషన్ శాఖకు, భగీరథకు ముఖ్యమంత్రి గారు ప్రాముఖ్యతను ఇస్తూనే, వచ్చిన నిధులన్నీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మీదనే ఖర్చు పెట్టమని చెప్పారు. కాబట్టి, పెండింగ్ బిల్స్ కూడా ఉండవని మనవి చేస్తూ, ఈ పనులు వేగవంతం కావాలంటే కాంట్రాక్టర్లను కూడా ఇబ్బంది పెట్టకూడదనే విషయం రాష్ట్ర ప్రభుత్వం గమనించింది. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని తెలియజేస్తున్నాను.

శ్రీ కె. జానా రెడ్డి :– అధ్యక్షా, నేను వేరే విధంగా అనడం లేదు. మీకు వాస్తవం అర్థం కావడానికి, సాధ్యాసాధ్యాల గురించి మీకు ఎప్పుడైనా సూచనలు ఇవ్వడానికి అక్కరకు వస్తుంది. రెన్యువల్స్ కలుపుకుని సుమారు రూ. 24 వేల కోట్లు మంజూరు చేస్తే మీరు చెప్పిన ప్రకారం 3 సంవత్సరాల్లో రూ. 6 వేల కోట్లు ఖర్చు అయితే మిగతా రూ. 18 వేల కోట్లకు 9 సంవత్సరాలు పడుతుంది. మిగిలిన 2 సంవత్సరాల్లో చేయడానికి రూ. 8 వేల కోట్లు ఖర్చు అవుతుంది. మరో టర్మ్‌లో చేయాలంటే కూడా దాటిపోతుంది. ఈ పనులు పూర్తి చేయాలంటే మూడవ టర్మ్ కావాల్సి వస్తుంది. ఇవే కాకుండా ఇంకా మా వద్ద ప్రణాళిక ఉంది. ఆ పనులు కూడా చేయబోతున్నామని అన్నారు. ఆ పనులకు అంచనా ఎంత అనేది లేదు. మీరు మంజూరు ఇచ్చినవాటితోనే పనులు పూర్తి చేయడానికి 9 నుండి 10 సంవత్సరాల సమయం పడుతుంది. మీరు పని చేయించడంలో ఏ ఇబ్బంది వచ్చినా ప్రభుత్వం ఇప్పుడే సమాధానం ఇవ్వడానికి లేదు కాబట్టి, తగిన చర్యలు తీసుకుని వచ్చే బడ్జెట్‌లో వచ్చే సంవత్సరాలకు ప్రణాళికా బద్ధంగా ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి సూచన ఇస్తున్నాను.

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు:– తప్పకుండా పెద్దల సూచన పాటిస్తూనే, మొత్తం మేము అనుకున్న రీతిలో పూర్తి కావాలంటే రూ. 21వేల కోట్లు కావాలని ప్రణాళిక చేశాము. ఇప్పటికి రూ. 13,380 కోట్లకు శాంక్షన్లు ఇచ్చాము. గత సంవత్సరం రూ. 3 వేల కోట్లు, ఈ సంవత్సరం రూ. 3 వేల కోట్లు అవసరమైతే ఒకట్రెండు కోట్ల రూపాయలు పెట్టాలన్నా ఈ సంవత్సరం కూడా ప్రిపేర్ అవుతున్నాము. నిధులు ఏ రకంగా సమకూర్చుకోవాలో ఆ రకంగా సమకూర్చుకుంటాము. మిషన్ భగీరథకు, మిషన్ కాకతీయకు ఏరకంగా నిధులు వచ్చాయో ఆరకంగానే వస్తాయి. అవసరమైతే అప్పు చేసైనా సరే రాబోయే రెండున్నర సంవత్సరాల్లో మేము ఇచ్చిన శాంక్షన్స్‌ని మేము పూర్తి చేస్తామని పెద్దలు జానా రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ కె. జానా రెడ్డి : అధ్యక్షా, గత సంవత్సరం నేషనల్ హైవేలకు సంబంధించి రూ.450కోట్లు మాత్రమే వచ్చాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రణాళిక మరియు రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రణాళికకు సంబంధించి సుమారు 13 నుండి 14 వేల కోట్ల రూపాయల అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వం నుండి ఏటా 3 నుండి 4 వేల కోట్ల రూపాయలు తీసుకురాకపోతే 5 నుండి 6 సంవత్సరాల్లో కూడా పూర్తి అయ్యే పరిస్థితి లేదు. ఒక కిలో మీటరుకు 4 నుండి 5 కోట్ల రూపాయల ఖర్చు అయితే సుమారు రూ. 14 వేల కోట్లు కావాలి. రూ. 14 వేల కోట్లు కావాలంటే క్రిందిటి సంవత్సరంలాగా రూ. 450 కోట్లు వస్తే చాలదు. కేంద్ర ప్రభుత్వం నుండి సాధించడానికి మీరు ప్రయత్నం చేస్తుండండి, మేము మరియు ఇక్కడ ఉన్న బిజెపి వారు కూడా సహకరించి ఈ కమిట్‌మెంట్‌ను సాధించడానికి ప్రయత్నం చేద్దాం.

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు :– అధ్యక్షా, మీ నియోజక వర్గానికి వచ్చినప్పుడు కూడా రెండు మూడు రోడ్లు వేయడానికి మాట ఇచ్చాము, ఆ రోడ్లను పంచాయతీ రాజ్ శాఖ నుండి టేకప్ చేస్తాము. అదే విధంగా పెద్దలు జానారెడ్డి గారికి ఏమి చెప్తామంటే నేషనల్ హైవే నుండి ఈ సంవత్సరమే 2690 టెండర్లను పిలిచాము. డబ్బులు గురించి మీరు అడగొద్దు అని గడ్కరీ గారు చెప్పారు.

చేపట్టిన రోడ్లన్నీ నేషనల్ హైవేలు, టోలు రోడ్లు. ఎన్ని రోడ్లకు శాంక్షన్స్ తీసుకుని ల్యాండ్ అక్విజిషన్ చేయగలిగితే రూ.8వేల కోట్లు ఖర్చు పెట్టడానికి కేంద్ర మంత్రి సిద్ధంగా ఉన్నారు. ల్యాండ్ అక్విజిషన్‌కి కూడా కేంద్ర ప్రభుత్వమే డబ్బులు ఇస్తానని చెప్పింది. మీరు ఎంత తొందరగా ల్యాండ్ అక్విజిషన్ చేస్తే అంత తొందరగా డబ్బులు ఇస్తామని చెప్పింది. కేంద్ర ప్రభుత్వం వద్ద నిధులకు కొరత లేదు. పెద్దలు జానా రెడ్డి గారు ఆ విషయంలో భయపడాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా కష్టపడాల్సిన అవసరం ఉంది. తప్పకుండా చేస్తామని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

MR.SPEAKER: The House is adjourned to meet at 10.00 A.M. on 26.12.2016.

(Then the House adjourned at 2.39 P.M. to meet again at 10.00 A.M. on Monday, the 26th December 2016.)

*****

“Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the
Telangana Legislative Assembly and printed at the Assembly Press,
Public Gardens, Hyderabad.”